ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి




# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY


అక్రిడేషన్ కు కలవు
విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
తెలుగుదిన పత్రికలో రిపోర్టర్లు కావలెను
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యం
కొత్త వారికి కూడా అవకాశం
సంప్రదించవలసిన ఫోన్ నంబర్స్ :
9440897445, 8074636674

బుధవారం 02 సెప్టెంబర్ 2026 | Wednesday 02 Septembar 2026 | హైదరాబాద్ Hyderabad | పేజీలు: 12+12 | వెల: రూ.1.00 | PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
సంపుటి: 28 సంచిక: 142 | Vol.No 28 Issue No .142 | www.visionandhra.in

## విజన్ ఆంధ్ర ఎఫెక్ట్...

# రాష్ట్ర వ్యాప్తంగా నకిలీ డాక్టర్లపై ఉక్కుపాదం...!



- హైదరాబాద్‌లో 12 మంది నకిలీ డాక్టర్లపై చర్యలు
- నకిలీ డాక్టర్లకు చుక్కలు చూపిస్తాం..!
- కమిషనర్ సజ్జనార్ సంచలన ప్రకటన

హైదరాబాద్ డెస్క్, సెప్టెంబర్ 01, (విజన్ ఆంధ్ర) :

ఒక చిన్న పట్టణ ఆసుపత్రిలో జరుగుతున్న అక్రమాన్ని ఏ పత్రిక పట్టించుకోని వేళ.. విజన్ ఆంధ్ర దినపత్రిక సాహసంతో బయటపెట్టిన నిజం.. ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల ప్రాణాలకు భరోసాగా మారింది. విజన్ ఆంధ్ర పత్రిక ఆగస్టు 7న "జోగిపేట ప్రభుత్వాసుపత్రిలో బినామీ వైద్యులు" అనే పేరిట ప్రచురించిన పరిశోధనాత్మక కథనం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖలో పెద్ద దుమారం రేపింది. ప్రభుత్వ వైద్యుడు డా.రమేష్ తన డ్యూటీని ఎగ్గొట్టి, తన స్థానంలో ప్రైవేట్ డెంటల్ క్లినిక్ నడిపే రవి అనే వ్యక్తితో వైద్యం చేయిస్తున్న వైనాన్ని విజన్ ఆంధ్ర ఫోటోలతో సహా బట్టబయలు చేసింది.

మిగతా 2లో..

# స్వదేశీ నినాదంతో ముందుకు సాగండి



- బంగారాన్ని అనవసరంగా కొనకండి
- డెస్టినేషన్ పేరుతో విదేశాల్లో పెళ్లిళ్లకు దూరం కండి
- దేశప్రజల సమిష్టి కృషితోనే జిడిపి వృద్ధిరేటు
- దేశ జీడీపీ 7.8 శాతం మేర వృద్ధి సాధించడం గర్వకారణం
- ఇన్‌స్టా వేదికగా ప్రధాని మోడీ దేశ ప్రజలకు అభినందనలు

న్యూఢిల్లీ,సెప్టెంబర్1 : భారత్ సాధించిన వృద్ధి రేటు దేశ సమష్టి శక్తికి నిదర్శనమని భారత ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. నిరాశావాదులు మాత్రం తమ అసత్యాలను వ్యాప్తి చేస్తూనే ఉన్నారని విమర్శించారు.

మిగతా 2లో..

# ఢిల్లీకి చేరిన కొండా పంచాయితీ



- హైకమాండ్ నుంచి సురేఖకు పిలుపు..!
- కేసీ వేణుగోపాల్‌తో సురేఖ భేటీ చాన్స్!
- రాజకీయ ప్రకంపనలు రేపుతున్నపరిణామాలు



న్యూఢిల్లీ,సెప్టెంబర్1 : తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో మరోసారి రాజకీయ ఉత్కంఠ తీవ్ర స్థాయికి చేరుకుంది. మంత్రి కొండా సురేఖ కు.. ఢిల్లీ హైకమాండ్ నుంచి పిలుపు రావడం, ఆమె హస్తినకు బయల్దేరడం ఇప్పుడు పార్టీ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారింది. కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి వచ్చిన పిలుపు నేపథ్యంలోనే ఆమె హస్తినకు వెళ్లినట్లు సమాచారం. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో కొండా సురేఖ భేటీ కానున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అపాయింట్‌మెంట్ కోసం కూడా కొండా సురేఖ ప్రయత్నించినట్లు సమాచారం. దీంతో కొండా సురేఖ విషయంలో హైకమాండ్ ఎలాంటి నిర్ణయం తీసుకోబోతోందనే చర్చ జోరందుకుంది. గత కొంతకాలంగా మంత్రి

మిగతా 2లో..

# హైడ్రా రంగనాథ్‌కు హైకోర్టులో ఊరట


- సింగిల్ జడ్జ్ ఉత్తర్వులను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు



హైదరాబాద్,సెప్టెంబర్1 : హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు తెలంగాణ హై కోర్టులో ఊరట లభించింది. శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ కేసులో ఆయనపై సింగిల్ బెంచ్ ఇచ్చిన ఆర్డర్‌ను డివిజన్ బెంచ్ సస్పెండ్ చేసింది. తదుపరి విచారణ నవంబర్ 3వ తేదీకి న్యాయస్థానం వాయిదా వేసింది. అప్పటి వరకు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ని మార్చాలనే సింగిల్ బెంచ్ ఆర్డర్‌ను తాత్కాలికంగా డివిజన్ బెంచ్ సస్పెండ్

# ఎన్‌పీఎస్‌లో భారీ మార్పులు..

- అక్టోబర్ 1 నుంచి అమల్లోకి..




న్యూఢిల్లీ,సెప్టెంబర్1 : నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్)లో కీలక మార్పులు రానున్నాయి. పథకాలను ఎలా వర్గీకరించాలి? వాటి వివరాలను ఎలా చూపించాలి? అన్నదానిపై పెన్షన్ నియంత్రణ సంస్థ పీఎఫ్ఆర్‌డీఏ కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. ఆగస్టు 28న జారీ చేసిన సర్క్యులర్‌లో ఈ మార్పులను ప్రకటించింది. 2026 అక్టోబర్ 1 నుంచి కొత్త

మిగతా 2లో..

# కాంగ్రెస్‌లో చేరేందుకు ఎవరు ప్రయత్నించారు?

- కవిత దొంగచాటుగా కాంగ్రెస్‌లో ప్రవేశించే యత్నం చేయలేదా
- ఎవరి స్వలాభం కోసం ఆమె విమర్శలు చేస్తున్నారో తెలుసు
- కష్టకాలంలో మేము మాత్రమే కెసిఆర్‌ను వెన్నంటి ఉన్నాం
- కవిత వ్యాఖ్యలపై మండిపడ్డ మాజీ మంత్రి వేముల



నిజామాబాద్,సెప్టెంబర్1 : కాంగ్రెస్‌లో చేరేందుకు పలువురిని కలిసి రాయబేరాలు నడిపిన కవిత తనను విమర్శించడం విడ్డూరంగా ఉందని బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కెసిఆర్‌కు నమ్మకబంట్లుగా ఉన్న వారిని విడదీసి పార్టీని బలహీన పర్చాలన్న ఎజెండాతో కవిత పనిచేస్తున్నారని ఆయన విమర్శించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై, ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలపై వేముల ప్రశాంత్‌రెడ్డి

మిగతా 2లో..

# కెసి వేణుగోపాల్‌తో సిఎం రేవంత్ భేటీ

## తాజా రాజకీయాలపై చర్చించినట్లు సమాచారం

న్యూఢిల్లీ,సెప్టెంబర్1 ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. రాష్ట్రంలో ఇటీవలి రాజకీయ పరిమాణాలపై ఇరువురి మధ్య కీలక చర్చ జరిగినట్లు

మిగతా 2లో..

# ఎంపీ ల్యాడ్స్ నిధులపై దుష్ప్రచారం తగదు

- ఎంపీలపై అభాండాలు వేయడం సరికాదు
- ఎంపవర్డ్ ఇండియన్ సంస్థ నివేదికపై బండి



కరీంనగర్,సెప్టెంబర్1 : ఎంపీ ల్యాడ్స్ నిధుల వినియోగంపై దుష్ప్రచారాలు తగవని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఎంపవర్డ్ ఇండియన్ సంస్థ విడుదల చేసిన నివేదికపై బండి స్పందించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా కేటాయిస్తున్న ఎంపీ ల్యాడ్స్ నిధులను వినియోగించు కోవడంలో పార్లమెంట్ సభ్యులు పూర్తిగా వెనుకబడ్డారన్న ఆ సంస్థ నివేదిక సత్యదూరమని బండి సంజయ్ కుమార్ తెలిపారు. ఎంపీ ల్యాడ్స్ కింద పంపిన ప్రతిపాదనలకు సంబంధించి పనుల పురోగతి వంటి అంశాలను పరిగణనలోకి

మిగతా 2లో..

# పెన్షన్లతో ఆర్థిక భరోసా

- కుటుంబంలో పెరిగిన గౌరవం
- ఇప్పటి వరకూ రూ. 75 వేల 503 కోట్ల పెన్షన్లు ఇచ్చాం
- వీటితో మూడు పోలవరాలు కట్టగలం
- మంచి కోసం సూచనలు,సలహాలు స్వీకరిస్తా
- అభివృద్ధిని అడ్డుకుంటున్న గొడ్డలిపార్టీ
- మీ దీవెనలు ఇలాగే ఉంటే ఇంకా అభివృద్ధి చేస్తా
- మొగల్తూరు పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో చంద్రబాబు




భీమవరం,సెప్టెంబర్1 : పెన్షన్లతో పేద కుటుంబాల్లో భరోసా నింపామని సిఎం చంద్రబాబు అన్నారు. ఇప్పుడు ఆయా కుటుంబాల్లో పెద్దలకు గౌరవం దక్కుతోందన్నారు. మహిళలు స్వయం సమృద్ధి సాధించడానికి డ్వాక్రా సంఘాలను స్థాపించామని సీఎం తెలిపారు. తన తల్లికి వచ్చిన కష్టం ఎవరికీ రాకూడదని దీపం పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్లు ఇచ్చామన్నారు. ప్రస్తుతం మగవారితో సమానంగా ఆడవారు ఎదిగారని అన్నారు. భవిష్యత్తులో మగవారిని మించిపోయినా ఆశ్చర్యపోనక్కర్లేదని చెప్పుకొచ్చారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెన్షన్లు ఇస్తూ ఆదుకుంటున్నామన్నారు. దేశంలో నాలుగు వేలు, ఆరువేలు, పదివేలు, పదిహేను వేలు పెన్షన్లు ఇస్తున్న రాష్ట్రం ఏపీనే అని అన్నారు. ఇప్పటి వరకూ 75 వేల 503 కోట్ల రూపాయలను పెన్షన్లు ఇచ్చామని.. ఆ డబ్బుతో మూడు పోలవరం ప్రాజెక్టులు కట్టవచ్చన్నారు. ఆర్థిక అసమానతలు పోవాలని.. అందరికీ సంక్షేమం అందాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు. 45 సంవత్సరాల రాజకీయ జీవితంలో ఎన్నోసార్లు నరసాపురం వచ్చానని..అనేక పాలనా సంస్కరణలకు నాంది పలికామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. మొగల్తూరులో లబ్ధిదారులకు

మిగతా 2లో..

# కాంగ్రెస్ అరాచకానికి పాల్పడుతుంది

- అందుకు రాంచందర్ రావు అరెస్ట్ నిదర్శనం
- కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెబుతారు
- బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్



న్యూఢిల్లీ,సెప్టెంబర్1 : తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావును పోలీసులు అరెస్టు చేయడాన్ని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తీవ్రస్థాయిలో

మిగతా 2లో..

# ప్రైవేటు పరం కానున్న సింగరేణి..!

- ప్రైవేటుకు అప్పగించేందుకు సన్నాహాలు
- భారీ నష్టాల్లో భూగర్భ బొగ్గు గనులు




హైదరాబాద్,సెప్టెంబర్1 : కేంద్ర బొగ్గు శాఖ సూచనల మేరకు భారీ నష్టాల్లో ఉన్న భూగర్భ బొగ్గు గనులను ప్రైవేటుకు అప్పగించేందుకు సింగరేణి సంస్థ ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. ఈ గనులను గని అభివృద్ధి, నిర్వహణ(ఎండీవో) విధానంలో ప్రైవేటు సంస్థలకు ఇచ్చేందుకు పరిశీలన చేస్తోంది. జాతీయ సంస్థలైన కోల్ ఇండియా, వెస్ట్రన్స్ కోల్‌ఫీల్డ్స్‌లలో ఈ విధానం అమలుతో నష్టాలు తగ్గించుకున్న నేపథ్యంలో అదే బాటలో సింగరేణి సైతం వెళ్లాలని

మిగతా 2లో..

## కాంగ్రెస్ అరాచకానికి పాల్పడుతుంది

తప్పుబట్టారు. ఈ అనైతిక చర్య కాంగ్రెస్ ప్రభుత్వ దివాలాకోరుతనానికి, నియంతృత్వ వైఖరికి అద్దం పడుతోందని మండిపడ్డారు. కాంగ్రెస్ కార్యకర్తల దాడికి గురైన నల్గొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళుతున్న రాంచందర్ రావును పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేయడం అత్యంత హేయమని నితిన్ నబీన్ అన్నారు. కాంగ్రెస్ శ్రేణులు భౌతిక దాడులు, అరాచకాలకు పాల్పడుతున్నప్పుడు ప్రేక్షక పాత్ర వహించిన పోలీసు యంత్రాంగం... బాధితులకు అండగా నిలిచేందుకు వెళుతున్న ప్రతిపక్ష నేతలను అరెస్ట్ చేయడం ఏ రకమైన ప్రజాస్వామ్యమని ప్రశ్నించారు. రాజ్యాంగ పరిరక్షణ గురించి కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ చెప్పే మాటలన్నీ కేవలం ప్రజలను మభ్యపెట్టే నాటకాలని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తున్న ఈ దౌర్జన్యాలు, ప్రతిపక్షాలపై దాడులకు తెలంగాణ ప్రజలు రాబోయే రోజుల్లో తగిన రీతిలో బుద్ధి చెబుతారని నితిన్ నబీన్ హెచ్చరించారు. రాంచందర్ రావు కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## ప్రైవేటు పరం కానున్న సింగరేణి..!

భావిస్తోంది. ముందుగా ప్రయోగాత్మకంగా మందమర్రి ప్రాంతంలోని శాంతి ఖని భూగర్భ గనిని అప్పగించేందుకు ప్రైవేటు సంస్థల నుంచి దరఖాస్తులను ఆహ్వానించగా ఒక కంపెనీ ముందుకొచ్చింది. దీంతో సింగరేణి సంస్థ త్వరలో టెండర్లు పిలిచేందుకు కసరత్తు చేస్తోంది. బొగ్గు గనులను ప్రైవేటు సంస్థకు ఇస్తే.. అది సొంత ఖర్చుతో బొగ్గు తవ్వి సింగరేణికి నిర్దిష్ట ధరకు అప్పగిస్తుంది. ఆ తర్వాత దాన్ని మార్కెట్‌లో సింగరేణి అమ్ముకుంటుంది. ప్రస్తుతం శాంతిఖని గనిలో టన్ను బొగ్గు ఉత్పత్తికి సింగరేణికి రూ.21,558 ఖర్చవుతుంది. వెలికితీసిన బొగ్గును కేవలం రూ.4,167కే విక్రయిస్తున్నందున సంస్థకు భారీగా నష్టం వాటిల్లుతోంది. ఎండీవో విధానంలో అప్పగించి ఈ నష్టాన్ని తగ్గించాలనేది సింగరేణి సంస్థ యోచన. భూగర్భ గనుల్లో బొగ్గు ఉత్పత్తి వ్యయం భారీగా పెరగడం.. సింగరేణి ఆర్థిక పరిస్థితిపై ప్రస్తుతం తీవ్ర ప్రభావం చూపుతోంది. యూజీ గనుల్లో ఉద్యోగుల జీతాలు.. స్థిర, చర వ్యయం కలిపి టన్ను బొగ్గు ఉత్పత్తికి, మార్కెట్లో విక్రయధరకు మధ్య అసలు ఏమాత్రం పొంతన ఉండటం లేదు. 2025 చివరి నాటికి మొత్తం 22 భూగర్భ గనులకుగాను 21 నష్టాల్లో ఉన్నట్లు ఈ సంస్థ కేంద్రానికి ఇచ్చిన తాజా నివేదికలో వెల్లడించింది. ఈ 21 గనుల నష్టాలు రూ.1,924 కోట్లకు పైగా ఉన్నాయని చెప్పింది. అడ్రియాల యూజీ గనిలో టన్ను బొగ్గు ఉత్పత్తికి మొత్తం వ్యయం రూ.30,333 కాగా విక్రయ ధర రూ.2,492 మాత్రమే ఉందని సంస్థ వెల్లడించింది. టన్నుకు ఏకంగా రూ.27,841 నష్టం వాటిల్లుతోందని.. ఈ ఒక్క గనిలోనే గతఏడాది రూ.302.87 కోట్ల నష్టం వచ్చినట్లు పేర్కొంది. సింగరేణి ప్రస్తుతం 21 భూగర్భ, 17 ఓపెన్ కాస్ట్ గనులను నిర్వహిస్తోంది. ఉపరితల గనుల్లో భారీ యంత్రాలతో అధిక ఉత్పత్తి సాధించే అవకాశం ఉండటంతో టన్నుకు ఉత్పత్తి వ్యయం తక్కువగా ఉంటుందని సంస్థ అధికారులు చెబుతున్నారు. ఇలా భూగర్భ గనుల నష్టాలను ఓసీలతో వచ్చే లాభాలతో సరిచేస్తున్నారు. ఇవి లేకుంటే సింగరేణి సంస్థ ఈపాటికే నష్టాల్లో మునిగిపోయేదని అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి.

## ఎన్‌పీఎస్‌లో భారీ మార్పులు..

నిబంధనలు అమల్లోకి రానున్నాయి. ఇకపై ఎన్‌పీఎస్ పథకాలను ఈక్విటీ పెట్టుబడి ఆధారంగా ఐదు కేటగిరీలుగా విభజిస్తారు. 80-100 శాతం ఈక్విటీ ఉన్న పథకాలు 'కేటగిరీ-ఏ'లో ఉంటాయి. వీటిని అత్యంత అధిక రిస్క్ ఉన్న 'అగ్రెసివ్ గ్రోత్' పథకాలుగా చూపిస్తారు. 60-80 శాతం ఈక్విటీ ఉన్నవి 'కేటగిరీ-బీ'లో ఉంటాయి. వీటిని అధిక రిస్క్ ఉన్న 'హై గ్రోత్' పథకాలుగా పేర్కొంటారు. 35-60 శాతం ఈక్విటీ ఉన్నవి 'కేటగిరీ-సి'లో ఉంటాయి. ఇవి మధ్యస్థ రిస్క్ ఉన్న 'బ్యాలెన్స్‌డ్ గ్రోత్' పథకాలు. 10-35 శాతం ఈక్విటీ ఉన్నవి 'కేటగిరీ-డి'లో ఉంటాయి. వీటిని 'కన్జర్వేటివ్'గా పరిగణిస్తారు. 0-10 శాతం ఈక్విటీ ఉన్నవి 'కేటగిరీ-ఈ'లో ఉంటాయి. ఇవి రుణ ఆధారిత పథకాలుగా ఉంటాయి. ఒక పథకం ఈక్విటీ పరిమితి రెండు కేటగిరీల్లోకి వచ్చేలా ఉండకూడదు. దీంతో పెట్టుబడిదారులు తమ రిస్క్ స్థాయికి తగ్గ పథకాన్ని సులభంగా ఎంచుకోవచ్చు. ఎన్‌పీఎస్‌లో చేరే వారికి మరో మార్పు కూడా ఉంది. అక్టోబర్ 1 నుంచి 'పాయింట్ ఆఫ్ ప్రజెన్స్' (పీఓపీ) ద్వారా కొత్తగా ఎన్‌పీఎస్ ఖాతా తెరిచే వారికి ఒక్కో పీఆర్‌ఏఎన్‌పై రూ.200 వన్‌టైమ్ ఛార్జీ వసూలు చేస్తారు. ఈ మొత్తాన్ని ఒకేసారి కాకుండా ప్రతి త్రైమాసికానికి రూ.50 చొప్పున యూనిట్లను రద్దు చేసి వసూలు చేస్తారు. పథకాలను ఎంచుకునే ముందు పెట్టుబడిదారులకు మరింత సమాచారం అందేలా పీఎఫ్‌ఆర్‌డీఏ చర్యలు తీసుకుంది. పథకం పేరు, పెన్షన్ ఫండ్, ప్రారంభ తేదీ, రాబడులు, బెంచ్‌మార్క్, ఛార్జీలు, రిస్క్‌మీటర్, నిర్వహణలో ఉన్న ఆస్తుల వివరాలు ఒకే విధానంలో కనిపించనున్నాయి. అయితే ప్రభుత్వ రంగ ఎన్‌పీఎస్ ఖాతాలకు కొత్త వర్గీకరణ వర్తించదు.

## స్వదేశీ నినాదంతో ముందుకు సాగండి

యుద్ధాలు, సరఫరా వ్యవస్థల్లో అడ్డంకుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా గడ్డు పరిస్థితులు నెలకొన్నప్పటికీ భారత్ మెరుగైన వృద్ధి రేటు సాధించిందని చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో భారత దేశ జీడీపీ ఏకంగా 7.8 శాతం మేర వృద్ధి చెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ప్రధాని మోదీ దేశ ప్రజలకు అభినందనలు చెప్పారు. 7.8 శాతం వృద్ధి రేటు నమోదవడంతో దేశవ్యాప్తంగా హర్షం వ్యక్తమవుతోందని అన్నారు. దేశ ప్రజల పట్టుదల, శక్తిసామర్థ్యాలు గొప్పవని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా గడ్డు పరిస్థితులు నెలకొన్నా భారత్ వృద్ధి పథంలో దూసుకుపోతోందని అన్నారు. భారత దేశ ప్రగతిని ఇలాగే కొనసాగించాల్సిన అవసరం ఉందని కూడా ప్రధాని చెప్పారు. ఆత్మనిర్భరత సాధించడం అవసరమని మరోసారి చెప్పారు. స్వదేశీ వస్తువులకు దేశ ప్రజలు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అనవసర విదేశీ పర్యటనలు, బంగారం కొనుగోళ్లు వద్దని అన్నారు. విదేశీ మారకనిల్వల పొదుపు కోసం భారత్‌లోనే వివాహాది శుభకార్యాలు జరుపుకోవాలని సూచరించారు. ఈ సందర్భంగా దేశ ప్రజలకు అభినందనలు తెలిపిన ఆయన.. గతంలో చేసిన విజ్ఞప్తినే మరోసారి గుర్తుచేశారు. స్వదేశీ వస్తువులనే కొనుగోలు చేయాలని, విదేశీ ప్రయాణాలు వద్దని, అవసరం లేకుండా బంగారం కొనొద్దని మరోసారి కోరారు. ప్రస్తుతం కిర్గిస్థాన్ పర్యటనలో ఉన్న ఆయన ఈ మేరకు ఇన్‌స్టా వీడియో విడుదల చేశారు. దేశ ప్రజలకు అభినందనలు. 7.8? వృద్ధి గొప్ప విషయం. ప్రజల సంకల్ప బలం, కృషికి ఇది నిదర్శనం. ప్రపంచం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో భారత్ ఈ అసాధారణ ఘనతను దక్కించుకుంది. ప్రపంచం యుద్ధంలో మునిగిపోయింది. ఎటుచూసినా యుద్ధ వార్తలే.. సంక్షోభాలే. సరఫరా గొలుసు పూర్తిగా దెబ్బతింది. 2020లో కొవిడ్ తర్వాత నుంచి నేటి వరకు ఎక్కడా స్థిరత్వం కనిపించడం లేదు. అయినా భారత్ పురోగమిస్తోందని మోదీ తన వీడియోలో పేర్కొన్నారు. పర్యటనల కోసం విదేశాలకు వెళ్లొద్దు. విదేశాల్లో డెస్టినేషన్ వెడ్డింగ్‌లకు దూరంగా ఉండండి. 'భారత్‌లోనే వివాహం చేసుకోండి' అనే మంత్రాన్నే మనం పాటిద్దాం. అవసరం లేకపోతే బంగారాన్ని కొనడం మానుకోండి. స్థానికంగా తయారైన వస్తువులు, సేవలు ఎంత ఎక్కువగా ఎంచుకుంటే.. దేశం అంత ఎక్కువగా అభివృద్ధి చెందుతుంది. మనం స్వావలంబనకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ఉంటే.. స్వాతంత్ర్యం వచ్చి 100 ఏళ్లు పూర్తయ్యేనాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదుగుతామనే విశ్వాసం నాకు ఉందని మోదీ పేర్కొన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అంచనా వేసిన 7 శాతం కంటే ప్రస్తుత వృద్ధి రేటు ఎక్కువ. అమెరికా- ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయంగా అనిశ్చితులు, ఇంధన సరఫరాకు అవరోధాలు వంటి పరిస్థితులను తట్టుకొని భారత ఆర్థిక వ్యవస్థ రాణించడం విశేషం. ఈ వృద్ధిని దేశ ప్రజలు వేడుకలా నిర్వహించుకోవాలి. అదే సమయంలో వికసిత్ భారత్ దిశగా కృషి చేయాలి. 140 కోట్ల మంది ప్రజల ఐక్యత.. దేశాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్తుందని ప్రధాని అన్నారు.


## ఎంపీ ల్యాడ్స్ నిధులపై దుష్ప్రచారం తగదు

తీసుకోకుండా ఎంపీలపై అభాండాలు వేయడం సరికాదని పేర్కొన్నారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి ఎంపీ ల్యాడ్స్ కింద రూ.17.50 కోట్లు కేటాయించగా.. అందులో ఇప్పటికే రూ.16.47 కోట్లు వినియోగించామని ఆయన స్పష్టం చేశారు. అందుకు సంబంధించిన వివరాలను గణాంకాలతో సహా బండి సంజయ్ మీడియాకు వివరించారు. 'కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి గత మూడేళ్లలో కమ్యూనిటీ హాళ్లు, బోర్‌వెల్స్, హైమాస్ట్ లైట్లు, సీసీ రోడ్ల నిర్మాణాల కోసం స్థానిక ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు 627 ప్రతిపాదనలు కలెక్టర్‌కు పంపాం. ఇందులో కరీంనగర్ జిల్లా నుంచి 313, హన్మకొండ నుంచి 39, జగిత్యాల నుంచి 45, రాజన్న సిరిసిల్ల నుంచి 151, సిద్దిపేట నుంచి 79 పనులకు సంబంధించిన ప్రతిపాదనలున్నాయి. వీటిలో 82.29 శాతం పనులకు ఆయా జిల్లాల కలెక్టర్లు ఆమోదం తెలిపారు. మిగిలిన పనుల మంజూరు అంశం ప్రాసెస్‌లో ఉంది. మొత్తంగా కేంద్రం కేటాయించిన రూ.17.5 కోట్లలో 94.1 శాతం మేరకు అంటే రూ.16.47 కోట్ల నిధులకు సంబంధించిన పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయని కేంద్ర మంత్రి వివరించారు. ఇందులో 16వ లోక్‌సభ సభ్యుడిగా కొనసాగిన బోయినపల్లి వినోద్ కుమార్ తన ఐదేళ్ల కాలంలో వినియోగించని రూ.2.5 కోట్లను సైతం తాను ఖర్చు చేసినట్లు బండి సంజయ్ తెలిపారు. వాస్తవానికి స్థానిక సమస్యల పరిష్కారానికి సంబంధించి కేంద్రం ఏటా కేటాయిస్తున్న ఎంపీ ల్యాడ్స్ నిధులు సరిపోవడం లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా నిధులను ఏటా పెంచాలని కోరుతూ ఇప్పటికే ఎంపీల నుంచి కేంద్రానికి అనేక విజ్ఞప్తులు వెళ్తున్నాయని తెలిపారు. అయినప్పటికీ ఎంపీ ల్యాడ్స్ నిధులే ఖర్చు చేయడం లేదంటూ ఎంపవర్డ్ ఇండియన్ సంస్థ ప్రచారం చేయడం అన్యాయమని పేర్కొన్నారు. ఎంపీ ల్యాడ్స్ నిధుల కేటాయింపు, ఎంపీల ప్రతిపాదనలు, జిల్లా కలెక్టర్ల ఆమోదం, వివిధ శాఖల అధికారుల కార్యాచరణ, అమలు, పనుల పూర్తి వరకు అనేక దశలు ఉన్నాయని తెలిపారు. ఇవేవీ పట్టించుకోకుండా ఏకపక్షంగా పార్లమెంట్ సభ్యులు ఎంపీ ల్యాడ్స్ నిధులనే వినియోగించుకోవడం లేదని ఆరోపణ చేయడమంటే బట్ట కాల్చి మీద వేయడమేనని మండిపడ్డారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మరో 7 నెలల సమయం ఉన్నప్పటికీ తన వద్ద ఎంపీ ల్యాడ్స్ నిధులే మిగలలేదని, ఆ నిధులకు సంబంధించిన ప్రతిపాదనలన్నీ ఎప్పుడో సంబంధిత జిల్లాల కలెక్టర్లకు పంపామని వివరించారు. స్థానిక సమస్యల పరిష్కారం కోసం తన వద్దకు వచ్చే ప్రజల విజ్ఞప్తులను పరిష్కరించేందుకు అవసరమైన నిధుల కోసం సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) ఫండ్స్‌ను కూడా సేకరిస్తున్నామనే విషయాన్ని ఆ సంస్థ గుర్తుంచుకోవాలన్నారు. ఇకనైనా ఎంపీ ల్యాడ్స్ నిధులకు సంబంధించి నగదు కేటాయింపు, ఎంపీల ప్రతిపాదనలు, జిల్లా కలెక్టర్ల ఆమోదం, వివిధ శాఖల అధికారుల కార్యాచరణ, అమలు, పనుల పూర్తి వరకు దశలవారీగా వాస్తవాలను ఆ సంస్థ పరిగణనలోకి తీసుకుని, వాటిని ప్రజల ముందు ఉంచాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కోరారు.

# రాష్ట్ర వ్యాప్తంగా నకిలీ డాక్టర్లపై ఉక్కుపాదం...!

**విజన్ ఆంధ్ర కథనానికి ప్రభుత్వం సంచలన స్పందన**

మా వరుస కథనాలకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించింది. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్వయంగా ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది తన సొంత జిల్లాలోనే జరగడంపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేసి, ఉన్నతాధికారులకు ఫోన్ చేసి వెంటనే విచారణకు ఆదేశించారు. దీంతో జోగిపేట







ఘటనలో ముగ్గురు ప్రభుత్వ వైద్యులపై వేటుపడింది. మొదట డిప్యూటీ సివిల్ సర్జన్ డా.రమేష్ ను, ఆ తర్వాత డా.శివశంకర్ రెడ్డి, డా.తుల్ల భవానిలను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రైవేట్ వ్యక్తి రవిపై జోగిపేట పోలీస్ స్టేషన్ లో క్రిమినల్ కేసు నమోదైంది. అంతేకాదు, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు జిల్లాకు నూతన డిసిహెచ్ఎస్ గా డా.శ్రీధర్ కుమార్ ను ప్రభుత్వం నియమించింది.

**హైదరాబాద్ లో 12 మంది నకిలీ డాక్టర్లపై చర్యలు**

**- కమిషనర్ సజ్జనార్ వెల్లడి**

జోగిపేటలో విజన్ ఆంధ్ర రేపిన ప్రకంపనలతో హైదరాబాద్ పోలీసు వ్యవస్థ కూడా అప్రమత్తమైంది. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి.సజ్జనార్ IPS నకిలీ డాక్టర్లపై ప్రత్యేక దృష్టి సారించారు.




ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఇప్పటికే కల్తీ ఆహారంపై ఉక్కుపాదం మోపామని, ఇప్పుడు నకిలీ డాక్టర్లపై కూడా అదే స్థాయిలో చర్యలు తీసుకుంటున్నామని ఆయన వెల్లడించారు. ఇప్పటివరకు హైదరాబాద్ పరిధిలో ఔ12 మంది నకిలీ డాక్టర్లపై చర్యలుఔ తీసుకున్నామని ప్రకటించారు. ఈ నకిలీలు అసలైన డాక్టర్లలా నటిస్తూ యాంటీబయాటిక్స్, సెలైన్, స్టెరాయిడ్స్ తో ప్రమాదకర వైద్యం చేస్తున్నారని, దీనివల్ల ప్రజల ఊపిరితిత్తులు, కిడ్నీలు దెబ్బతింటున్నాయని హెచ్చరించారు.

**నకిలీ డాక్టర్లను ఇలా గుర్తించండి**

ప్రతి హాస్పిటల్ కు డిస్ట్రిక్ట్ మెడికల్ ఆఫీసర్ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ ఉండాలని, డాక్టర్లు తమ పేరు పక్కన విద్యార్హత, డెసిగ్నేషన్, మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్







నంబర్ తప్పనిసరిగా డిస్ప్లే చేయాలని కమిషనర్ సూచించారు. అనుమానం వస్తే ఔటీవీజ.ఔఅఔ వెబ్ సైట్ లో ఆ నంబర్ ను చెక్ చేసుకోవాలని, సెకండ్ ఒపీనియన్ తీసుకోవాలని, సమాచారం ఉంటే ఔడయల్ 112ఔ కు ఫోన్ చేయాలని కోరారు.

**ఒక పత్రిక పోరాటం.. రాష్ట్రానికి మేలు చేసింది:**

జోగిపేటలో ఏ పత్రిక పట్టించుకోని అక్రమాన్ని విజన్ ఆంధ్ర ధైర్యంగా బయటపెట్టడం వల్లనే నేడు ముగ్గురు బాధ్యులపై వేటు పడి, రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలు మొదలయ్యాయి. దీంతో విజన్ ఆంధ్ర పత్రిక అందిస్తున్న వార్తకథనాల పట్ల అభినందనలు వెల్లివిరుస్తున్నాయి. ప్రజల పక్షాన నిలబడి నిజాలను వెలికితీసే విజన్ ఆంధ్ర పోరాటం ఇలాగే కొనసాగుతుంది.

## ఢిల్లీకి చేరిన కొండా పంచాయితీ

కొండా సురేఖ, ఆమె కుమార్తె కొండా సుస్మితలకు సంబంధించిన వ్యవహారం తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో తీవ్ర రాజకీయ ప్రకంపనలు సృష్టించిన విషయం తెలిసిందే. ఇటీవలే గీసుకొండలో సీఎం రేవంత్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారానికి దారితీశాయి. ఈ వ్యాఖ్యలపై పార్టీ నేతల్లో అసంతృప్తి వ్యక్తం కావడంతో పాటు.. పార్టీ క్రమశిక్షణ కమిటీ కూడా స్పందించింది. కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలంటూ కొండా సురేఖకు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. అయితే తన కుమార్తె వ్యాఖ్యలకు, తనకు ఎలాంటి సంబంధం లేదని.. అవి ఆమె వ్యక్తిగత వ్యాఖ్యలు అంటూ.. మంత్రి కొండా సురేఖ.. క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవికి తన వివరణ అందించారు. ఆ తర్వాత కొండా సురేఖతో పాటు వనపర్తి వ్యవహారానికి సంబంధించి ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిపై రూపొందించిన నివేదికను టీపీసీసీ అధిష్ఠానానికి పంపినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాల మధ్య ప్రస్తుతం కొండా సురేఖ ఢిల్లీ పర్యటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. హైకమాండ్ పెద్దలతో జరిగే సమావేశంలో తనపై వచ్చిన ఆరోపణలు, కుమార్తె వ్యాఖ్యల వ్యవహారం, పార్టీ అంతర్గత పరిణామాలపై కొండా సురేఖ వివరణ ఇచ్చే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. అయితే ఆమెపై ఎలాంటి చర్య తీసుకుంటారనే అంశంపై ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు.కొండా సురేఖ ఢిల్లీ పర్యటన నేపథ్యంలో కాంగ్రెస్ వర్గాల్లో ప్రధానంగా రెండు రకాల చర్చలు వినిపిస్తున్నాయి. పార్టీ అధిష్ఠానం ఆమెకు కేవలం వివరణ కోరడంతో వ్యవహారాన్ని ముగిస్తుందా లేకపోతే.. పార్టీ క్రమశిక్షణకు సంబంధించిన అంశంగా పరిగణించి ఏదైనా చర్య తీసుకుంటుందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఒకవేళ హైకమాండ్ నుంచి కఠిన నిర్ణయం వచ్చే పరిస్థితి ఉంటే మంత్రి పదవికి సురేఖ రాజీనామా చేసే అవకాశముందనే ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. మరోవైపు.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా రెండు రోజుల ఢిల్లీ పర్యటనకు వెళ్లడం ప్రాధాన్యత సంతరించుకుంది. సీఎం రేవంత్ ఢిల్లీకి వెళ్లిన కొద్దిసేపటికే మంత్రి కొండా సురేఖ కూడా హస్తినకు చేరుకోవడంతో కాంగ్రెస్ అంతర్గత వ్యవహారాలపై చర్చలు జరుగుతున్నాయనే ప్రచారం ఊపందుకుంది. అయితే కేబినెట్‌లో ఖాళీగా ఉన్న స్థానాల భర్తీ అంశం కూడా ఈ ఢిల్లీ పర్యటనలతో మరోసారి తెరపైకి వచ్చింది. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు ఢిల్లీలో పార్టీ పెద్దలను కలుస్తుండటంతో కేబినెట్ విస్తరణపై కూడా నిర్ణయం తీసుకునే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. కొత్త మంత్రుల ఎంపిక, ఖాళీ స్థానాల భర్తీ, పార్టీకి సంబంధించిన ఇతర అంశాలపై హైకమాండ్‌తో చర్చలు జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. అదే సమయంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కూడా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో భేటీ కావడం రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది.

## పెన్షన్లతో ఆర్థిక భరోసా

పెన్షన్లను పంపిణీ చేసిన అనంతరం ప్రజావేదిక సభలో సీఎం మాట్లాడుతూ.. తనకు మొగల్తూరు కొత్తేమీ కాదన్నారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రులు నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవికుమార్, ఉపసభాపతి రఘురామకృష్ణరాజు తదితరులు పాల్గొన్నారు. ప్రజా కార్యక్రమాల్లో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో కోలుకోలేని విధ్వంసం జరిగిందని విమర్శించారు. అటువంటి పరిస్థితి నుంచి 94 శాతం సీట్లలో, 54 శాతం ఓట్లతో కూటమిని ప్రజలు గెలిపించారని అన్నారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి ఇంకా బాగా జరగాలి.. అందుకోసం సలహాలు, సూచనలు చెప్పాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. సంక్షేమం పేదవాడిని నిలబెట్టాలి.. తాత్కాలిక ఉపశమనం ఉండాలన్నారు. చైనా సామెతను ఉదాహరిస్తూ..చేపలు అందించడం కాదు..చేపలు పట్టించడం నేర్పాలని అన్నారు. ప్రతి ఒక్కరూ స్వయం సమృద్ధి సాధించాలన్నదే తమ లక్ష్యమని అన్నారు. ఆడ బిడ్డలు ఎక్కడికి వెళ్లాలన్నా.. ఉచిత బస్సులు తెచ్చాం. దీపం పథకం ద్వారా 3 సిలిండర్లు ఇస్తున్నాం. పేదల సేవ కోసమే మొగల్తూరు వచ్చాను. సీఎం స్థాయిలో అనేక మార్పులు చేశాను. ఎంత సేవ చేసినా మీ రుణం తీర్చుకోలేను. అనేక సంస్కరణలకు నాంది పలికాం.. ప్రజా చైతన్య కార్యక్రమాలు తెచ్చాం. ఎన్నికల్లో మీరిచ్చిన తీర్పును ఎన్నటికీ మర్చిపోలేను. వైకాపా హయాంలో రాష్ట్రానికి కోలుకోలేని నష్టం జరిగింది. కూటమిగా ఏర్పడి రాష్ట్రాన్ని మళ్లీ గాడిన పెడుతున్నాం. 45 సంవత్సరాలుగా వెనుకబడిన వర్గాలు తెదేపాని అంటిపెట్టుకునే ఉన్నాయి. ఆర్టీసీలో మహిళా కండక్టర్ల వ్యవస్థను తీసుకొచ్చాం. త్వరలో మహిళా డ్రైవర్ల వ్యవస్థను తీసుకొస్తాం. వడ్డెర సమాజిక వర్గానికి మైనింగ్ లీజులు పెట్టాం. గౌడ్ కులానికి మద్యంషాపులు కేటాయిస్తున్నాం. డీఎస్సీపై వైకాపా 350 కేసులు వేసింది. వైకాపా చేస్తోన్న ప్రచారాన్ని డీఎస్సీ ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా పింఛన్లు పెంచాం. పేదల పట్ల ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంది. పేదలకు చేయూతనిస్తే ఏదైనా సాధించే సత్తా ఉంటుందని చంద్రబాబు అన్నారు. కొన్ని రోజుల్లో ఎలక్ట్రిక్ బస్సులు వస్తున్నాయని.. వాటిని మహిళలు నడపాల్సిన అవసరం ఉందని సీఎం అన్నారు. డ్వాక్రా ఉత్పత్తులను ప్రపంచవ్యాప్తంగా ఎగుమతి అయ్యేలా చూస్తామని చెప్పారు. మత్స్యకారులకు వేట విరామ సమయంలో ఆర్థిక సహాయాన్ని ఇవ్వడాన్ని తానే ప్రారంభించానని తెలిపారు. ఎలాంటి మంచి పనులు చేసినా అడ్డుపడుతున్నారని ప్రతిపక్షంపై మండిపడ్డారు. ఏజెన్సీలోని పిల్లలకు మెరుగైన విద్య అందిస్తే, ప్రపంచంలోనే మెరుగైన అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని అన్నారు. వాటన్నింటికీ గొడ్డలి పార్టీ అడ్డుపడుతోందని విమర్శించారు. 'ఎంత అడ్డుపడినా నా ఆశయాన్ని ఆపలేరు' అని స్పష్టం చేశారు. డీఎస్సీని అడ్డుకోవడానికి 350 పిటిషన్లు వేశారని.. పారదర్శకంగా ఉద్యోగాలు ఇస్తే, కోడిగుడ్డుకు ఈకలు పీకుతున్నట్లు వ్యవహరిస్తున్నారంటూ ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎస్సీలో టీచర్లుగా ఎంపికైన వారు గొడ్డలి పార్టీని హెచ్చరించినా వారిలో మార్పులేదన్నారు. త్వరలో ఏసీ బస్సులు వస్తున్నాయని.. మహిళలు ఉచితంగా ఆ బస్సుల్లో ఎక్కే రోజులు రాబోతున్నాయని తెలిపారు. మహిళలు ఇంటిపైన సోలార్ పెట్టుకుంటే విద్యుత్ తయారు అవుతుందని.. దానివలన కొన్ని రోజుల్లో ఉచితంగా కరెంటు పొందవచ్చని సూచించారు. వేసవికాలంలో ఎండలు ఎక్కువ ఉంటాయి కాబట్టి.. ఏసీలు పెట్టుకోవచ్చని.. అదనంగా ఉండే విద్యుత్‌ను అమ్ముకోవచ్చ న్నారు. ప్రతి ఇంట్లో ఒక చిన్న పారిశ్రామికవేత్త రావాలని వన్ హౌస్- వన్ ఆంత్రప్రెన్యూర్ అనే పథకాన్ని తీసుకువచ్చినట్లు సీఎం చంద్రబాబు వెల్లడించారు. అందరూ ప్రయత్నం చేస్తే మార్పు ఖచ్చితంగా వస్తుందని.. అనుకుంటే సాధించగలుగుతారని చంద్రబాబు అన్నారు. ఇప్పటికే 5 లక్షల 90 వేలు ఇళ్లు పూర్తి చేశామని.. మరో అయిదు లక్షల ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. అప్పట్లో పరిశ్రమలను పారద్రోలారని.. కూటమి అధికారంలోకి వచ్చాక 22 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయని చెప్పుకొచ్చారు. వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. బుధవారం గోదావరి నీటిని ఉత్తరాంధ్రకు తీసుకెళ్లబోతున్నామని.. చరిత్రను మార్చబోతున్నామని తెలిపారు. భవిష్యత్తులో గోదావరి, కృష్ణ, కావేరి నదులను అనుసంధానం చేస్తామని వెల్లడించారు. మూడేళ్లుగా కరెంటు ఛార్జీలు పెంచలేదని, తగ్గించామని సీఎం అన్నారు. వైసీపీ హయాంలో 9 సార్లు 32 వేల కోట్ల రూపాయల మేర ఛార్జీలు పెంచారని చెప్పారు. లక్షా 50 వేల కోట్లు విద్యుత్ నిమిత్తం అప్పులు చేశారని వివరించారు. రెండు రూపాయలకు కిలో బియ్యం ఇచ్చి పేదలను ఆదుకున్న యుగపురుషుడు ఎన్టీఆర్ అని గుర్తుచేశారు. యూనిట్ రూపాయిన్నరకే ఆక్వాకు కరెంటు ఇస్తూ.. రూ.1200 కోట్లు సబ్సిడీ ఇస్తున్నామని అన్నారు. కేరళంలో ఉన్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అనునిత్యం ప్రజల గురించే ఆలోచిస్తున్నారని తెలిపారు. గొడ్డలి పార్టీకి వణుకు పుట్టిందని.. స్థానిక ఎన్నికల్లో ఏకగ్రీవం అయితే ఊరుకోమని అంటున్నారని చంద్రబాబు తెలిపారు. ప్రజలు ఏకగ్రీవం చేస్తే వారేం చేస్తారని ప్రశ్నించారు. ఆయారాం, గయారాంలకు చెక్ పెట్టేందుకే మున్సిపల్ ఎన్నికల్లో ప్రత్యక్ష ఎన్నికలను తీసుకువచ్చామన్నారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు తీసుకువస్తే, మళ్లీ గొడ్డలి పార్టీ కోర్టుకు వెళ్లిందని.. చిత్తుచిత్తుగా ఓడిపోతామనే భయంతో సర్ పేరుతో మళ్లీ కోర్టుకు వెళ్లారని దుయ్యబట్టారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు ఉంటే చాలదని.. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఉండాలని అన్నారు. సమాజంలో కలుషితం పోవాలని తెలిపారు. జనవరి నుంచి సంజీవని పథకాన్ని తీసుకొస్తున్నామని.. అప్పుడు డాక్టర్లే ప్రజల దగ్గరకు వస్తారన్నారు. 'రాబోయే రోజుల్లో మీ ఫోనే మీకు సర్వస్వం. ఏ పని చేయాలన్నా ఫోన్ ద్వారా చేయవచ్చు. మీ అందరూ ఆనందంగా ఉండడానికి ఏమైనా చేస్తాను. దానిని మీరు కూడా ఉపయోగించుకోవాలి. గొడ్డలి పార్టీ కులాలు, మతాల పేరుతో రెచ్చగొడుతోంది. ప్రజలు కూడా ఆలోచించుకోవాలని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరేందుకు ఎవరు ప్రయత్నించారు?

తీవ్రస్థాయిలో స్పందించారు. కవితను కేసీఆర్‌ను కలపడానికి ప్రయత్నం చేసిన, విడగొట్టడానికి ప్రయత్నం చేసిన విషయం కేసీఆర్‌కు బాగా తెలుసు. పార్టీ లైన్ దాటిన తర్వాత కేసీఆర్ కవితను పార్టీ నుంచి వేటు వేశారని అన్నారు. నేను, మా తండ్రి వేముల సురేందర్‌రెడ్డి టీఆర్ఎస్ పార్టీకి వ్యవస్థాపక సభ్యులం. 2001 తెలంగాణ ఆవిర్భావానికి ముందే టీఆర్ఎస్ పార్టీలో ఉన్నాం. టీఆర్ఎస్ అంటేనే ప్రశాంత్‌రెడ్డి, ప్రశాంత్ రెడ్డి అంటేనే టీఆర్ఎస్ పార్టీ. కవిత మధ్యలో వచ్చింద్రు.. మధ్యలో పోయింద్రని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీతో నేను మంతనాలు చేశానని అంటున్న కవిత.. ఇప్పుడు కష్టకాలంలో కేసీఆర్ వెంట ఉన్నది నేనా.. కవితనా? అసెంబ్లీలో, అసెంబ్లీ బయట, జిల్లాలో రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నది నేనా.. కవితనా? అని ప్రశాంత్‌రెడ్డి ప్రశ్నించారు. లక్ష్మీనరసింహస్వామి సన్నిధానంలో ఉన్న నేను కాంగ్రెస్ లోని ఎవరితో మంతనాలు చేయలేదు. కవిత కాంగ్రెస్‌తో మంతనాలు చేయలేదని చెప్పగలరా? కవిత రహస్యంగా కాంగ్రెస్ నాయకులతో మంతనాలు చేయలేదని చెప్పగలరా? అని ప్రశ్నించారు. నిరాధారమైన ఆరోపణలు ఎవరి లాభం కోసం కవిత చేస్తున్నారు? స్వలాభం కోసం వ్యక్తిగత ప్రతిష్టలు దెబ్బతీసే విధంగా మాట్లాడడం కరెక్ట్ కాదు. నాపై నిరాధారమైన ఆరోపణలు చేసే హక్కు కవితకు లేదని అన్నారు. మొదటి నుంచి టీఆర్ఎస్ పార్టీకి వ్యవస్థాపక సభ్యులుగా ఉన్న వారిని కవిత టార్గెట్ చేస్తున్నారు. కేసీఆర్‌కు దగ్గరగా ఉన్న వారిని కవిత టార్గెట్ చేస్తుంది. ప్రత్యక్షంగా మా నాయకత్వాన్ని బలహీనపరిచి, పరోక్షంగా అధికార పార్టీకి కవిత న్యాయం చేస్తుందని ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. కవిత సభలో కన్నీళ్లు పెట్టుకోవడంపై స్పందిస్తూ.. రాజకీయంగా సింపతిని గెయిన్ చేయడానికి అని అర్థం అవుతుంది. అది ఆమె విజ్ఞతకు వదిలేస్తున్నాం. కవిత చేసే ఈ పనుల వల్ల కేసీఆర్ ఎంత మనోవేదనకు గురవుతున్నారో బిడ్డగా ఆమె ఆలోచించడం లేదని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన గొప్ప నాయకుడు కేసీఆర్. ఆయనపైన, కేటీఆర్‌పైన విమర్శలు చేయగా లేనిది మాపై చేయడం పెద్ద ఆశ్చర్యాన్ని కలిగించ లేదు. కానీ బాధగా అనిపించింది. సొంత లాభం కోసం కవిత మాట్లాడటం పెద్ద బాధగా అనిపించలేదని ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కవితను రెండుసార్లు ఎమ్మెల్సీగా చేయడంలో నా పాత్ర ఏందో కేసీఆర్‌కు బాగా తెలుసు. కవితపై మొన్నటి వరకు కేసీఆర్ బిడ్డగా గౌరవం ఉండేది. నిన్నటి మాటలతో ఆ గౌరవాన్ని కవిత పోగొట్టుకుందని వ్యాఖ్యానించారు. ఇకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమం నిర్వహించారు. వేముల ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో లింబాద్రి గుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు, ప్రయోజనాలను సూచించే 'బాకీ కార్డులకు' ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఆ హామీలను అమలు చేస్తామని చెప్పిందని ప్రశాంత్‌రెడ్డి అన్నారు. 1000 రోజులు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీల్లో అనేక హామీలు నేటికీ అమలుకు నోచుకోలేదని విమర్శించారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీల ద్వారా ఎంత మేర బాకీ పడిందో ప్రజలకు తెలియజేస్తూ, ఇచ్చిన హామీలను ఇకనైనా నెరవేర్చాలని కోరుతూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తు చేసేందుకు బీఆర్ఎస్ చేపట్టిన 'బాకీ కార్డుల పూజ' కార్యక్రమంలో రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, వృద్ధులు తదితర వర్గాలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ప్రజల ముందుంచారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## హైడ్రా రంగనాథ్‌కు హైకోర్టులో ఊరట

చేసింది. తదుపరి ఆదేశాల వరకు లోతుకుంటా భూముల జోలికి వెళ్లవద్దని హై కోర్టు స్పష్టం చేసింది. హైడ్రా కమిషనర్ రంగనాథ్ తరఫున హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు మాజీ సీజే జస్టిస్ రాజీవ్ శక్ధర్ వాదనలు వినిపించారు. శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ కేసుపై అప్పీల్‌కు హైడ్రా కమిషనర్ వెళ్లిన విషయం తెలిసిందే. ఇదే కేసులో రంగనాథ్‌ని తప్పించి మరో అధికారిని నియమించాలని సింగిల్ జడ్జి గతంలో తీర్పునిచ్చారు. ఈ క్రమంలోనే సింగిల్ జడ్జి తీర్పుని హైడ్రా కమిషనర్ రంగనాథ్ డివిజన్ బెంచ్‌లో సవాల్ చేశారు.

# సంపాదకీయం

## మరోమారు సిజెపి ఆందోళన !

కాక్రోచ్ జనతా పార్టీ మరో ఆందోళనకు సిద్ధమవుతోంది. కేంద్రం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సీజేపీ సెప్టెంబర్ 5న ఈ మార్చ్ చేపడుతోంది. గతంలో ఢిల్లీలో జరిగిన ఆందోళన సందర్భంగా కేసుల ఎత్తివేత, విద్యార్థులకు పరిహారం వంటి హామీలను కేంద్రం ప్రకటించింది. ఇదే సందర్భంలో కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. అయితే హామీలు అమలు చేయాలని గతకొంత కాలంగా సిజెపి డిమాండ్ చేస్తూనే ఉంది. సెప్టెంబర్ 5న ఢిల్లీలో నిర్వహించనున్న నిరసన మార్చ్‌ను అడ్డుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఇండియా గేట్ నుంచి ఢిల్లీ పోలీస్ ప్రధాన కార్యాలయం వరకు ఈ మార్చ్ నిర్వహించనున్నట్లు సీజేపీ ప్రకటించింది. ప్రస్తుతం ఈ అంశంలో న్యాయపరంగా జోక్యం చేసుకోవాల్సి నంత అత్యవసర పరిస్థితి లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే నిరసన సందర్భంగా ప్రతి ఒక్కరూ శాంతియుతంగా వ్యవహరిస్తారని ఆశిస్తున్నట్లు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. ఈ క్రమంలో మరోమారు ఆందోళన చేస్తే ఢిల్లీలో ఉద్రిక్తతలు నెలకొంటాయని, మార్చ్‌కు అనుమతి నిరాకరించాలని రిటైర్డ్ పోలీస్ అధికారి సుప్రీంను ఆశ్రయించారు. సెప్టెంబర్ 5న జరగనున్న నిరసన మార్చ్ శాంతిభద్రతలు, విధానపరమైన అంశాలతో ముడిపడి ఉందని సీజేఐ సూర్యకాంత్ తెలిపారు. వీటిని సంబంధిత శాంతిభద్రతల సంస్థలు, ఇతర భాగస్వాములు పరిష్కరించాల్సి ఉంటుందని చెప్పారు. ప్రస్తుతం కోర్టు జోక్యం చేసుకోవాల్సిన బలమైన కారణాలు కనిపించడం లేదని స్పష్టం చేశారు. రిటైర్డ్ ఢిల్లీ పోలీస్ అధికారి రాజేంద్ర సింగ్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. జూలై 20న జంతర్ మంతర్ దగ్గర జరిగిన సీజేపీ నిరసన సందర్భంగా గాయపడిన పోలీసు సిబ్బందికి పరిహారం చెల్లించాలని, ప్రభుత్వ ఆస్తులకు జరిగిన నష్టాన్ని బాధ్యుల నుంచి వసూలు చేయాలని పిటిషన్‌లో కోరారు. పార్లమెంట్, ఇతర కీలక ప్రభుత్వ సంస్థలకు సమీపంలో నిర్వహించే నిరసనలకు సంబంధించి ప్రత్యేక మార్గదర్శకాలను రూపొందించాలని పిటిషనర్ కోరారు. నిరసనలు నిర్వహించకూడని ప్రాంతాలు లేదా రక్షిత ప్రాంతాలను సహేతుకమైన పరిధిలో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. విచారణ సందర్భంగా పిటిషనర్ తరఫు న్యాయవాది ఈ అంశానికి సంబంధించిన అనేక విషయాలను ఇంకా పరిశీలించాల్సి ఉందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అయితే ప్రతి అంశాన్ని సుప్రీంకోర్టు పరిశీలించలేదని సీజేఐ స్పష్టం చేశారు. ముందుగానే దీనిపై ఎలాంటి నిర్ణయాలు ప్రకటించ లేమని సుప్రీం స్పష్టం చేసింది. అలాగే నిరసనలకు సంబంధించిన అంశాలను పరిశీలించేందుకు సుప్రీం కోర్టు ఏర్పాటు చేసిన హై పవర్డ్ కమిటీని ఆశ్రయించాలని సీజేఐ సూచించారు. అన్ని అంశాలను మేము పరిశీలించలేం. ప్రతి విషయంపైనా వ్యాఖ్యానించం. మేము ఏర్పాటు చేసిన హై పవర్డ్ కమిటీని ఆశ్రయిం చండని సీజేఐ సూర్యకాంత్ పేర్కొన్నారు. ఒక్కో అంశాన్ని కమిటీ పరిశీలించి తమ అభిప్రాయాలను కోర్టుకు సమర్పిస్తుందని తెలిపారు. ఈ కమిటీని సీజేఐ 'తటస్థ అంపైర్'గా అభివర్ణించారు. నిరసనలకు సంబంధిం చిన విస్తృత విధానపరమైన, శాంతిభద్రతల అంశాలపై సంబంధిత వర్గాలు చర్చించు కోవాలని సూచించారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 5న ఇండియా గేట్ నుంచి ఢిల్లీ పోలీస్ ప్రధాన కార్యాలయం వరకు సీజేపీ తాజా నిరసన మార్చ్ నిర్వహించనున్నట్లు కోర్టుకు తెలియజేశారు. సెప్టెంబర్ 12, 13 తేదీల్లో ఢిల్లీలో బ్రిక్స్ సదస్సు జరగనున్న విషయాన్ని పిటిషనర్ సుప్రీం కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. విదేశీ ప్రముఖులు ఢిల్లీకి రానున్న నేపథ్యంలో భద్రతా పరమైన ఆందోళనలు ఉన్నాయని, అందువల్ల నిరసన మార్చ్‌ను బ్రిక్స్ సదస్సు పూర్తయ్యే వరకు వాయిదా వేయాలని ఆయన వాదించారు. అయితే సీజేఐ స్పందిస్తూ.. 'ఇవి శాంతిభద్రతలకు సంబంధించిన అంశాలు. నిర్ణయం శాంతిభద్రతల సంస్థలే తీసుకోవాలి. ప్రతి ఒక్కరూ శాంతియుతంగా వ్యవహరిస్తారని మేము విశ్వసిస్తున్నాం, ఆశిస్తున్నాం. ప్రస్తుతానికి మేము జోక్యం చేసుకోవడానికి బలమైన కారణాలు కనిపించడం లేదని పేర్కొన్నారు. ఒకవేళ నిరసన సందర్భంగా ఏదైనా అవాంఛనీయ లేదా ఆందోళనకర ఘటన చోటుచేసుకుంటే.. పిటిషనర్ కొత్తగా దరఖాస్తు చేసుకుని కోర్టును ఆశ్రయించవచ్చని సీజేఐ తెలిపారు. ఈ కేసును నిరసనలు, వాటికి సంబంధించిన ఇతర అంశాలపై ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న పిటిషన్లతో కలిపి తదుపరి విచారణకు తీసుకోవాలని సుప్రీంకోర్టు నిర్ణయించింది. మొత్తంగా ఇప్పుడు సెప్టెంబర్ 5 మరోమారు చర్చనీయాంశంగా మారింది. ఢిల్లీలో ర్యాలీతో నిజంగానే శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందా అన్నదే ప్రశ్న. ఎందుకంటే గత ఆందోళనలో అసాంఘిక శక్తులు చేరాయి. ఖలిస్తాన్, ఇస్లామిక్ ఉగ్రవాదులు చేరారన్న సమాచారం ఇంటిలిజెన్స్ వద్ద ఉంది. ఈ క్రమంలో ఢిల్లీ పోలీసులు తీసుకునే నిర్ణయం కీలకం కానుంది

# ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి ప్రత్యేక చర్యలు చేపట్టాలి

### అట్రాసిటీ కేసుల దర్యాప్తు వేగవంతం చేసి బాధితులకు న్యాయం చేయాలి

### అధికారులంతా మానవీయ కోణంలో సేవలందించాలి: ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 1 (విజన్ ఆంధ్ర బ్యూరో ):జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజల అభ్యున్నతికి అధికారులు సమన్వయంతో ప్రత్యేక చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కమిషన్ సభ్యుడు రాంబాబు నాయక్‌కు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి. గితె స్వాగతం పలికారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, సంక్షేమ పథకాల అమలు, రూల్ ఆఫ్ రిజర్వేషన్, విద్య, ఉపాధి తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు పూర్తిస్థాయిలో అందేలా చూడాలని అన్నారు. విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థుల వివరాలు, అంబేద్కర్ ఓవర్సీస్ పథకం, కులాంతర వివాహాల ఆర్థిక సహాయం, ఇందిరమ్మ ఇండ్లు, ఉపాధి హామీ పనులు తదితర అంశాలను సమీక్షించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తును వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేసి బాధితులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి నెల చివరి వారంలో మండలాల్లో సివిల్ రైట్స్ డే నిర్వహించి ప్రజలకు చట్టాలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించాలని తెలిపారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఎస్‌బీఐ బ్యాంకు ఖాతాలు తెరిపించాలని, తద్వారా వారికి బీమా సౌకర్యం కల్పించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అభివృద్ధి పనులకు సంబంధించిన నిధులు పెండింగ్‌లో ఉంటే రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి విడుదలకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కలెక్టర్ సేవలకు అభినందనజిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సేవలను కమిషన్ చైర్మన్ అభినందించారు. విద్యార్థులు, ప్రజలకు అందిస్తున్న సేవలను ప్రశంసిస్తూ, ఎస్సీ, ఎస్టీలకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు. పోలీసులు, ఇతర శాఖల అధికారులు అందిస్తున్న సేవలను కూడా అభినందించారు. కామన్ మెనూతో నాణ్యమైన భోజనంకలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పాఠశాలలు, రెసిడెన్షియల్ విద్యాలయాల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తూ, ప్రతిరోజూ కామన్ మెనూ అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రత్యేక అధికారులతో విద్యాలయాలను తనిఖీ చేయిస్తూ, విద్యార్థులతో కలిసి భోజనం చేసేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. విద్యార్థులకు ఉపకార వేతనాలు, కులాంతర వివాహాల ఆర్థిక సహాయం, అంబేద్కర్ ఓవర్సీస్ పథకం ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఎస్పీ మహేష్ బి. గితె మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకు 32 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదయ్యాయని, వాటి దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సంక్షేమ పథకాల అమలుపై గణాంకాలుఅధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం ఎస్‌డీఎఫ్ కింద ఎస్సీలకు 169 పనులకు రూ. 4.29 కోట్లు, ఎస్టీలకు 38 పనులకు రూ. 89 లక్షలు మంజూరయ్యాయి. జిల్లాలోని 9 ఎస్సీ ప్రీ మెట్రిక్ హాస్టళ్లలో 337 మంది బాలురు, 80 మంది బాలికలు, మూడు పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లలో 106 మంది బాలురు, 179 మంది బాలికలు విద్యనభ్యసిస్తున్నారు. ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఐదు నెలల ఫౌండేషన్ కోర్సులో 97 మంది అభ్యర్థులు ఉన్నారు. డైట్ చార్జీలను ప్రభుత్వం పెంచిన నేపథ్యంలో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. టీజీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్‌లో పాఠశాలలు, కళాశాలలు, డిగ్రీ కళాశాలల్లో కలిపి 3,527 మంది ఎస్సీ, 245 మంది ఎస్టీ విద్యార్థులు చదువుతున్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 90 శాతం సబ్సిడీతో 89 ఈవీ ద్విచక్ర వాహనాలు, 70 శాతం సబ్సిడీతో 46 త్రిచక్ర వాహనాలు, 100 శాతం సబ్సిడీతో 10 సోలార్ యూనివర్సల్ పంపు కంట్రోల్ యూనిట్లు, 80 శాతం సబ్సిడీతో 49 రెండు గేదెల యూనిట్ల పంపిణీ ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. ఎస్టీ ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్ కింద 61 మందికి రూ. 17.82 లక్షలు, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ కింద 871 మందికి రూ. 2 కోట్లు మంజూరయ్యాయి. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద జిల్లాలో 2,315 మంది ఎస్సీలకు, 436 మంది ఎస్టీలకు ఇళ్లు మంజూరయ్యాయి. టీ-ప్రైడ్ కింద గత ఆర్థిక సంవత్సరంలో ఎస్సీలకు 233 యూనిట్లకు రూ. 6.90 కోట్లు, ఎస్టీలకు 76 యూనిట్లకు రూ. 2.66 కోట్లు మంజూరయ్యాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో ఎస్సీ కులాంతర వివాహాలు చేసుకున్న 44 జంటలకు ఒక్కొక్కరికి రూ. 2.50 లక్షల చొప్పున మొత్తం రూ. 1.10 కోట్లు బడ్జెట్ మంజూరైనట్లు అధికారులు తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ఐదు ఎస్సీ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి రూ. 2.25 కోట్లు కేటాయించి పనులు చేపట్టినట్లు వెల్లడించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్వో జయశ్రీ, వేములవాడ ఆర్డీఓ కేఎస్‌బీ కుమారి, డీఎస్పీలు నాగేంద్రచారి, శ్రీనివాసులు, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి రవీందర్ రెడ్డి, సీపీఓ శ్రీనివాసాచారి, జిల్లా ఎస్టీ సంక్షేమ శాఖ అధికారి సంగీత, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్నతో పాటు వివిధ శాఖల అధికారులు, సంక్షేమ అధికారులు, సంఘాల నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ప్రజా ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలు: మాజీ ఎంపీ సోయం బాపూరావు

ఆదిలాబాద్, సెప్టెంబర్ 01 (విజన్ ఆంధ్ర):ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎంపీ, రాజ్ గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు సోయం బాపూరావు మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజుల్లో అద్భుతంగా పేద ప్రజల అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ముందుకు సాగుతోందని కొనియాడారు. గత 10 సంవత్సరాలలో ఏ ఒక్కరికీ రేషన్ కార్డు ఇవ్వకుండా మోసం చేశారని, కానీ ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజుల్లోనే 72 వేలకు పైగా నిరుపేదలకు కొత్త రేషన్ కార్డులు అందజేసిందని తెలిపారు. పేదల ఇంట్లో వెలుగులు నింపేలా 200 యూనిట్ల ఉచిత కరెంటు అందిస్తున్నామని, గరీబోళ్ళు కూడా సన్నబియ్యం తినాలనే ఉద్దేశంతో అర్హులందరికీ ఉచిత సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తూ పెద్దన్నలా ఆదుకుంటున్నారని, 12 వందల రూపాయల గ్యాస్ సిలిండర్‌ను సబ్సిడీతో రూ. 500 కే అందిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు 4 లక్షల 50 వేలకు పైగా ఇందిరమ్మ ఇండ్లను పూర్తి చేసి చరిత్ర సృష్టించామని, ఏకకాలంలో 25 లక్షల మంది రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేసిన ఏకైక ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమే అని స్పష్టం చేశారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఎన్ని అబద్ధపు మాటలు చెప్పినా ప్రజలు నమ్మే స్థితిలో లేరని, ఇంకో రెండు సార్లు పదేళ్ల పాటు ప్రజా ప్రభుత్వమే అధికారంలో ఉండడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బోథ్ ఇంచార్జ్ ఆడే గజేందర్, మాజీ డీసీసీ అధ్యక్షులు సాజిద్ ఖాన్, మాజీ డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజ రెడ్డి, దామోదర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సంజీవ్ రెడ్డి, మాజీ ఫ్లోర్ లీడర్ బండారి సతీష్, మాజీ జెడ్పీటీసీ గణేష్ రెడ్డి, ఎస్సీ సెల్ చైర్మన్ పరమేశ్వర్, మునిగేల నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి: జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



ఆదిలాబాద్, సెప్టెంబర్ 01 (విజన్ ఆంధ్ర):తెలంగాణలో ఆదిలాబాద్ జిల్లా గణపతి నవరాత్రి ఉత్సవాలకు ప్రత్యేక స్థానం ఉన్నందున, రానున్న ఉత్సవాలను జిల్లా వ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ స్పష్టం చేశారు. ముందస్తు చర్యల్లో భాగంగా స్థానిక పట్టణంలోని తానిషా గార్డెన్‌లో గణపతి మండప నిర్వహణ కమిటీ సభ్యులు, హిందూ ఉత్సవ సమితి సభ్యులు, కౌన్సిలర్లు మరియు నాయకులతో జిల్లా పోలీసు యంత్రాంగం సమన్వయ సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశానికి సుమారు 1000 మంది మండప ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ.. సంస్కృతిని, సాంప్రదాయాన్ని కాపాడుతూ భావితరాలకు స్ఫూర్తిదాయకంగా ఉత్సవాలు జరుపుకోవాలని కోరారు. త్వరలో ఆన్‌లైన్‌లో వచ్చే లింక్ ద్వారా ప్రతి గణపతి మండపం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, దీనివల్ల బందోబస్తు, నిమజ్జన ఏర్పాట్లకు సులువుగా ఉంటుందని తెలిపారు. గతంలో ఏర్పాటు చేసిన మండపాలకు మాత్రమే అనుమతులు ఉంటాయని స్పష్టం చేశారు. గ్రామాలలో సాధ్యమైనంతవరకు ఒకే గణపతి మండపం ఏర్పాటు చేసి ఐక్యతను చాటాలని సూచించారు. గణేష్ మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు పలు జాగ్రత్తలు పాటించాలని పోలీసు శాఖ సూచించింది. మండపాల వద్ద 24 గంటలు కనీసం ముగ్గురు వాలంటీర్లు ఉండాలని, జంతువులు లోపలికి రాకుండా చూసుకోవాలని తెలిపారు. మండపాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, నాణ్యమైన వస్తువులతోనే మండప నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. విద్యుత్ శాఖ నిబంధనలు పాటిస్తూ నాణ్యమైన వైర్లు వాడాలని, రాత్రి 10 గంటల తరువాత మైక్ సౌండ్ సిస్టమ్స్ ఉపయోగించరాదని హెచ్చరించారు. అధిక శబ్దం వచ్చే డీజేలకు అనుమతులు లేవని, మండపాల వద్ద ఎలాంటి టపాసులు కాల్చరాదని, మద్యం సేవించి రావద్దని పేర్కొన్నారు. మండపాల పేరుతో లక్కీ డ్రాలు, జూదం, బలవంతపు చందాలు వసూలు చేయకూడదని స్పష్టం చేశారు. అగ్నిప్రమాపాల నివారణకు నీరు, ఇసుక బస్తాలు అందుబాటులో ఉంచాలని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని, ఏమైనా సందేహాలుంటే పోలీసులను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే, ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష, ఏఆర్ డీఎస్పీ కమతం ఇంద్రవర్ధన్, పట్టణ సీఐలు, ఎస్సైలు, హిందూ ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షుడు బొంపల్లి హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ప్రభుత్వం ఏర్పడి 1000 రోజుల విజయవంత మైన పాలన



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్1. (విజన్ ఆంధ్ర)తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం 1000 రోజుల పాలనను విజయవంతంగా పూర్తి చేసుకుందని, ఈ కాలంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చిందని కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ డిసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నియోజకవర్గ ఇన్చార్జి అజ్మీర శ్యాం నాయక్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల్లా మంగ తో కలిసి డిసిసి అధ్యక్షురాలు ఆత్రం సుగుణ పత్రిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షురాలు ఆత్రం సుగుణ మాట్లాడుతూ.... తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడి 1,000 రోజుల పాలనను పురస్కరించుకుని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, ఉచిత విద్యుత్, పంటల కొనుగోళ్ల ద్వారా అండగా నిలిచిందన్నారు. మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి ద్వారా నిరుపేద కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తూ ఆర్థిక భారం తగ్గించిందన్నారు. ఎదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టడంతో పాటు కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు అందిస్తూ, రూ. 500కే గ్యాస్ సిలిండర్ వంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, నైపుణ్య శిక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, అణగారిన వర్గాలకు సామాజిక న్యాయం అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో రోడ్లు, తాగునీరు, విద్య, వైద్యం, ఇళు ,,మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రజలకు మెరుగైన విద్య, వైద్యం అందించడంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.. గత పాలకులు చేసినట్లు రాజరిక పాలన కాంగ్రెస్ వల్ల కాదని కాంగ్రెస్ పార్టీ ప్రజల పార్టీ అని అన్నారు.. కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమం కోసం మాత్రమే పని చేస్తుందని నమ్మి గెలిపించిన ప్రజలకు తప్పకుండా ఇచ్చిన హామీలు అన్ని ఒక్కొకటిగా నెరవేరుస్తుందని అన్నారు.. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఆసిఫాబాద్ మండల అధ్యక్షుడు రాపర్తి మురళి పలు మండల అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు

## ప్రయివేట్ ఆసుపత్రి సేవలపై జిల్లా వైద్యరోగ్య శాఖ అధికారి తనిఖీలు

మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 01,(విజన్ ఆంధ్ర)జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ మంగళవారం మంచిర్యాల పట్టణంలోని నాలుగు ప్రైవేట్ ఆసుపత్రులను ఆకస్మికంగా సందర్శించి, తగు సూచనలు చేశారు. సిటీ న్యూరో, శ్రీహర హాస్పిటల్, ఆదిత్య హాస్పిటల్, సచి హాస్పిటల్ లను ఆకస్మికంగా సందర్శించి, ఆసుపత్రి లో అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. అదేవిధంగా సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అందిస్తున్న వైద్య సేవలు, పంపించిన వైద్య బిల్లులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి మాట్లాడుతూ జిల్లాలో క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ ప్రకారం గా అన్ని ఆస్పత్రులు నమోదు చేసుకోవాలని, అదేవిధంగా ప్రతి ఆసుపత్రిలో ఈ క్రింది వివరాలను ఉంచుకోవాలని ఆదేశించారు. వైద్యుల వివరాలు, స్పెషలిస్ట్ వైద్యుల వివరములను గోడపై అతికించాలని, వైద్య సేవలకు తీసుకుంటున్న చార్జీల వివరములను ప్రతి ఆసుపత్రిలో డిస్ప్లే పెట్టాలని, రోగులకు కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. ముఖ్యంగా కూర్చుండడానికి వీల్ చైర్లు, స్ట్రెచ్చర్లు, త్రాగు నీరు అందుబాటులో ఉంచాలన్నారు. రోగి వచ్చినప్పుడు సాహాయ సిబ్బంది తీసుకుని వెళ్లాలని, రోగికి అందిస్తున్న వైద్య సేవల గురించి కౌన్సిలింగ్ చేయాలన్నారు. ముఖ్యంగా ప్రతి ఆసుపత్రిలో బయో వేస్టేజ్ మరియు ఫైర్ సర్వీసెస్ అందుబాటులో ఉంచుకోవాలని, ఫైర్ సేఫ్టీ మేజర్ సర్టిఫికెట్లను బయో బేస్డ్ సర్టిఫికెట్లను అందుబాటులో ఉంచాలని, ప్రతి ఆసుపత్రి లీస్ట్ పేపర్లను మరియు ట్రేడ్ లైసెన్స్ ఆసుపత్రిలో పనిచేస్తున్న పారామెడికల్ సిబ్బంది వివరములను లేబర్ కమిషనర్ కు తెలియజేయాలన్నారు. అదేవిధంగా ఆసుపత్రికి వచ్చే కన్సల్టెంట్ ప్రత్యేక వైద్య నిపుణుల వివరములను, ఇచ్చే వైద్య సేవలను తెలియజేస్తూ బ్యానర్లు పెట్టాలని, రోగితో సమన్వయంగా ఉంటూ వైద్య సేవలను అందించాలన్నారు. వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున డెంగ్యూ జ్వరాలపైన రోగులను భయభ్రాంతులకు గురి చేయరాదని, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ ప్రకారం గా ప్రతి ఆసుపత్రి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని ఆయుర్వేద, యునాని, హోమియోపతి, అల్లోపతి డెంటల్ డయాగ్నొస్టిక్ కేంద్రాలు ల్యాబ్లు కూడా క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ కింద పని చేయాలన్నారు. ఎలాంటి పొరపాట్లు చేయరాదని ఈ నాలుగు ప్రైవేట్ ఆస్పత్రిలో అందిస్తున్న వైద్య సేవలను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అధికారి వెంట వైద్యులు అబ్బురి శ్రీనివాస్, డాక్టర్ గంప మల్లేష్, డాక్టర్ ప్రతాప్ గౌడ్, డాక్టర్ వినోద్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

## మహిళల రక్షణకు షీ టీమ్స్ నిరంతర సేవలు


### వేధింపులు ఎదురైతే భయపడకుండా పోలీసులను సంప్రదించాలి

### ఆకతాయిలపై ప్రత్యేక నిఘా -- జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు

గద్వాల సెప్టెంబర్ 1( విజన్ ఆంధ్ర బ్యూరో)మహిళలు, యువతులు, బాలికలు ఆకతాయిల వలన గానీ, ఇతర రకాల వేధింపుల వలన గానీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లయితే ఎలాంటి భయం లేకుండా పోలీసులను సంప్రదించాలని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు తెలిపారు. మహిళల రక్షణ కోసం జిల్లాలో షీ టీమ్స్, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ టీమ్స్ సమర్థవంతంగా పనిచేస్తున్నాయని ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థినులు, మహిళలు అన్యాయానికి గురైనప్పుడు మౌనంగా ఉండకుండా ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని, ఫిర్యాదు అందిన వెంటనే నిందితులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. పాఠశాలలు, కళాశాలల్లో ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, మహిళలు పనిచేసే ప్రదేశాల్లో వేధింపులు, బాలికలపై లైంగిక వేధింపులు వంటి ఘటనలు చోటుచేసుకున్నప్పుడు వెంటనే షీ టీమ్స్‌ను సంప్రదించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఆగస్టు నెలలో షీ టీమ్స్ ద్వారా 10 అవగాహన కార్యక్రమాలు నిర్వహించి మహిళలు, యువతులు, బాలికలకు భద్రతా చర్యలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. సామాజిక మాధ్యమాలైన ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వినియోగంలో మహిళలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఫొటోలు, వీడియోలు పోస్టు చేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఆగస్టు నెలలో 16 పెట్టి కేసులు నమోదు. జిల్లా వ్యాప్తంగా షీ టీమ్స్‌కు 02 ఫిర్యాదులు అందగా, వాటిపై చర్యలు తీసుకోవడమైనది. 16 పెట్టి కేసులు కూడా నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. అలాగే 85 హాట్‌స్పాట్‌లపై నిఘా ఏర్పాటు చేసి, 15 మంది పోకిరీలను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని, వారి కుటుంబ సభ్యుల సమక్షంలో 17 కౌన్సెలింగ్‌లు నిర్వహించినట్లు తెలిపారు. మహిళలు, యువతులు, బాలికలను వేధించే వారిపై షీ టీమ్స్ నిరంతరం నిఘా ఉంచుతున్నాయని, ఎవరైనా మహిళలను ఇబ్బందులకు గురిచేస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. నేరుగా పోలీసులను సంప్రదించలేని వారు 8712670312 ఫోన్ నంబర్‌కు లేదా డయల్ 112కు ఫోన్ చేసి సమాచారం అందించవచ్చని తెలిపారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. ఒంటరిగా ప్రయాణించే మహిళలు టి-సేఫ్. యాప్‌ను వినియోగించుకోవాలని, ప్రయాణ సమయంలో భద్రతకు ఇది ఉపయోగకరంగా ఉంటుందని సూచించారు. మహిళల భద్రతకు గద్వాల్ పోలీసులు ఎల్లప్పుడూ అండగా ఉంటారు. మహిళలను వేధించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తప్పవు అని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు తెలిపారు.

# నేడు బోడుప్పల్ విద్యుత్ సరఫరాలో అంతరాయం

### రోడ్డు విస్తరణ పనులతో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు సరఫరా నిలిపివేత




బోడుప్పల్,సెప్టెంబర్ 01(విజన్ ఆంధ్ర) :రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా విద్యుత్ స్తంభాలను టవర్లపైకి మార్చే పనులు చేపట్టనున్న నేపథ్యంలో నేడు బోడుప్పల్ పరిధిలోని ఇందిరా నగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు చిలకానగర్ ఏఈ వినయ్ కుమార్ రెడ్డి తెలిపారు.బోడుప్పల్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అంతరాయం కారణంగా సాయిదుర్గానగర్,బయ్యన్నగూడ, గణేష్‌నగర్, ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంపు నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ప్రధాన రహదారి పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోనుంది.ఆయా ప్రాంతాల వినియోగదారులు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని, విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు. అసౌకర్యానికి చింతిస్తున్నట్లు తెలిపారు.

# సెప్టెంబరు 16 వరకు డ్రాఫ్ట్ జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

### -11 రకాల పత్రాల్లో ఒకటి సమర్పించాలి
### -బీఎల్ఓలు అవగాహన కల్పించాలి
### -అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు



పెద్దపల్లి జిల్లా ప్రతినిది సెప్టెంబర్-01 (విజన్ ఆంధ్ర)ఎస్ఐఆర్‌లో భాగంగా ప్రచురించిన డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై క్లెయిమ్‌లు, అభ్యంతరాలను సెప్టెంబరు 16 వరకు సమర్పించవచ్చని అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు.

జిల్లాలో 'నో మ్యాపింగ్', 'అనామలీస్'గా గుర్తించిన ఓటర్లకు 1,49,194 నోటీసులు జారీ చేయగా, 58,313 నోటీసులు అందజేసినట్లు తెలిపారు. నోటీసు జారీ చేసిన ఏడు రోజుల అనంతరం ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఆధ్వర్యంలో విచారణ చేపడతామన్నారు. ఓటర్లు నిర్ణీత గడువులోగా ఆధారాలతో విచారణకు హాజరుకావాలని సూచించారు.

డ్రాఫ్ట్ జాబితాలోని పేరు, వయస్సు, చిరునామా తదితర వివరాలను పరిశీలించుకోవాలని, తప్పులు ఉన్నా, అర్హత ఉన్నప్పటికీ పేరు లేకపోయినా, అనర్హుల పేర్లు ఉన్నా క్లెయిమ్‌లు, అభ్యంతరాలు సమర్పించాలని కోరారు. భారత ఎన్నికల సంఘం ఆమోదించిన 11 రకాల పత్రాల్లో ఒకదాన్ని ఆధారంగా సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు.బూత్ స్థాయి అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటర్లకు ఎస్ఐఆర్‌పై అవగాహన కల్పించాలని, ప్రక్రియలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.?ఈ సమావేశంలో ఎన్నికల విభాగం అధికారులు విజయ్, ఐటి టెక్నికల్ కిరణ్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి ఆధ్వర్యంలో భూపాలపల్లి ఏరియాలో ఉత్సాహంగా కబడ్డీ పోటీలు

### భూపాలపల్లి జిల్లా భూపాలపల్లి పట్టణ కేంద్రం లో మంగళవారం రోజున సింగరేణ



భూపాలపల్లి ఏరియాలో 2026--27 సంవత్సరానికి సంబంధించి వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ (వావప్స్ ఏగే ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శాఖాపరమైన క్రీడా పోటీల్లో భాగంగా మంగళవారం కబడ్డీ పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మొదటగా స్టేడియంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి జీఎం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని కబడ్డీ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఉద్యోగుల ఆరోగ్యం, ఉత్సాహం, మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. ముఖ్యంగా మహిళా ఉద్యోగులు కూడా క్రీడా పోటీల్లో చురుగ్గా పాల్గొని తమ ప్రతిభను చాటాలని పిలుపునిచ్చారు. మహిళా ఉద్యోగుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఇటువంటి పోటీలు మంచి వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు. క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడా స్ఫూర్తితో, క్రమశిక్షణతో పోటీల్లో పాల్గొనాలని జీఎం క్రీడాకారులకు సూచించారు. క్రీడల ద్వారా ఉద్యోగుల్లో ఐక్యత, స్నేహభావం, జట్టు స్ఫూర్తి మరింత పెంపొందుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఏజీఎం (సివిల్) రవికుమార్ , పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్ ,గుర్తింపు సంఘం ఏ ఐ టి యు సి బ్రాంచ్ కార్యదర్శి మోట పలుకుల రమేష్, ఐ ఎన్ టి యు సి బ్రాంచ్ నాయకులు హుస్సేన్, సి ఎం ఓ ఏ ఐ ప్రెసిడెంట్ నజీర్, క్రీడల గౌరవ కార్యదర్శి సాయికృష్ణ , స్పోర్ట్స్ సూపర్వైజర్ పర్స శ్రీనివాస్, కోఆర్డినేటర్ నాగేశ్వర్ రావు , ఇతర క్రీడకారులు, తదితరులు పాల్గొన్నారు

# గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

### అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీ చర్యలు అవసరం
### ఉత్సవ కమిటీ, మండపాల నిర్వాహకులు తగు జాగ్రత్తలు పాటించాలి
### అధికారులతో సమన్వయ సమావేశంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ.



గద్వాల సెప్టెంబర్ 1 (విజన్ ఆంధ్ర బ్యూరో)గణేష్ ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో విజయవంతం చేసేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి వివిధ శాఖల అధికారులతో వినాయక చవితి ఉత్సవాల నిర్వహణలో పాటించాల్సిన జాగ్రత్తలు, నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లపై కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. డివిజన్, మండల స్థాయిలోనూ ఉత్సవ కమిటీ సభ్యులు, మండపాల నిర్వహకులతో సంబంధిత అధికారులు సమావేశాలు నిర్వహించి దిశా నిర్దేశం చేయాలన్నారు. మండపాల వద్ద విద్యుత్ ప్రమాదాలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు విద్యుత్ శాఖ అధికారులతో నిర్వాహకులు సేఫ్టీ సర్టిఫికేషన్ తీసుకునేలా చూడాలన్నారు. వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలించే సమయంలోనూ కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా జిల్లా కేంద్రంలోని కృష్ణవేణి చౌరస్తా నుంచి నది అగ్రహారం వెళ్లే దారిలో అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలో బీచుపల్లి, నది అగ్రహారంలోనీ కృష్ణానది వద్ద పెద్ద సంఖ్యలో నిమజ్జనం చేయనున్న నేపథ్యంలో అక్కడ ముఖ్యమైన రోజుల్లో క్రేన్సుతోపాటు గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలన్నారు. లైటింగ్, భారీ కేడ్స్ కూడా అవసరమని, ప్రధాన రహదారుల్లో గతుకులు లేకుండా మరమ్మత్తులు చేయించాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. నిమజ్జనం రోజుల్లో నిర్దేశిత సమయాల్లో మద్యం దుకాణాలను మూసివేయడం అవసరమని, ఎలాంటి గొడవలకు ఆస్కారం లేకుండా పోలీస్ శాఖ అధికారులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలన్నారు. వినాయక మండపాల వద్ద రాత్రి 10 గంటల తర్వాత మైక్ శబ్దాలు ఉండరాదని, ముఖ్యంగా ఆసుపత్రులు, విద్యాసంస్థల సమీపంలో డీజే సౌండ్స్ లేకుండా చూడాలన్నారు. శానిటేషన్, తాగునీరు, అత్యవసర వైద్య సదుపాయాలు, తదితర అన్ని విషయాల్లో సంబంధిత అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసి జిల్లాలో వినాయక ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునేలా పనిచేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ తరపున అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని, సంబంధిత శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ పనిచేస్తామన్నారు. బీచుపల్లిలోని కృష్ణా నది వద్ద నిమజ్జనం చేసేందుకు జిల్లా నుంచే కాకుండా వనపర్తి, కర్నూల్, మహబూబ్ నగర్ వంటి దూర ప్రాంతాల నుంచి కూడా విగ్రహాలు తీసుకొస్తుంటారని, అక్కడ అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. జిల్లా పరిధిలోని జాతీయ రహదారిపై పలుచోట్ల రోడ్డు పనులు జరుగుతుండడంతో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా సూచిక, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను కోరారు. ఆయా శాఖల అధికారులతో వాట్సాప్ గ్రూపుల సహాయంతో వివిధ ప్రాంతాల్లోని వినాయక ఉత్సవాల పరిస్థితులపై సమీక్షించేలా చూస్తామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు అందుబాటులో ఉండేందుకు ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ లను, హెల్ప్ లైన్లను ఏర్పాటు చేయనున్నట్లు ఈ సందర్భంగా ఎస్పీ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీల సంక్షేమం, అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి

### ఎస్సీలకు అందుతున్న పథకాలపై శాఖలవారీగా నివేదిక సమర్పించాలి
### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



గద్వాల సెప్టెంబర్ 1 (విజన్ ఆంధ్ర బ్యూరో)జిల్లాలో షెడ్యూల్డ్ కులాల సమగ్ర అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు.మంగళవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్‌లో అలంపూర్ శాసనసభ్యులు విజయుడుతో కలిసి షెడ్యూల్డ్ కులాల స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్ వినియోగంపై జిల్లా స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాల సామాజిక, ఆర్థిక, విద్యా అభివృద్ధితో పాటు వారికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఎస్సీ సబ్ ప్లాన్ కింద మంజూరైన నిధులను అర్హులైన ఎస్సీ కుటుంబాలకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరేలా సమర్థవంతంగా వినియోగించాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందిన ఎస్సీ లబ్ధిదారుల వివరాలను శాఖల వారీగా సేకరించి నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి శాఖ పరిధిలో ఎస్సీల అభివృద్ధికి కేటాయించిన నిధులను సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ప్రతి శాఖకు మంజూరైన నిధులపై సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఎస్సీ వర్గాల వారికి అవసరమైన సదుపాయాలను గుర్తించి, అందుబాటులో ఉన్న నిధులను సమర్థవంతంగా వినియోగించాలని చెప్పారు. జిల్లాకు మంజూరైన నిధులను సకాలంలో నిబంధనల మేరకు వినియోగించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు మాట్లాడుతూ అలంపూర్ ఎస్సీ రిజర్వుడ్ నియోజకవర్గం కావడంతో అర్హులైన ప్రతి ఎస్సీ కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఎస్సీల అభివృద్ధి నిధులతో గ్రామాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించి, అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రయోజనం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి నాగరాజు, డీయంహెచ్ఓ సంధ్య కిరణ్మయి, ఉద్యాన శాఖ అధికారి రాజ్ కుమార్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి సునంద, సీపీఓ పాపయ్య, పరిశ్రమల శాఖ మేనేజర్ రామలింగేశ్వర్ గౌడ్, వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప, డిఆర్డిఓ ముషాయిదా బేగం, మిషన్ భగీరథ ఇంట్రా అధికారి పరమేశ్వరి, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మార్చిలోగా ఆర్అండ్‌బీ పనులు పూర్తి చేయాలి

### -రహదారి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి
### -ప్రతి మండలానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి
### -క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలి
### -అధికారులకు కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశం



పెద్దపల్లి జిల్లా ప్రతినిది సెప్టెంబర్-01 (విజన్ ఆంధ్ర)జిల్లాలో రోడ్లు, భవనాల శాఖ (ఆర్అండ్‌బీ) ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులన్నింటినీ వచ్చే మార్చి నెలలోగా పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. పనుల్లో జాప్యం లేకుండా క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో ఆర్అండ్‌బీ పనుల పురోగతిపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని అన్ని మండలాల్లో చేపడుతున్న రహదారులు, భవనాలు, ఇతర పనుల పురోగతిని మండలాల వారీగా సమీక్షించారు. ప్రారంభం కాని పనులు, వివిధ దశల్లో ఉన్నవి, పెండింగ్ పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.ప్రతి మండలంలోని పనులకు నిర్దిష్ట కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రారంభం కాని పనులను వెంటనే ప్రారంభించడంతోపాటు వివిధ దశల్లో ఉన్న పనులను వేగవంతం చేయాలని, పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. కాంట్రాక్టర్లతో సమన్వయం చేసుకుని నిర్ణీత గడువులోగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.ప్రజలకు నాణ్యమైన మౌలిక వసతులు అందించడమే లక్ష్యంగా పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా రహదారి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని అధికారులను ఆదేశించారు. నిబంధనల ప్రకారం పనులను ఎప్పటికప్పుడు తనిఖీ చేయడంతోపాటు పురోగతి, నాణ్యత, బిల్లుల చెల్లింపులను సమర్థంగా పర్యవేక్షించాలని సూచించారు.క్షేత్రస్థాయిలో పనులకు ఎదురవుతున్న సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు ఉపయోగపడే నాణ్యమైన రహదారులు, భవనాలను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో ఆర్అండ్‌బీ ఈ ఈ భావ్ సింగ్,ఏఈలు, డీఈలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# కంబాలపెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన

### జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. రవిరాథోడ్.




మహబూబాబాద్, జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 01 (విజన్ ఆంధ్ర ): 'ఆశ దే 'కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. రవిరాథోడ్ కంబాలపెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖధికారి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం లో హాజరు రికార్డులను పరిశీలించి మరియు ఆశ ల రికార్డులను పరిశీలించి గర్భిణీ స్త్రీ ల నమోదు, ప్రమాదకార గర్భిణీ స్త్రీ ల ను గుర్తించి వారిని డాక్టర్ పర్యవేక్షణలో ఆరోగ్య సేవలు అందిచలని,0-5సంవత్సరాల వారికి వ్యాధి నిరోధక టీకాలు అందరికి అందే టట్లు చూడాలని,14-15 సంవత్సరాలవారికీ హ్యూపి వ్యాధి నిరోధక టీకా వలన స్త్రీలకు రాబోయే క్యాన్సరు లను నిరోధకముగా పనిచేస్తుందని అశలకు అవగాహన కల్పించి, కాలనుగుణముగా వచ్చే వ్యాధులలో జ్వరంలను ఇండ్ల సర్వే చేసి, చికిత్స అందించాలి. లార్వా ల ను తొలగించడం మరియు దోమలు నివారణ చర్యలు అనగా అంబేట్ స్ప్రే గ్రామ పంచాయతీ సమన్వయము తో పరిశుభ్రం పాటించాలని అవగాహనా కార్యక్రమం లు ఏర్పాటు చేయాలని తెలియజేస్తూ, జాతీయ ఆరోగ్య కార్యక్రమం లపై సమీక్షించి,లక్ష్యాలు సకాలంలో సాధించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వీరజిత, డాక్టర్. శివకుమార్, పీహెచ్ సి డాక్టర్. సుధీర్ మరియు వైద్య సిబ్బంది, ఆశలు పాల్గొన్నారు.

# బీజేపీ జిల్లా అధ్యక్షుడి ఇంటిపై దాడి అమానుషం

### పోలీసుల సమక్షంలోనే దాడులు జరగడం సిగ్గుచేటు..
### దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలి
### బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు జమ్మూ రమేష్
### నిరసనకు వెళ్తున్న నాయకుల ముందస్తు అరెస్టు..
### శాలిగౌరారం పోలీస్ స్టేషన్‌కు తరలింపు




శాలిగౌరారం,సెప్టెంబర్ 01(విజన్ ఆంధ్ర) : బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడిని నిరసిస్తూ నల్లగొండ జిల్లా మంత్రి కోమటిరెడ్డి క్యాంపు కార్యాలయం ఎదుట నిరసన చేపట్టేందుకు సిద్ధమైన బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి శాలిగౌరారం పోలీస్ స్టేషన్‌కు తరలించారని బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు జమ్మూ రమేష్ తెలిపారు. మరోవైపు బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి ఇంటిపై దాడి చేసి,ఇంట్లోని వస్తువులను ధ్వంసం చేయడంతో పాటు ఆయన తల్లిపై దాడికి పాల్పడటం అమానుషమని ఆరోపించారు.నల్లగొండ జిల్లా మంత్రి కోమటిరెడ్డి క్యాంపు కార్యాలయం ఎదుట నిరసన తెలిపిన నేపథ్యంలో మంత్రి అనుచరులుగా చెప్పబడుతున్న కొందరు పార్టీ జిల్లా అధ్యక్షుడి ఇంటిపై దాడి జరగడం తీవ్ర ఆందోళన కలిగించే విషయమన్నారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసులు దాడులను అడ్డుకోవడంలో విఫలమయ్యారని విమర్శించారు. పోలీసుల సమక్షంలోనే ప్రతిపక్ష పార్టీ నాయకుడి ఇంటిపై దాడులు జరగడం సిగ్గుచేటన్నారు.అధికారంలో ఉన్నామనే అహంకారంతో ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలపై భౌతిక దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని జమ్మూ రమేష్ అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై, నాగం వర్షిత్‌రెడ్డి ఇంటిపై దాడులకు పాల్పడిన వారిని గుర్తించి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కు ప్రతిపక్షాలకు ఉందని, ఆ హక్కును కాలరాయడం సరికాదన్నారు. ముందస్తు అరెస్టులతో నిరసనలను అడ్డుకోవడం, మరోవైపు నాయకుల ఇళ్లపై దాడులు జరగడం ఏమిటని ప్రశ్నించారు. ఇలాంటి ఘటనలను ప్రజలు గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు బోడ రాజు, అయితగోని గణేష్, రెబ్బ ఉమేష్, చిప్పలపల్లి అంజయ్య, గంట యాదగిరి, ఆకుల రవి తదితరులు పాల్గొన్నారు.అరెస్ట్ అయిన వారిలో యమగానీ వీరేందర్,ఎడ్దుల బాస్కర్ రెడ్డి,ఈశ్వరచారి ఉన్నారు.

# హామీలు 420.. అమలు సున్నా!

### కాంగ్రెస్‌ది ప్రజా పాలన కాదు.. మోసాల పాలన
### బోడుప్పల్ నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి
### వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఒరిగిందేమిటో చెప్పాలి.. హామీల అమలుపై నిలదీస్తాం



బోడుప్పల్,సెప్టెంబర్ 01(విజన్ ఆంధ్ర) : ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీలు, 420 హామీలతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. వెయ్యి రోజుల పాలనలో ప్రజల ఆశలను వమ్ము చేసిందని బోడుప్పల్ నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందు ఎండగడతామని ఆయన స్పష్టం చేశారు.మంగళవారం బోడుప్పల్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బోడుప్పల్ నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి,నగర మాజీ మేయర్ సామల బుచ్చిరెడ్డి,ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సంధర్బంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు మాటలు కోటలు దాటాయి.అధికారంలోకి వచ్చాక హామీలు గాలిలో కలిశాయని విమర్శించారు.ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి.. వెయ్యి రోజులు పూర్తవుతున్నా అనేక హామీలకు దిక్కులేకుండా పోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలపై బీఆర్ఎస్ రాష్ట్రవ్యాప్తంగా సెప్టెంబరు 2 నుంచి వారం రోజులపాటు నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే.మహిళలకు నెలకు రూ.2,500 సాయం, రైతులకు సంబంధించిన హామీలు, యువతకు ఉద్యోగాలు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇతర సంక్షేమ పథకాలపై ప్రభుత్వం ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలని సంజీవరెడ్డి డిమాండ్ చేశారు.హామీల పుస్తకంతో ఓట్లు అడిగారు.. ఇప్పుడు అదే పుస్తకం తెరిచి ప్రజలు ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేకపోతున్నారని మండిపడ్డారు.రైతులు, మహిళలు, విద్యార్థులు, యువత, ఉద్యోగులు, సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరిస్తూ బీఆర్ఎస్ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని తెలిపారు.కాంగ్రెస్ మోసాలను ఇంటింటికీ తీసుకెళ్తాంకాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు తీరును ప్రజలకు వివరించేందుకు బీఆర్ఎస్ చేపట్టే కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములను చేస్తామని సంజీవరెడ్డి తెలిపారు.ప్రజలను మరోసారి మభ్యపెట్టే ప్రయత్నాలను సాగనివ్వం. హామీలు అమలు చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని అన్నారు.సెప్టెంబరు 1న కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ ఛార్జిషీట్ విడుదల చేయడంతో పాటు, సెప్టెంబరు 2 నుంచి 8 వరకు వివిధ వర్గాల సమస్యలపై నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పార్టీ ప్రకటించిందని,వెయ్యి రోజుల పాలనలో సాధించిందేమిటో కాంగ్రెస్ చెప్పాలి. హామీల అమలులో విఫలమైతే ప్రజాక్షేత్రంలోనే ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నాయకులు కాటపల్లి రాంచంద్రారెడ్డి,బందారపు శ్రీదర్ గౌడ్,కొత్త రవి గౌడ్,కాటం రాజిరెడ్డి,మీసాల గిరి,తాల్క శత్రఙ్ఞ,ఎల్లగౌని శ్రీహరి,బొడగల్ల సదానంద్,ఆలీం,దేవరాజు,నర్సింగ్ నాయక్,కృష్ణ గౌడ్,ఉప్పలయ్య,యూత్ నాయకులు ఉప్పరి విజయ్,తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో ఆంగ్ల భాషా నైపుణ్యాల పెంపునకు 'స్పోకెన్ ఇంగ్లీష్' పోటీలు: జిల్లా కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్, సెప్టెంబర్ 01 (విజన్ ఆంధ్ర):విద్యార్థుల్లో ఆంగ్ల భాషా సంభాషణ నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు 'స్పోకెన్ ఇంగ్లీష్ రివ్యూ మీటింగ్ కమ్ కాంపిటీషన్స్' నిర్వహించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆగస్టు 2026 నెలకు సంబంధించిన స్పోకెన్ ఇంగ్లీష్ కార్యక్రమాల సమీక్షలో భాగంగా ఈ కార్యక్రమం జరిగింది. దీనికి జిల్లా కలెక్టర్ రాజర్షి షా ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నేటి పోటీ ప్రపంచంలో ఆంగ్ల భాషపై పట్టు ఎంతో కీలకమని అన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచే ఇంగ్లీష్‌లో ధారాళంగా మాట్లాడే నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. పాఠశాలల్లో స్పోకెన్ ఇంగ్లీష్ బోధనను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని, విద్యార్థుల్లో ఆంగ్ల భాషపై ఉన్న భయాన్ని తొలగించి ఆత్మవిశ్వాసం పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల ఆంగ్ల భాషా సామర్థ్యాలు, ఇప్పటివరకు సాధించిన పురోగతిపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. అనంతరం వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించగా, ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కలెక్టర్ అభినందించి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారి నిర్మాణ పనుల వద్ద ఉంచిన జనరేటర్ దొంగతనం

### సాంకేతిక ఆధారాలతో కేసును ఛేదించిన జైనథ పోలీసులు
### దొంగతనానికి గురైన 25 ఖవూ జనరేటర్, మహేంద్ర మాక్స్ పికప్ వాహనం, సెల్‌ఫోన్లు స్వాధీనం
### వివరాలు వెల్లడించిన ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి



ఆదిలాబాద్ జిల్లా:( విజన్ ఆంధ్ర బ్యూరో)జాతీయ రహదారి నిర్మాణ పనుల వద్ద ఉంచిన 25 ఖవూ జనరేటర్‌ను దొంగతనం చేసిన కేసును జైనథ్ సర్కిల్ పోలీసులు సాంకేతిక ఆధారాలతో ఛేదించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. మరో నిందితుడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.పోలీసుల వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన నిందితులు సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో దొంగతనానికి పాల్పడాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో బేలా–కొబ్బయి రహదారిపై దహేగాం ఎక్స్‌రోడ్ సమీపంలో నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి వద్ద ఉంచిన జనరేటర్‌ను గమనించారు.జూలై 31, న రాత్రి సమయంలో ముగ్గురు నిందితులు మహేంద్ర మాక్స్ పికప్ వాహనంలో అక్కడికి చేరుకుని, వాచ్‌మెన్లు నిద్రిస్తున్న సమయంలో జనరేటర్‌ను అక్కడి నుంచి తరలించి తమ గ్రామానికి తీసుకెళ్లారు. అనంతరం జనరేటర్‌కు సంబంధించిన టైర్లు, పైభాగంలోని కవరింగ్‌ను తొలగించి వేరే ప్రాంతంలో పడేశారు. దొంగతనం చేసిన జనరేటర్‌ను తక్కువ ధరకు విక్రయించేందుకు మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా బిలోలి తాలూకా కొండలవాడి గ్రామానికి చెందిన దేవ్కతే పవన్‌ను సంప్రదించారు. జనరేటర్‌ను రూ. 90,000లకు విక్రయించేందుకు ఒప్పందం చేసుకుని, అడ్వాన్స్‌గా రూ. 2,000 తీసుకున్నారు.మిగిలిన మొత్తాన్ని జనరేటర్‌ను కొండలవాడి గ్రామానికి తరలించిన అనంతరం చెల్లించేందుకు ఒప్పందం చేసుకున్నారు. ఈ క్రమంలో నిందితులు జనరేటర్‌ను మహేంద్ర మాక్స్ పికప్ వాహనంలో తరలిస్తుండగా పోలీసులు అనుమానంతో వాహనాన్ని తనిఖీ చేశారు. విచారణలో నిందితులు జనరేటర్ దొంగతనం చేసిన విషయాన్ని వెల్లడించడంతో పోలీసులు వారి ద్ద నుంచి దొంగతనానికి గురైన 25 KVA జనరేటర్, మహేంద్ర మాక్స్ పికప్ గూడ్స్ వాహనం నంబర్ వీఎ34డ్గీ8140, రూ. 2,000 నగదు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. సాంకేతిక ఆధారాలు, పోలీసుల సమన్వయంతో కేసును త్వరితగతిన ఛేదించిన జైనథ్ సర్కిల్ పోలీసులను డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి అభినందించారు. నేరాలకు పాల్పడితే ఎట్టి పరిస్థితుల్లోనూ తప్పించుకోలేరని, నేరస్తులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

నిందితుల వివరాలు:

ఘా1) విశాల్ రాథోడ్ గా/శీ చంద్రకాంత్, వయస్సు 26 సంవత్సరాలు, కులం: గా–లంబాడ, వృత్తి: ప్రైవేట్ ఉద్యోగం, నివాసం: లాల్డోహ్ గ్రామం, జివితి తాలూకా, చంద్రపూర్ జిల్లా, మహారాష్ట్ర అరెస్ట్.

ఘా2) రాథోడ్ రాహుల్ – విశాల్ రాథోడ్ సోదరుడు, మహారాష్ట్ర – అరెస్ట్. ఘా3) రాథోడ్ పరమేశ్వర్ లాల్డోహ్ గ్రామం, జివితి తాలూకా, చంద్రపూర్ జిల్లా, మహారాష్ట్ర పరారీలో ఉన్నాడు.

ఘా4) దేవ్కతే పవన్ గా/శీ రాజేశ్వర్, వయస్సు 26 సంవత్సరాలు, కులం: ధన్గర్, వృత్తి: డీజే ఆపరేటర్, నివాసం: కొండలవాడి గ్రామం, బిలోలి తాలూకా, నాందేడ్ జిల్లా, మహారాష్ట్ర --- అరెస్ట్.

ఈ కేసులో నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జైనథ్ సీఐ జి. శ్రావణ్, బేలా ఎస్సై మధుకృష్ణ, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వన మహోత్సవం జలసిరి ఇందిరమ్మ ఇల్లు వివిధ అంశాలపై జూమ్ సమావేశంలో కలెక్టర్ హైమావతి

సిద్దిపేట జిల్లా ప్రతినిధి 01 సెప్టెంబర్( విజన్ ఆంధ్ర)సిద్దిపేట జిల్లా కేంద్రంలో గల సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హల్ లో వనమహోత్సవం, జలసిరి, ఇందిరమ్మ ఇళ్లు, పలు అంశాలపైన సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ కె. హైమావతి జూమ్ సమావేశం ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వనమహోత్సవం భాగంగా ప్లాంటేషన్ 83 శాతం పూర్తయిందని జిల్లా టార్గెట్ 17లక్షల 60 వేలకు గాను 14 లక్షల 63 వేలు ప్లాంటేషన్ చేశారని 100 శాతం ప్లాంటేషన్ పూర్తి చెయ్యాలని, పెట్టిన ప్రతి మొక్కకి జియో టాగింగ్ ప్రక్రియ కూడా పూర్తి చెయ్యాలని ఎంపిడిఓ లను ఆదేశించారు. లిజలసిరిలి లో భాగంగా వర్షానికి పడిన ప్రతి నీటి చుక్కను ఒడిసి పట్టడం కోసం ప్రభుత్వం ఈ జలసిరి కార్యక్రమం చేపట్టిందని ఆయా మండలాల్లోని ఆశించిన స్థాయిలో పనుల్లో పురోగతి లేనందున అసహనం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, అలసత్వం ప్రదర్శిస్తున్న ప్రతి ఒక్కరిపైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో ఫాంపొండ్ కోసం రైతులను గుర్తించి వెంటనే పనులు మొదలు పెట్టాలని, బోర్ వెల్ రీచార్జ్ స్టక్చర్ కోసం గ్రామంలో ఎన్ని ఇలాంటి బోర్లు ఉన్నాయి లెక్కించి ఆయా రైతులతో మాట్లాడి బోర్



వెల్ రీచార్జ్ స్టక్చర్ వలన బోర్లలో నీటి శాతం పెరుగుతుందని తెలపాలి. రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్టక్చర్, ఇంకుడుగుంతలు, సామూహిక ఇంకుడు గుంతలు, ముందుగా మండలంలోని ప్రభుత్వ భవనాలు అయిన గ్రామపంచాయతీ భవనాలు, స్కూల్స్, తహసిల్దార్ కార్యాలయం, ఎంపిడిఓ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్వాడీ భవనాలలు, ఎంపిక చేసుకుని ఎస్టిమేట్ వేసి రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్టక్చర్ తప్పనిసరిగా ఏర్పాటు చెయ్యాలని ఏపిఓ లను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లలి నిర్మాణాలు మొదటి విడతలో మంజూరు అయిన వాటిలో రూఫ్ లెవెల్ మరియు చిన్న చిన్న పనులు ఉన్న నిర్మాణాలను పూర్తి స్థాయిలో ఈ నెల 15 వరకు గృహ ప్రవేశాలు చేసేలా పని చెయ్యాలని, మార్కౌట్, గ్రౌండింగ్ కానీ వాటిని వెంటనే మొదలు పెట్టాలని, నిర్మాణంలో ఆలస్యం అవుతున్న వారితో స్థానిక ప్రజాప్రతిందులతో కలిసి చర్చించి నిర్మాణాలను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఓ లను ఆదేశించారు. రెండవ విడతలో మంజూరు చేయబడిన లబ్ధిదారుల వివరాలను క్షేత్రస్థాయిలో గెజిటెడ్ ఆఫీసర్ వెరిఫికేషన్ ప్రక్రియ వేగంగా పూర్తి చెయ్యాలని ఆదేశించారు. లివిబిజి రామ్ జీలి లో చేపడుతున్న మండలాల వారిగా గ్రామాల్లో మంజూరు అయిన అంగన్వాడి, గ్రామపంచాయతీ భవనాలు, ఎస్‌ఎచ్ జీ భవనాలు పనులు మొదలు పెట్టని వాటిని గ్రామాల్లో గ్రామ సర్పంచ్ పాలకవర్గం తో సమావేశాలు నిర్వహించి భవనాలను మొదలు పెట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భవనాల నిర్మాణంలో ఉన్నవి భవనాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లిచేయూత పెన్షన్లలి డెత్ మార్కింగ్ వెరిఫై ప్రక్రియ పూర్తి చేసి క్లోజ్ చెయ్యాలనిఆదేశించారు.ఈకార్యక్రమంలో జెడ్పి సిఈఓ మరియు ఇంచార్జీ డిఆర్డిఓ రమేష్, డిపిఓ రవీందర్, పంచాయతీ రాజ్ ఈఈ శ్రీనివాస్, మిషన్ భగీరథ ఈఈ, హౌసింగ్ పిడి భగవంత్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన సీఎం ప్రధాన కార్యదర్శి



నారాయణపేట ,సెప్టెంబర్ 1( విజన్ ఆంధ్ర) తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి సెప్టెంబర్ 4న నారాయణపేట జిల్లా మద్దూరు మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులను పరిశీలించేందుకు రానున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లను ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి శ్రీధర్ ఐఏఎస్ మంగళవారం పరిశీలించారు. జిల్లా కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ డాక్టర్ వినీత్, కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి తో కలిసి మద్దూరు పరిసర ప్రాంతాల్లో పర్యటించి వివిధ అభివృద్ధి పనులు, హెలిప్యాడ్ ఏర్పాట్లను పరిశీలించారు.ముందుగా మద్దూరు సమీపంలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం చింతల్‌దిన్నె మార్గంలో కొనసాగుతున్న సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాల,కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలించి పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.గురుకుల పాఠశాల,కళాశాల నిర్మాణ ప్రాంగణంలో భవన నిర్మాణానికి సంబంధించిన మ్యాప్, పనుల టైమ్‌లైన్‌తో కూడిన సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి మార్చి నెలలోపు పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ఆయన స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో హెలిప్యాడ్ ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను జిల్లా కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ డాక్టర్ వినీత్ పరిశీలించారు. మద్దూరు సమీపంలోని డిగ్రీ కళాశాల భవనం వద్ద ఒక స్థలంతో పాటు చింతల్‌దిన్నె సమీపంలోని మరో స్థలాన్ని పరిశీలించి, హెలిప్యాడ్ ఏర్పాటుకు అవసరమైన భద్రతా, సాంకేతిక ప్రమాణాలను పరిగణనలోకి తీసుకోవాలని అధికారులకు సూచించారు.ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలని సీఎం ప్రధాన కార్యదర్శి శ్రీధర్ అధికారులను ఆదేశించారు.

## హియరింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి
### జిల్లా కలెక్టర్ కె.హరిత




అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 1,( విసన్ ఆంధ్ర)ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా అనమలిస్ జాబితా, మ్యాపింగ్ కాని ఓటర్లకు అందజేసిన నోటీసుల హియరింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో చేపడుతున్న హియరింగ్ ప్రక్రియ, నోటీసులు, రిజిస్టర్లు, ఓటర్లు అందిస్తున్న ధ్రువపత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా మ్యాపింగ్ కాని, అనమలిస్ జాబితాలో గల ఓటర్లకు నిర్ణీత గడువులోగా నోటీసులు అందజేసి హియరింగ్ ప్రక్రియ చేపట్టాలని తెలిపారు. సంబంధిత నోటీసులు అందుకున్న ఓటర్ల నుండి అవసరమైన ధ్రువపత్రాలను స్వీకరించి బూత్ స్థాయి అధికారి యాప్ లో నమోదు చేయాలని, బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి నోటీసులు అందజేసి ఓటర్ల నుండి రసీదులు తీసుకోవాలని తెలిపారు. ఎలాంటి పొరపాట్లకు తావు ఇవ్వకూడదని, ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ రియాజ్ అలీ, రెవెన్యూ సిబ్బంది, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## మంత్రి కోమటిరెడ్డి క్యాంప్ కార్యాలయంపై దాడిని ఖండించిన కాంగ్రెస్ శ్రేణులు:

ఉమ్మడి నల్లగొండ జిల్లా బ్యూరో,(విజన్ ఆంధ్ర) రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నల్గొండలోని క్యాంప్ కార్యాలయంపై జరిగిన దాడిని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తీవ్రంగా ఖండించాయి.శుక్రవారం మంత్రి క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్,మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు.ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ"ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనలు తెలిపే హక్కు ప్రతి ఒక్కరికి ఉంటుంది.కానీసంస్కారహీనంగా,విలువలు మర్చిపోయి ప్రవర్తించడం సరికాదు. బీజేపీలో విలువలు కలిగిన నాయకులు ఎంతో మంది ఉన్నారు.ఇలాంటి చర్యల వల్ల ఆ పార్టీకి ఎలాంటి ప్రయోజనం ఉండదు.నల్గొండలో మంత్రి గారి ఇంటికి వచ్చి దాడి చేస్తే ఊరుకునేది లేదు.ఇక్కడ బీజేపీ–బీఆర్ఎస్ ఒక్కటే అయి ప్రశాంతంగా ఉన్న నల్గొండను రాజకీయ లబ్ధి కోసం రెచ్చగొడుతున్నారు.మరోసారి ఇలాంటి సంఘటనలు జరిగితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి"అని హెచ్చరించారు.మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. "దాడికి ప్రతిదాడి ఎప్పుడైనా ఉంటుంది.మంత్రి ఇంటిపై దాడి చేసి,బీజేపీ జిల్లా అధ్యక్షుడి కార్యాలయంలో దాక్కోవడం సరికాదు.దమ్ముంటే బయటకు రావాలి.మేము ఎప్పుడూ విలువలకు కట్టుబడి నిరసనలు తెలిపాం.నిరసనలు తెలిపే హక్కు అందరికి ఉంది కానీ ఈ విధంగా కాదు.మమ్మల్ని రెచ్చగొడితే ఊరుకునే ప్రసక్తే లేదు.బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పరామర్శల పేరుతో నల్గొండకు వస్తే నల్గొండ పొలిమేర నుంచే అడ్డుకొని తరిమికొడతాం.మా సహనాన్ని చేతగానితనంగా భావించవద్దు"అని తీవ్రంగా హెచ్చరించారు. ఈసమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


# పేట జిల్లా నుండి మహాధర్నాకు తరలిన పి ఆర్ టి యు ఉపాధ్యా యులు



నారాయణపేట, సెప్టెంబర్ 1 (విజన్ ఆంధ్ర) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ మంగళవారం హైద రాబాదులోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే మహా ధర్నా కు నారాయణపేట జిల్లా నలుమూలల నుండి పి ఆర్ టి యు ఆధ్వర్యం లో దాదాపు 600కు పైబడి ఉపాధ్యా యులు తరలి వెళ్లారు నారాయణపేట జిల్లా కేంద్రంలో జిల్లా అధ్య క్షులు వై జనార్దన్ రెడ్డి జెండా ఊపి వాహనాలను రాష్ట్ర రాజధానికి తరలిం చారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు వై జనార్దన్ రెడ్డి ప్రధాన కార్యదర్శి వెంకట రెడ్డి జిల్లాలోని మండలాల బాధ్యులు ఆయా మండలా లలో కార్యక్రమాన్ని ప్రారం భిస్తూ ప్రభుత్వము ఇచ్చిన హామీలైన పి ఆర్. సి,అమలు,సిపిఎస్ రద్దు 2003 డీఎస్సీ వారికి పాత పెన్షన్,317 జీవో కు పరిష్కారముచూపాలనీ,2008 డీఎస్సీ కాంట్రాక్టు ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయడం,హెల్త్ కార్డులను సక్రమంగా అమలు చేయడము వెంటనే చేయాలని లేని పక్షంలో ఉద్యమం తీవ్ర రూపం దాలుస్తుందని హెచ్చరించారు.నారాయణపేట జిల్లా నుండి ప్రాతిని ధ్యం వహిస్తున్న ముఖ్య మంత్రి 2034 వరకు వారు ముఖ్యమంత్రిగా ఉంటాను అని పదేపదే అంటున్నారు వారు ముఖ్యమంత్రిగా ఉండాలి అంటే 51 శాతం ఫిట్మెంట్తో పి ఆర్ సి నీ ప్రకటించాలని,సి పి ఎస్ రద్దు మిగిలిన అన్ని సమ స్యలను ప్రత్యేకించి వెంటనే చేస్తే రాబోయే జిహెచ్ఎంసి ఎన్నికలలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఉద్యో గ ఉపాధ్యాయులు ముఖ్య మంత్రి వెంబడి నిలబడి బాసటగా ఉంటారని అన్నారు. ప్రభుత్వము బేషజాల కు పోకుండా పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ హైద రాబాదు వైపుకు భారీ సంఖ్యలో బయలుదేరారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షులు పి.నర్సిం హా రెడ్డి జిల్లాలోని అన్ని మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుఎం.రఘువీర్,ఎం.జనార్ధన్,సత్యనారాయణ రెడ్డి,రమేష్,గోవర్ధన్, నరసింహారెడ్డి,భాస్కర్,సూర్యప్రకాష్, శేఖర్,అజయ్, బలరాం,తిమ్మన్న,గోపాల్ రెడ్డి,బాబు, వెంకటేష్, హరీష్, కిష్టయ్య, లక్ష్మణ్, నవీన్ కుమార్, ముస్తఫా, ప్రకాష్ గౌడ్,అనంతయ్య, వెంకటేష్,బీమేష్,రాజేంద్ర బాబు శ్రీకాంత్,వాణిశ్రీ,, జహీరుద్దీన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జిల్లా కార్యవర్గ సభ్యులు మహిళలు సంధ్య హిందు రాణి సభా సుల్తానా మాధవి శశిరేఖ శ్వేతా, అనిత,హేమలత,తిరుమల,కవిత కళ్యాణి అధిక మొత్తంలో ఉపాధ్యా యులు పాల్గొన్నారు .

# మైనారిటీల అభ్యున్నతే లక్ష్యంగా ఇందిరమ్మ పాలన

### గత పాలకుల నిర్లక్ష్యంతోనే అభివృద్ధికి దూరం
### అర్హులైన ప్రతి కుటుంబానికీ సంక్షేమ ఫలాలు
### రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



మేడ్చల్ జిల్లా ప్రతినిధి,సెప్టెంబర్ 01(విజన్ ఆంధ్ర) : గత పాలకుల నిర్లక్ష్యం కారణంగానే పేదలు, మైనారిటీ వర్గాలు అభివృద్ధికి దూరమయ్యారని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరమ్మ స్ఫూర్తితో బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ పాలన సాగిస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందించడమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.మేడ్చల్ నియోజకవర్గంలో ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన కింద అర్హులైన మహిళా లబ్ధిదారులకు చెక్కులు, స్వయం ఉపాధికి అవసరమైన సామగ్రి పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తుర్కకాశ లబ్ధిదారులకు జనరేటర్ సామగ్రిని అందజేశారు. మంత్రి శ్రీధర్‌బాబుతో పాటు ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తోటకూర వజ్రేశ్ యాదవ్ లబ్ధిదారులకు చెక్కులు, సామగ్రిని అందించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మైనారిటీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. స్వయం ఉపాధి ద్వారా మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకుని కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపర్చుకునేలా ప్రభుత్వం సహకరిస్తోందన్నారు. గతంలో సంక్షేమ పథకాలు కాగితాలకే పరిమితమయ్యాయని విమర్శిస్తూ, ప్రస్తుతం పారదర్శకంగా అర్హులను గుర్తించి నేరుగా లబ్ధి చేకూరుస్తున్నామని పేర్కొన్నారు.ఆరు గ్యారంటీల అమలుతో ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై విశ్వాసం పెరుగుతోందన్నారు. పేదరికం, వివక్షకు తావులేని తెలంగాణ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మను చౌదరి,ఎమ్మెల్యే అరకపూడి గాంధీ,కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్, మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ కొత్వాల్ ఒబేదుల్లా, ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి పరమేశ్‌రెడ్డి,కుత్బుల్లాపూర్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు భూపతిరెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు యాదవ్,బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## భీమా రంగంలో ఎల్ఐసికి 70 ఏళ్ల ఘన చరిత్ర ఉంది
### ఎల్ఐసి లో బీమా చేయండి...ధీమాగా జీవించండి.



నారాయణపేట , సెప్టెంబర్ 1 ( విజన్ ఆంధ్ర) భారతదేశంలోనే లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా బీమా సంస్థకు ప్రత్యేక 70 ఏళ్ల ఘన చరిత్ర ఉందని ఎల్ఐసి నారాయణపేట బ్రాంచ్ మేనేజర్ శ్రీ కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం నారాయణపేట బ్రాంచ్ ఆఫీస్ లో నాటికి 70 వసంతాలు పూర్తి చేసుకున్న జ్యోతి ప్రజ్వలన తదితర కార్యక్రమాలు చేపట్టారు. ఈ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత భీమా రంగం అంటే ముందుగా గుర్తుకు వచ్చే పేరు లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ( ఎల్ఐసి) కోట్లాదిమంది భారతీయుల జీవితాలకు ఆర్థిక భద్రత కల్పిస్తూ దేశంలోనే అతిపెద్ద జీవిత బీమా సంస్థగా పేరుగాంచిన ఎల్ఐసి ఏర్పాటై నేటితో 70 ఏళ్ళు గడుస్తున్న నేపథ్యంలో దాదాపు ఏడు దశాబ్దాలుగా భారతీయులకు ఆర్థిక భద్రత ప్రతికగా నిలుస్తున్న ఎల్ఐసి బీమా సేవలతో పాటు దేశ ఆర్థిక అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తుందని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ జీవిత బీమా తీసుకోవాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో సీనియర్ ఏజెంట్స్ మండికి ఆనంద్.రఘునాథ్ రావు.వెంకటయ్య రాంచందర్ నర్సప్ప బీమషాప్ప, డివో రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ ఆత్మకూరు

సంగం మండలం వంగల్లు గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పాల్గొన్నారు.మంత్రి మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రతినెలా 1వ తేదీనే పెన్షన్ల పంపిణీకి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ సెప్టెంబర్ నెల పెన్షన్ల కోసం రూ. 2,693.90 కోట్లు విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 61.93 లక్షల మంది లబ్ధిదారులకు నేడు పెన్షన్ల పంపిణీ జరుగుతోంది. కొత్తగా 6,268 మంది వితంతువులకు పెన్షన్లు.. ఇందుకోసం రూ. 2.51 కోట్లు విడుదల చేసామని అన్నారు.

## భారతీయుల అవసరాలకు అనుగుణంగా 'లగ్జూరియం' విడుదల

హైదరాబాద్, సెప్టెంబర్ 01 (విజన్ ఆంధ్ర) : భారతీయ కుటుంబాల ఆహార నిల్వ అవసరాలకు అనుగుణంగా 'లగ్జూరియం' పేరుతో ప్రీమియం 4–డోర్ రిఫ్రిజిరేటర్ శ్రేణిని మార్కెట్లోకి విడుదల చేసినట్లు వర్ల్‌పూల్ ఆఫ్ ఇండియా మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ నకుల్ తివారీ మంగళవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ 654 లీటర్ల సామర్థ్యంతో కూడిన ఈ రిఫ్రిజిరేటర్‌లో 360 డిగ్రీ ట్రిపుల్ కూలింగ్ టెక్నాలజీ, మూడు స్వతంత్ర కూలింగ్ సిస్టమ్స్, 30 నిమిషాల్లో కన్వర్ట్ అయ్యే కన్వర్టిబుల్ విభాగం, 100కుపైగా స్టోరేజ్ మోడ్‌లు, జీరో–బెండింగ్ క్రిస్పర్ డ్రాయర్లు వంటి ఫీచర్లు ఉన్నాయని తెలిపారు. 3–స్టార్ బీఈఈ రేటింగ్‌తో లభిస్తుందని తెలిపారు. డ్యుయో నాయిర్, నీరో క్వార్ట్జ్, డార్క్ క్వాంటమ్, రోడియమ్ స్టీల్, కాస్మోస్ బ్లాక్ ఫినిష్‌లలో లభించే ఈ శ్రేణిలో అబ్సిడియన్ ఇంటీరియర్స్, క్వాడ్ థియేటర్ లైటింగ్, మెటల్ కూలింగ్, బెవరేజ్ ర్యాక్, ఐకేర్ ఎక్స్‌పర్ట్ వంటి సదుపాయాలు ఉన్నాయని తెలిపారు.

## భూ సేకరణ కై చేపట్టిన సర్వే ని పరిశీలించిన కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 1 (విజన్ ఆంధ్ర)హసన్ పర్తి మండలం కోమిటిపల్లి లో రైల్వే వారికి సబ్ స్టేషన్ ఏర్పాటుకు కావలసిన భూమి కోసం అలాగే జయిగిరి లోని రైల్వే ట్రాక్ దగ్గర నిర్మించ తలపెట్టిన ఆర్వోబి ( ఆర్‌ఓబి ), ఆర్యుబి ( ఆర్ యు బి ) కి కావాలిసిన భూమి కోసం జరుగుతున్న సర్వే పనులను సంబంధిత అధికారులతో కలిసి మంగళవారం లిజిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పరిశీలించారు అనంతరం భీమారం శివారు లోని చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం వద్ద నిర్మించ తలపెట్టిన స్పోర్ట్స్ స్కూల్ కోసం స్థలాన్ని కూడా కలెక్టర్ పరిశీలించి రెవిన్యూ అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు ఆ తరవాత కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హల్ లో కుడా, రెవిన్యూ, రైల్వే అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యి రైల్వే శాఖ కి సంబందించిన భూ సేకరణ అంశాల మీద చర్చించి తగు సూచనలను తెలిపారు. ఈ సమావేశం లో ఆర్డివో వెంకటేశ్వర్లు, కుడా పి ఓ అజిత్ రెడ్డి, ఐ ఆర్ ఏ సి సైలేష్, డి వై ఎస్ ఓ ప్రశాంత్, జిల్లా మత్స్య శాఖ అధికారి పిల్లి శ్రీపతి, ఆర్ అండ్ బి ఈ ఈ చరణ్, ఎన్ పి డి సి ఎల్ ఎస్సీ ఈ సామ్య నాయక్, ,రైల్వే అసిస్టెంట్ ఎక్సక్యూటివ్ ఇంజనీర్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

## సిసి రోడ్లు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



.హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 1 (విజన్ ఆంధ్ర)వర్ధన్నపేట నియోజకవర్గంలోని గ్రేటర్ వరంగల్ మున్సిపాలిటీ 1వ, 65వ డివిజన్, 66వ డివిజన్లలో 3కోట్ల 75లక్షల విలువ గల సిసిరోడ్లు,డ్రైనేజీ పనులకు మంగళవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే,విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...దాదాపు 20 నుంచి 25 ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న రోడ్ల సమస్య,డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు ఈ అభివృద్ధి పనులు చేపట్టామని అన్నారు.వర్ధన్నపేట నియోజకవర్గానికి అభివృద్ధి పథంలో తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.దశల వారీగా అన్ని డివిజన్లో,అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చేపడతమన్నారు.అసత్య ప్రచారాలు చేస్తున్న ప్రతిపక్ష నాయకులకు ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెప్తారన్నారు.గత రెండు సార్లు అధికారంలో ఉండి అభివృద్ధి చేయని దద్దమ్మలు అసత్య ప్రచారాలతో కాలం వెల్లబుచుతున్నారని మండిపడ్డారు.ఎక్కడ సమస్యలు ఉన్న డయల్ యువర్ ఎమ్మెల్యే నెంబర్ కి సంప్రదించి సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో 1వ డివిజన్ అధ్యక్షులు చిర్ర రాము,65వ డివిజన్ అధ్యక్షులు సునీల్, 66వ డివిజన్ అధ్యక్షులు గొర్రె కిరణ్,ఎనుమాముల మార్కెట్ డైరెక్టర్ రైతు రాజు,ఆత్మకూరు మార్కెట్ వైస్ చైర్మన్ తిరుపతి,హసన్పర్తి మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు రాకేష్ రెడ్డి,హనుమకొండ జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు పింగిలి వెంకటరెడ్డి, హసన్పర్తి మండల అధ్యక్షులు అశోక్, హసన్పర్తి మాజీ మండల అధ్యక్షులు పోరెడ్డి మహేందర్ రెడ్డి,66 వ డివిజన్ మాజీ అధ్యక్షులు కనపర్తి కిరణ్,మండల మహిళ ఉపాధ్యక్షురాలు స్వాతి,సీనియర్ నాయకులు దేవరకొండ అనిల్,చంటి రెడ్డి,ఎర్ర ప్రకాష్,శ్రీకాంత్ రెడ్డి, విసం సురేందర్ రెడ్డి,భాషా,వేణు,కుమారస్వామి, వెంకటస్వామి,ఆనంద్,ఎల్ఐసి వెంకన్న, నరసింహ, రాములు,శ్రీనివాస్,డివిజన్ల ముఖ్య నాయకులు,అధికారులు తదితరులు

## అవార్డుల జారీ ప్రక్రియ వేగవంతం చేయాలి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 01,(విజన్ ఆంధ్ర)జిల్లాలో జాతీయ రహదారి 63 రహదారి నిర్మాణంలో అవార్డుల జారీ ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మంచిర్యాల రాజస్వ మండల అధికారి కార్యాలయాన్ని సందర్శించి డి.ఎ.ఓ. రమేష్ తో కలిసి జాతీయ రహదారి విస్తరణలో దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన జాతీయ రహదారి 63 విస్తరణలో అవార్డుల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. దరఖాస్తులను త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రుల ఆశయాలను అనుకూలంగా పిల్లలను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే



సిద్దిపేట జిల్లా ప్రతినిధి01 సెప్టెంబ ర్ ,(విజన్ ఆంధ్ర) ప్ర తల్లిదండ్రుల ఆశయాలకనుగుణంగా విద్యార్థులనుతీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాలదేనని జిల్లా కలెక్టర్ కే. హైమావతి ఉపాధ్యాయులకు సూచించారు.మంగళవారం జిల్లా కేంద్రంలోని టీటీడీసీ భవన్ లో మండల విద్యాశాఖ అధికారులుమరియుప్రధానోపాధ్యాయులతో జిల్లా కలెక్టర్ విద్యాశాఖ రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మండలాల వారీగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల ఎన్రోల్మెంట్ ను తెలుసుకొని నిర్దేశిత లక్ష్యం మేరకు ప్రభుత్వ పాఠశాలలలోవిద్యార్థులనుచేర్చుకోవడంలో విద్యాశాఖ వెనుకబడి ఉందని అన్నారు. 89462 మందివిద్యార్థులనుచేర్చుకోవాలని లక్ష్యం పెట్టుకోగా 82489 నందిని చేర్చుకోవడం జరిగిందని 7.79 % చేయాల్సి ఉందని అన్నారు.ఉపాధ్యాయులపై తల్లిదండ్రులకు నమ్మకం కలిగితే తప్పకుండావిద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలకు పంపిస్తారని, విద్యార్థుల ఎదుగుదలని లక్ష్యంగా తల్లిదండ్రుల ఆశయాల మేరకు విద్యార్థులకు విద్యాబుద్ధులు చెప్పాలని ఉపాధ్యాయులకు సూచించారు.విద్యార్థుల,ఉపాధ్యాయుల హాజరు శాతం అధికంగా ఉండాలని అన్నారు. విద్యార్థుల ఆధార్ నమోదు శనివారంలోగా పూర్తి చేయాలని అన్నారు. విద్యతోపాటు మోరల్ వాల్యూస్ పిల్లలకు నేర్పాలని, తమ వద్ద చదువుకున్న పిల్లలు ఏ స్థాయిలో ఉన్నా కూడా తమకు విద్యాబుద్ధులు నేర్పినఉపాధ్యాయులను ఎప్పటికీ మర్చిపోరని అది ఉపాధ్యాయులకు ఎంతో గౌరవం అని తెలిపారు. వివిధ సంక్షేమ హాస్టల్ లో చదువుకునే విద్యార్థులు ఒకరోజు రెండు రోజులు హాలిడేస్ వస్తే ఇండ్లకు వెళ్లిత్వరగారావడంలేదనిఉపాధ్యాయులు ఈ సందర్భంగా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్, సెక్టోరల్ అధికారి రామస్వామి, ఎంఈఓలు,ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రతి బుధవారం రాజకీయ పార్టీలతో సమావేశాలు,

## జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్,




నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర): సెప్టెంబర్ 01 నాగర్ కర్నూల్ కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ బి చెన్నయ్య తో కలిసి గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితా సవరణ పై సమావేశంలోప్రత్యేక ఓటరు నమోదు, ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించుకునేందుకు ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రచార రోజులను ప్రతి ఒక్క ఓటరు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, సూచించారు.సెప్టెంబర్ 16 వరకు ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు, సెప్టెంబర్ 5, 6, 12, 13 తేదీల్లో ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని ఫారం–6 ద్వారా నూతన ఓటర్లుగా నమోదు చేసుకోవడంతో పాటు, ఫారం–7, ఫారం–8కు సంబంధించిన అభ్యంతరాలు, మార్పులు, చేర్పులు తదితర సమస్యలను పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు.ఇంతకుముందు ఎన్యూమరేషన్ ఫారాలు పొందని ఓటర్లు కూడా ఈ ప్రత్యేక ప్రచార రోజుల్లో ఫారం–6తో పాటు డిక్లరేషన్ ఫారాన్ని జత చేసి బీఎల్ఓలకుఅందజేయాలని కలెక్టర్ సూచించారు. ఓటర్లకు అవసరమైన సహాయాన్నిఅందించేందుకు బీఎల్ఓలుక్షేత్రస్థాయిలోఅందుబాటులోఉండాలనిఆదేశించారు.ఎస్ఐఆర్‌లో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్లు హియరింగ్‌కు హాజరయ్యే సమయంలో సంబంధిత ధ్రువపత్రాలను తప్పనిసరిగా వెంట తీసుకురావాలని కలెక్టర్ తెలిపారు. రీ–హియరింగ్‌కు ఒకసారి మాత్రమే అవకాశం ఉన్నందున, ఓటర్లు తమకు సంబంధించిన అన్ని ఆధారాలను ముందుగానే సిద్ధం చేసుకొని హాజరు కావాలని సూచించారు.ప్రభుత్వం జారీ చేసిన వివిధ రకాల ధ్రువపత్రాల్లో ఆధార్, కుల ధ్రువీకరణ పత్రం, ఎస్ఎస్‌సీ ధ్రువపత్రం, జనన ధ్రువీకరణ పత్రం వంటి పత్రాలు ముఖ్యమైన ఆధారాలుగా ఉపయోగపడతాయని తెలిపారు. 2004 తర్వాత జన్మించిన వారు తమ తల్లిదండ్రులిద్దరికీ సంబంధించిన ధ్రువపత్రాలతో పాటు సంబంధిత ఓటరు ధ్రువపత్రాన్నిసమర్పించాలని, 2004కు ముందు జన్మించిన వారు తమకు సంబంధించినధ్రువపత్రాలతో పాటు తల్లి లేదా తండ్రికి సంబంధించిన ఆధారాలను విధిగా నమర్పించాలనిసూచించారు.జిల్లాలో ఇప్పటివరకు దాదాపు లక్ష నోటీసులను ఓటర్లకు అందజేసినట్లు కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్తెలిపారు.నోటీసులు అందుకున్న ప్రతి ఓటరు నిర్ణీత సమయంలో హియరింగ్‌కు హాజరై, అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించి ఎన్నికల సిబ్బందికి సహకరించాలని కోరారు.ఈ సమావేశంలో కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రవి కుమార్, ఎన్నికల డీటీ కల్పనతో పాటు గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ తరఫున హబీబ్, బీజేపీ తరఫున రాజేందర్, టీడీపీ తరఫున బాలకృష్ణ, వైఎస్సార్‌సీపీ తరఫున ఎం.డి. హుస్సేన్, బీఆర్ఎస్, బీఎస్పీ పార్టీల ప్రతినిధులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 12న ఏపూరి సోమన్న 'సిల్వర్ జూబ్లీ పాటల పోరాటం' సదస్సు: విజయవంతం చేయాలని పిలుపు



హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 1 ( విజన్ ఆంధ్ర ): ప్రజా గాయకుడు ఏపూరి సోమన్న ప్రస్థానం 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 12వ తేదీన హన్మకొండలోని కాకతీయ విశ్వవిద్యాలయంలో "సిల్వర్ జూబ్లీ పాటల పోరాటం" పేరిట ప్రత్యేక సదస్సు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ వ్యాప్తంగా ఉన్న కవులు, కళాకారులు, మేధావులు, విద్యార్థి లోకం పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఏపూరి సోమన్న పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "నా పేరే ఏపూరి -- పోరాటమే నా దారి" అని స్పష్టం చేశారు. తెలంగాణ సమాజంలో కవులకు, కళాకారులకు ఎక్కడ అన్యాయం జరిగినా ప్రశ్నించడానికి, వారి పక్షాన నిలబడి ఎదిరించడానికి తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని ప్రకటించారు.ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో యువత పెడదోవ పడుతూ మాదకద్రవ్యాలు (డ్రగ్స్) బారిన పడుతుండటంపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. యువతను జాగృతం చేసి సరైన మార్గంలో నడిపించేందుకు అక్టోబర్ నెల నుంచి తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పర్యటనలు, చైతన్య కార్యక్రమాలు చేపడతానని సోమన్న వెల్లడించారు.

## ఎఓపెన్ చెస్ ఛాంపియన్ మన కొండపాక ముద్దుబిడ్డ




జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 1 (విజన్ ఆంధ్ర)డిస్ట్రిక్ట్ లెవెల్ ఓపెన్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా సిద్దిపేట జిల్లా కేంద్రంలో జరిగిన చెస్ పోటీల్లో మన కొండపాక ముద్దుబిడ్డ సిహెచ్ రాజు అద్భుత ప్రతిభ కనబరిచాడు. 7 రౌండ్లలో వరుసగా విజయాలు సాధించి తన సత్తాను చాటాడు. ఈ ఘన విజయంతో డిసెంబర్ నెలలో హైదరాబాద్‌లో జరిగే స్టేట్ లెవెల్ చెస్ ఛాంపియన్‌షిప్‌కు అర్హత సాధించాడు.చిన్నతనంలో తన గురువు సంతోష్ శర్మ వద్ద నేర్చుకున్న చెస్ ఆటలో ఇప్పుడు ఈ స్థాయిలో విజయం సాధించడం ఎంతో ఆనందంగా ఉందని సిహెచ్ రాజు తెలిపాడు.తన శిష్యుడు సాధించిన ఈ ఘన విజయంపై గురువు సంతోష్ శర్మ సంతోషం వ్యక్తం చేశారు. అలాగే పలువురు చెస్ ప్రేమికులు కూడా సిహెచ్ రాజు విజయాన్ని అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.స్టేట్ లెవెల్‌లోనూ విజయకేతనం సాధించిన రాజుకు స్కూలు యాజమాన్యం భవిష్యత్తులో మంచి అవకాశాలు సాధించి విజయకేతనం ఎగురవేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం.

# అంబేద్కర్ అభయహస్తం రూ.12 లక్షలు 12 మందికైనా ఇచ్చారా?

## హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం




సిద్దిపేట జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 1 (విజన్ ఆంధ్ర)సిద్దిపేట జిల్లా కేంద్రంలో అక్టోబర్‌లో ఎమ్మార్పీఎస్ మహాదీక్షఅర్హులైన దళితులందరికీ వెంటనే రూ.12 లక్షలు అందించాలిఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్ మాదిగదళిత బంధు పథకానికి బదులుగా ఇస్తామని హామీ ఇచ్చిన "అంబేద్కర్ అభయహస్తం" పథకం కింద దళితులకు రూ.12 లక్షలు అందిస్తామని చెప్పి, ఇప్పటివరకు కనీసం 12 మందికైనా ఆర్థిక సహాయం అందించారా? అని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. హామీలను అమలు చేయకుండా దళితులను మోసం చేస్తున్నారని ఆయన ఆరోపించారు.మంగళవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోనీ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన ముఖ్య సమావేశంలో వంగపల్లి శ్రీనివాస్ మాదిగ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో తీవ్రంగా విఫలమైందని విమర్శించారు. ముఖ్యంగా అంబేద్కర్ అభయహస్తం కింద అర్హులైన దళితులకు రూ.12 లక్షలు వెంటనే అందించాలని డిమాండ్ చేశారు.దళితులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయకపోతే ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ డిమాండ్‌పై అక్టోబర్ నెలలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మహాదీక్ష చేపట్టనున్నట్లు ప్రకటించారు. మహాదీక్ష ద్వారా దళితులను నమ్మించి మోసం చేస్తున్న ప్రభుత్వానికి మాదిగల సత్తా చూపిస్తామని ఆయన అన్నారు.అసైన్డ్ భూములపై హామీ ఏమైంది?అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పిస్తామని, గత ప్రభుత్వ హయాంలో గుంజుకున్న భూములను సైతం తిరిగి ఇప్పిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని వంగపల్లి గుర్తుచేశారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని ఎందుకు అమలు చేయడం లేదో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ప్రత్యేక కార్పొరేషన్లు ఎక్కడ?ప్రభుత్వ సంక్షేమ పథకాలు కింది స్థాయి వరకు సక్రమంగా చేరేలా మాదిగ, మాల, ఇతర ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని కూడా ప్రభుత్వం అమలు చేయలేదని ఆయన ఆరోపించారు. ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేయకపోగా, ఉన్న ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కూడా దళితులకు రుణ సౌకర్యం అందడం లేదని విమర్శించారు.కాంట్రాక్టుల్లో ఎస్సీలకు రిజర్వేషన్లు ఏమైనా అమలయ్యాయా?ప్రభుత్వ కాంట్రాక్టుల్లో ఎస్సీలకు రిజర్వేషన్ కల్పిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఇప్పటివరకు ఎంతమంది దళితులను కాంట్రాక్టర్లుగా తీర్చిదిద్దారో ప్రభుత్వం బహిరంగంగా ప్రకటించాలని వంగపల్లి డిమాండ్ చేశారు.అలాగే ఎస్సీ రిజర్వేషన్ల పెంపు కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఏమిటో ప్రజలకు వివరించాలని కోరారు.విదేశీ విద్యా పథకంపై స్పష్టత ఇవ్వాలిఅంబేద్కర్ విదేశీ విద్యా పథకం కిందఇప్పటివరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి? వాటిలో ఎన్ని దరఖాస్తులను పరిష్కరించారు? ఎంతమంది విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించారు? అనే వివరాలను ప్రభుత్వం వెల్లడించాలని వంగపల్లి డిమాండ్ చేశారు.రాజీవ్ యువ వికాస పథకంపై ఆగ్రహందళిత యువతకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు ప్రకటించిన రాజీవ్ యువ వికాస పథకం ఎందుకు మూలన పడేసిందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఆయన ప్రశ్నించారు. దరఖాస్తుదారులను మభ్యపెట్టే ప్రయత్నాలు చేయకుండా, పథకం అమలుపై స్పష్టమైన కార్యాచరణప్రకటించాలనిడిమాండ్చేశారు.దళితులకు ఇచ్చిన హామీలన్నింటినీ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వంగపల్లి శ్రీనివాస్ మాదిగ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కట్కూరి పరశురాములు, ఎర్ర ఎల్లం, నముండ్ల శ్రీకాంత్ రాజేందర్, గాజుల ముత్య, కర్రె మాణిక్యం, పోతురాజు శంకర్, బెజ్జంకి తిరుపతి, సంఘం నాయకులు పాల్గొన్నారు.

## పాఠశాల స్థాయి క్రికెట్ టోర్నమెంట్లో విజేతలకు బహుమతుల ప్రధానం



నారాయణపేట , సెప్టెంబర్ 1 (విజన్ ఆంధ్ర) నారాయణపేట జిల్లా కేంద్రంలోని క్రీడా మైదానంలో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా నారాయణపేట క్రికెట్ అసోసియేషన్ మరియు పిఈటిల ఆధ్వర్యంలో నిర్వహించిన పాఠశాల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ మాడ్రన్ హైస్కూల్ మరియు వైదిక పాఠశాల మధ్య బీజేపీ జిల్లా అధ్యక్షులు సత్య యాదవ్, జిల్లా క్రీడా అధికారి వెంకటేష్ టాస్ వేసి ప్రారంభించారు. హోరాహోరిగా జరిగిన ఈ మ్యాచ్లో మాడ్రన్ హై స్కూల్ జట్టు విన్నర్ గా ,వైదిక పాఠశాల జట్టు రన్నర్ గా నిలిచింది. ఇరుజట్లకు ముఖ్య అతిథులు జిల్లా జూనియర్ కళాశాల విద్యాశాఖ అధికారి సుదర్శన్ రావు తో పాటు శ్రీ సాయి స్కూల్ వ్యవస్థాపకులు డాక్టర్ పి నరసింహ రెడ్డి జ్ఞాపకార్థంగా వారి సతీమణి పి లలిత బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా జూనియర్ కళాశాల విద్యాధికారి సుదర్శన్ రావు మాట్లాడుతూ ఈ పోటీలో పాల్గొన్నటువంటి క్రీడాకారులందరికీ అభినందనలు తెలిపారు. క్రికెట్ లో రాష్ట్ర స్థాయిలో రాణించి నారాయణపేట జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. ఆటలలో గెలుపోటములు సహజంగా తీసుకొని క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని సూచించారు. ఓడిన జట్టు గెలుపు కోసం కృషి చేయాలని అదేవిధంగా గెలిచిన జట్టు ఇంకా పై స్థాయిలో రాణించుటకు ప్రయత్నం చేయాలని అన్నారు. ప్రతి సంవత్సరము జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఈ యొక్క క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్న పిడి రమణను, క్రికెట్ కోచ్ ను, ఎంపైర్లను మరియు ఈ యొక్క పోటీలు విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పి. లలిత, నహీమ్, ఖాదీర్, రమణ, హెచ్.నర్సింహా, ఖాదర్, అజయ్, తాజ్, ప్రవీణ్ జహీర్ ఆకాష్ ఆనంద్ అక్తర్ పాషా మరియు క్రికెట్ క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఎరువుల బుకింగ్ యాప్ పై రైతులకు అవగాహన కలిగించాలి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



అలంపూర్ సెప్టెంబర్ 1 (విజన్ ఆంధ్ర బ్యూరో)యూరియా, డిఏపి, కాంప్లెక్స్, ఇతర ఎలాంటి ఎరువులు కొనుగోలు చేయాలన్న ఫ్రేమ్ వర్క్ ఫర్ ఫర్టిలైజర్ ఆప్ ను వినియోగించడంపై రైతులకు అవగాహన కలిగించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం శాంతినగర్ పట్టణం లోని పలు ఫర్టిలైజర్స్ దుకాణాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. యాప్ వినియోగంపై ప్రతి దుకాణం వద్ద బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. వివిధ రకాల విత్తనాలు, ఎరువుల అమ్మకాల గురించి యజమానులతో మాట్లాడారు. ఈ పర్యటనలో ఏడిఏ శివనాగిరెడ్డి, ఎంఏఓ రాధ, ఏఈఓలు విమల, వినోద్ కుమార్, తదితరులున్నారు

## తార్నాకలో ఉద్రిక్తత.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు అరెస్ట్

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావును పోలీసులు మంగళవారం తార్నాకలోని ఆయన నివాసం వద్ద అరెస్టు చేశారు. సోమవారం నల్గొండలోని బీజేపీ కార్యాలయం వద్ద జరిగిన అల్లర్ల నేపథ్యంలో ఆయన నల్గొండకు బయలుదేరేందుకు సిద్ధమవగా పోలీసులు అడ్డుకున్నారు.ఈ క్రమంలో రామచంద్రరావును అరెస్టు చేసేందుకు పోలీసులు ప్రయత్నించడంతో అక్కడ కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఆయన అరెస్టును అడ్డుకునేందుకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రయత్నించారు. దీంతో పోలీసులు, బీజేపీ నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం పోలీసులు రామచంద్రరావును అదుపులోకి తీసుకుని అక్కడి నుంచి తరలించారు.

# 1000 రోజుల్లో తెలంగాణ ప్రగతికి కొత్త బాట

## భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి పకడ్బందీగా రీ సర్వేను చేపట్టాలి

### రైతుల సమక్షంలోనే కొలతలు నిర్వహించాలి, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్,



నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర): సెప్టెంబర్ 01 భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో చేపట్టిన భూముల రీ సర్వే పనులను పకడ్బందీగా, పారదర్శకంగానిర్వహించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం కొల్లాపూర్ నియోజకవర్గంలోని మొలచింతలపల్లి గ్రామ శివారులో కొనసాగుతున్న భూముల రీ సర్వే పనులను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అదనపు కలెక్టర్ బి చెన్నయ్య, ఆర్డిఓ బన్సీలాల్ లతో కలిసి కొనసాగుతున్న రీ సర్వే ప్రక్రియను పరిశీలించి, అధికారులను సంబంధి భూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ. ప్రతి సర్వే నంబర్‌ను క్షుణ్ణంగా కొలిచి, సంబంధిత వివరాలను పక్కాగా డిజిటలైజ్ చేయాలని, రీ సర్వే ప్రక్రియతో పాటు ప్రతి గ్రామానికి సంబంధించిన డిజిటల్ మ్యాపులను కూడా సిద్ధం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. భూముల హద్దులు, విస్తీర్ణం విషయంలో ఎలాంటి తేడాలు లేకుండా అత్యంత జాగ్రత్తగా కొలతలు చేపట్టాలని, ముఖ్యంగా రైతుల సమక్షంలోనే సర్వే నిర్వహించాలని స్పష్టం చేశారు. భవిష్యత్తులో భూ వివాదాలకు అవకాశం లేకుండా రీ సర్వే ప్రక్రియను పూర్తి స్థాయిలో పారదర్శకంగానిర్వహించాలనికలెక్టర్సూచించారు. మొలచింతలపల్లి గ్రామంలో ప్రస్తుతం 41,954 ఎకరాల 16 గుంటల భూమి విస్తీర్ణం ఉన్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. రీ సర్వే ద్వారా భూములకు సంబంధించిన హద్దులు, విస్తీర్ణం, ఇతర వివరాలను పక్కాగా నమోదు చేసి డిజిటల్ రికార్డులను రూపొందిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంట ఏడీ గిరిధర్, తహసీల్దార్ మాధవి, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## దళిత జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

### -దళిత జర్నలిస్టుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కాషాపోగు జాన



సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ :01(విజన్ ఆంధ్ర)దళిత జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యు చేపట్టాలని దళిత జర్నలిస్టుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కాషాపోగు జాన్ డిమాండ్ చేశారు. మంగళవారం నాడు సంగారెడ్డి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకుంది. సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కాషాపోగు జాన్, రాష్ట్ర అధ్యక్షులు యాదగిరి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించగా, జిల్లా అధ్యక్షులుగా రామని అశోక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కాషాపోగు జాన్ మాట్లాడుతూ దళిత జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ అభయహస్తం పథకం కింద రూ. 12 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించాలని, ఇల్లు, ఇంటి స్థలం లేని దళిత జర్నలిస్టులకు ఇల్లు, ఇంటి స్థల పట్టాలు మంజూరు చేయాలని కోరారు. అలాగే దళిత జర్నలిస్టులకు ఉచిత బస్సు పాస్ సౌకర్యం కల్పించడంతో పాటు ప్రభుత్వ ఆరోగ్య హెల్త్ కార్డులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రత్యేక సంక్షేమ పథకాలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. నూతన జిల్లా అధ్యక్షులు రామని అశోక్ మాట్లాడుతూ, దళిత జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం కోసం సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని అన్నారు. రాష్ట్ర అధ్యక్షులు యాదగిరి మాట్లాడుతూ దళిత జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. దళిత జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు సంఘం తరఫున నిరంతరం పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రత్న కుమార్, ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు రాపాక విజయరాజు , సీనియర్ జర్నలిస్టులు విలాస్, రాజు, అశోక్ తో పాటు పలువురు దళిత జర్నలిస్టులు పాల్గొన్నారు.

## జిల్లా లో 30, 30(ఎ) పోలీసు యాక్ట్ అమలు

### జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర

కామారెడ్డి బ్యూరో ఆగస్ట్ 31 (విజన్ఆంధ్ర) కామారెడ్డి జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని నెల రోజుల పాటు (సెప్టెంబర్ 1వ తేది నుండి 30 వరకు) జిల్లా వ్యాప్తం గా 30,30(ఎ) పోలీసు యాక్ట్ 1861 అమలులో ఉంటుందని కామారెడ్డి జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర తెలిపినారు. పోలీసు అధికారుల అనుమతి లేకుండా జిల్లా ప్రజలు ధర్నాలు, రాస్తా రోకోలు, నిరసనలు, ర్యాలిలు, పబ్లిక్ మీటింగ్ లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని తెలిపినారు. అలాగే ప్రజా ధనాన్ని నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని ఎస్పీ హెచ్చరించారు. జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు తమకు ఈ విషయంలో సహకరించాలని తెలిపినారు. అనుమతి లేకుండా పై చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టరిత్య కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు హెచ్చరించారు.

## గణేష్ ఉత్సవాలపై మంత్రి పొన్నం సమీక్షా సమావేశం

హైదరాబాద్గణేష్ ఉత్సవాలపై మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం సమీక్ష నిర్వహించారు. జ ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, నవీన్ యాదవ్, డీజీపీ సీవీ ఆనంద్, పోలీస్ కమిషనర్లు, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, కలెక్టర్లు, జీహెచ్ఎంసీ మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల అధికారులు, భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

## సంక్షేమం, అభివృద్ధితో ప్రజల గుండెల్లో కాంగ్రెస్

### రైతు, మహిళ, పేద, యువత సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

### వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య



హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 1 (విజన్ ఆంధ్ర)కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజుల ప్రజాపాలనను విజయవంతంగా పూర్తి చేసుకుందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. హనుమకొండలోని డీసీసీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. ఈ 1000 రోజుల్లో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత కాంగ్రెస్ శ్రేణులపై ఉందన్నారు. రైతే రాజు.. రైతు సంక్షేమమే ధ్యేయంకాంగ్రెస్ ప్రభుత్వం గత 32 నెలల్లో రైతుల కోసం రూ. 1.68 లక్షల కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. హామీ మేరకు రూ. 2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేసి 25 లక్షల రైతు కుటుంబాలకు రుణవిముక్తి కల్పించామని చెప్పారు. రైతు భరోసా కింద రూ. 36 వేల కోట్లు విడుదల చేయగా, కేవలం 9 రోజుల్లోనే రూ. 9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని పేర్కొన్నారు. సన్నబియ్యం సాగును ప్రోత్సహించేందుకు క్వింటాలుకు రూ. 500 బోనస్‌తో పాటు ఉచిత విద్యుత్, రైతు బీమా పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. యాసంగి సీజన్‌లో 81 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి, ధాన్యం ఉత్పత్తిలో పంజాబ్‌ను అధిగమించి తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందన్నారు. మహిళలకు ఆర్థిక భరోసామహిళా సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని కావ్య అన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఇప్పటివరకు రూ. 11 వేల కోట్ల ప్రయాణ వ్యయం ఆదా అయిందన్నారు. గృహజ్యోతి ద్వారా 53 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ. 500కే గ్యాస్ సిలిండర్ పథకం ద్వారా 43 లక్షల మంది మహిళలకు లబ్ధి చేకూరిందని తెలిపారు. మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు 4.50 లక్షల స్వయం సహాయక సంఘాలకు బ్యాంక్ లింకేజీ ద్వారా రూ. 60 వేల కోట్ల రుణాలు అందించామని చెప్పారు. మహిళా సంఘాలకు సోలార్ పవర్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు, ఆర్టీసీ బస్సుల నిర్వహణ వంటి అవకాశాలను కల్పిస్తున్నామని వివరించారు. పేదలకు సంక్షేమం.. సామాజిక న్యాయానికి పెద్దపీట15 లక్షలకు పైగా కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేసి మొత్తం 3.38 కోట్ల మందికి పీడీఎస్ ద్వారా లబ్ధి అందిస్తున్నామని తెలిపారు. 43 లక్షల మందికి పైగా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెన్షన్లు అందిస్తున్నామని, మరో 2.25 లక్షల మందికి కొత్తగా పెన్షన్లు మంజూరు చేశామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా తొలి విడతలో 4.50 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టి, ఒక్కో కుటుంబానికి రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల టవర్లు, వరంగల్‌లో టవర్ ఫ్లాట్ల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. బీసీ కులగణన.. సామాజిక న్యాయానికి చారిత్రక అడుగుదేశంలోనే తొలిసారిగా బీసీ కులగణన పూర్తి చేసి, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేలా అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపామని కావ్య తెలిపారు. ఎస్సీ వర్గీకరణ అమలుకు కూడా అసెంబ్లీలో తీర్మానం చేశామని చెప్పారు. 12 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కనీస వేతనాల సవరణతో 1.11 కోట్ల మంది కార్మికులకు ప్రయోజనం కలిగిందన్నారు. గిగ్ వర్కర్లకు చట్టబద్ధ గుర్తింపు కల్పిస్తూ ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేశామని తెలిపారు. విద్య, ఉద్యోగాలు, వైద్యానికి ప్రాధాన్యతతెలంగాణ విద్యా రంగం పనితీరు మెరుగుపడి పెర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్‌లో 28వ స్థానం నుంచి 18వ స్థానానికి చేరిందన్నారు. ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టామని చెప్పారు. మెగా డీఎస్సీ ద్వారా 10 వేల ఉపాధ్యాయ నియామకాలు పూర్తి చేశామని, తొలి 1000 రోజుల్లో 72 వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను పూర్తి చేశామని తెలిపారు. యువతకు నైపుణ్య శిక్షణ అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 10 లక్షలకు పెంచామని చెప్పారు. గోషామహల్‌లో రూ. 2,700 కోట్లతో 2 వేల పడకల ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం చేపట్టామని, నిమ్స్‌లో 2 వేల కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తయ్యాయని తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాలే కాంగ్రెస్ లక్ష్యంబీఆర్ఎస్ పదేళ్ల పాలనలో తెలంగాణ ఆర్థికంగా తీవ్ర సవాళ్లను ఎదుర్కొన్నప్పటికీ.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతోందని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య అన్నారు. గత ప్రభుత్వాలు సాధించలేని అనేక అభివృద్ధి కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వం వేగంగా పూర్తి చేస్తోందన్నారు. బీఆర్ఎస్, బీజేపీలు ప్రభుత్వంపై అవాస్తవాలు ప్రచారం చేయడం దురదృష్టకరమన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా తెలంగాణపై వివక్ష చూపుతోందని ఆరోపించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు, ప్రాజెక్టులు, విభజన హామీలను అమలు చేస్తే తెలంగాణ అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని అన్నారు. కాంగ్రెస్‌కు పెరుగుతున్న ప్రజాదరణప్రతిపక్షాలు ఎన్ని అవాస్తవాలు ప్రచారం చేసినా కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల విశ్వాసం రోజురోజుకూ పెరుగుతోందని ఎంపీ డా. కావ్య అన్నారు. రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని, దేశంలో రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావడం ఖాయమని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య ధీమా వ్యక్తం చేశారు.

## డ్రై రన్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

### పనులను వేగవంతం చేయాలి,

### అంజనగిరి రిజర్వాయర్‌లో నిర్మిస్తున్న మిషన్ భగీరథ ప్రత్యామ్నాయ పంప్‌హౌస్ పనులను పరిశీలించిన

### జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్,




నాగర్‌కర్నూల్ జిల్లా ప్రతినిధి (విజన్ ఆంధ్ర): సెప్టెంబర్ 01 కొల్లాపూర్ నియోజకవర్గం నార్లాపూర్ గ్రామ శివారులోని అంజనగిరి రిజర్వాయర్‌లో నిర్మిస్తున్న మిషన్ భగీరథ ప్రత్యామ్నాయ పంప్‌హౌస్ పనులను మంగళవారం జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, రెవెన్యూ అదనపు కలెక్టర్ చెన్నయ్య, కొల్లాపూర్ ఆర్డీవో బన్సీలాల్‌తో కలిసి క్షేత్రస్థాయిలోపరిశీలించారు. పంప్‌హౌస్ నిర్మాణం, పంపుల ఏర్పాటు, విద్యుత్ సరఫరా, మోటార్లు, నీటిని ఎత్తిపోసే వ్యవస్థ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అంజనగిరి రిజర్వాయర్ నుంచి మిషన్ భగీరథ పంప్‌హౌస్ ద్వారా నీటిని ఎత్తిపోసేందుకు మొత్తం ఆరు పంపులను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇందులో నాలుగు పంపుల పనులు తుదిదశకుచేరుకున్నాయని, ఈ నెల 7వ తేదీన డ్రై రన్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. డ్రై రన్ విజయవంతమైన అనంతరం నీటిపారుదల శాఖ అధికారులు నీటిని విడుదల చేసిన వెంటనే వెట్ రన్ నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఒక్కో పంపు 1.7 మెగావాట్ల సామర్థ్యంతో పనిచేస్తూ 9,000 క్యూబిక్ మీటర్ల నీటిని ఎత్తిపోసే విధంగా ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ. పంప్‌హౌస్ నిర్మాణ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. డ్రై రన్‌కు ముందే అన్ని సాంకేతిక, విద్యుత్ పనులను పూర్తిస్థాయిలో తనిఖీ చేసి ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని సూచించారు. డ్రై రన్ అనంతరం వెట్ రన్‌కు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేసి పంప్‌హౌస్‌ను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాల్లోని 3,912 గ్రామాలకు తాగునీరు అందించే లక్ష్యానికి అనుగుణంగా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ప్రజలకు నిరంతరంగా, సురక్షితమైన తాగునీరు అందేలా పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని స్పష్టం చేశారు. సాంకేతిక సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించి పనుల్లో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట మిషన్ భగీరథ ఈఎన్‌సీ కృపాకర్ రెడ్డి, సీఈ లలిత, ఎస్ఈ జగన్‌మోహన్ రెడ్డి, ఈఈ సుధాకర్సింగ్,నీటిపారుదల శాఖ ఈఈ అమర్ సింగ్, ఏఈలు, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు తదితరులు ఉన్నారు.

## రాహుల్‌గాంధీపై పెట్టిన ఎఫ్ఐఆర్‌ను వెంటనే తొలగించాలి



సూర్యాపేట సెప్టెంబర్ 01:(విజన్ ఆంధ్ర)లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీపై దురుద్దేశపూర్వకంగా ఎఫ్ఐఆర్ నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని డీసీసీ అధ్యక్షుడు గుడిపాటి నరసయ్య అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను అవమానించే విధంగా వ్యాఖ్యలు చేసిన ఘటనపై రాహుల్‌గాంధీ ఉత్తరాఖండ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారని తెలిపారు. దళిత నేతగా, పలుమార్లు పార్లమెంట్ సభ్యుడిగా పనిచేసిన ఖర్గేను అవమానించడాన్ని ప్రశ్నించినందుకు రాహుల్‌గాంధీపై బీజేపీ పాలిత రాష్ట్రంలో అక్రమంగా ఎఫ్ఐఆర్ నమోదు చేయడం అమానుషమన్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, ప్రశ్నించే గొంతుకలను అణచివేసే విధంగా బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఎన్నికల్లో ఓట్ల చోరీకి పాల్పడుతూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. రాహుల్‌గాంధీపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఎఫ్ఐఆర్ తొలగించకపోతే సూర్యాపేట జిల్లా, తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చకిలం రాజేశ్వరరావు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్,జిల్లా కోశాధికారి కక్కిరేణి శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెలుగు వెంకన్న, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్, కౌన్సిలర్ చిలుముల సునీల్ రెడ్డి,సైదులు, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు బొడ్డు సాయి, మాజీ పట్టణ అధ్యక్షులు అంజద్ అలీ, సినియర్ కాంగ్రెస్ నాయకులు రుద్రంగి రవి, రావుల రాంబాబు, బైరు వెంకన్న, అబ్దుల్ రహీం, మద్దెబోయిన శ్రీనివాస్,వల్దాస్ దేవేందర్, ఫరూక్, కనుకు వెంకన్న, వల్దాస్ శ్రీను, ధరావత్ వీరన్న నాయక్, పంతంగి దశరథ, గడ్డం వెంకన్న,కోల నాగరాజు, నరేందర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## జోనా ఫౌండేషన్ సేవలు అభినందనీయం



సూర్యాపేట సెప్టెంబర్ 01:(విజన్ ఆంధ్ర)నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న జోనా ఫౌండేషన్ సేవలు అభినందనీయమని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గండూరి ప్రవళిక ప్రకాష్ దంపతుల కుమారుడు గండూరి ప్రీతం జోనా 6వ వర్ధంతి సందర్భంగా అంబులెన్స్ రెండు ఫ్రీజర్ బాక్స్ లు అక్షర ఫౌండేషన్ వాళ్లకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జోనా వర్ధంతిని పురస్కరించుకుని పేదల కోసం రూ. 26 లక్షల వ్యయంతో ఉచిత అంబులెన్స్‌ను, రూ. 1.80 లక్షల వ్యయంతో రెండు ఫ్రీజర్ బాక్సులను అందించడం ఎంతో గొప్ప సేవా కార్యక్రమమన్నారు. అత్యవసర సమయాల్లో పేదలకు ఉచిత అంబులెన్స్ సేవలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. అలాగే పేద కుటుంబాలకు బియ్యం పంపిణీ చేయడం ద్వారా మానవత్వాన్ని చాటుకున్నారని కొనియాడారు. సుమారు 330 మంది పేదలకు ఒక్కొక్కరికి 10 కిలోల చొప్పున సన్న బియ్యం పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. సేవాభావంతో చేపట్టే ఇలాంటి కార్యక్రమాలు మరింతగా కొనసాగాలని, సమాజంలోని పేదలకు అండగా నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం ఉచిత అంబులెన్స్, రెండు ఫ్రీజర్ బాక్సులను అక్షర ఫౌండేషన్ ప్రతినిధులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నిమ్మల శ్రీనివాస్ గౌడ్, ఉప్పల ఆనంద్, గండూరి శంకర్, గండూరి కృపాకర్ అంగిరేకుల నాగార్జున, ఈద ప్రవీణ్, గాలి సాయి, తహేర్, పడిదల సైదులు, వల్దాస్ జానీ, మోత్కూరి సందీప్, టైసన్ శ్రీను,జీడి బిక్షం, భాషామియా తదితరులు పాల్గొన్నారు.

## మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం

### రేపటి నుంచి రెండో విడత ఉచిత కుట్టు శిక్షణ ప్రారంభం

### డా. కొత్తపల్లి శ్రీనివాస్, డా. కొత్తపల్లి అనిత



కాగజ్‌నగర్, సెప్టెంబర్ 1 (విజన్ ఆంధ్ర): కొమరం భీం జిల్లా కాగజ్ నగర్ పట్టణంలో మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి, స్వయం ఉపాధి పొందేలా ప్రోత్సహించడమే తమ లక్ష్యమని శ్రీ కొత్తపల్లి వెంకటలక్ష్మి--చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకులు డా. కొత్తపల్లి శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్పర్సన్ డా. కొత్తపల్లి అనిత తెలిపారు. కాగజ్‌నగర్ పట్టణంలో సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కుట్టు శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న మహిళలకు వారు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు నైపుణ్యాభివృద్ధి కల్పించి, ఇంటి వద్దనే స్వయం ఉపాధి పొందేలా చేయాలనే ఉద్దేశంతో ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కుట్టు శిక్షణ ద్వారా మహిళలు తమ కుటుంబ ఆర్థిక పరిస్థితికి తోడ్పడటంతో పాటు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఇప్పటికే మొదటి విడత శిక్షణను పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు అందించడం ఆనందంగా ఉందన్నారు. అలాగే రేపటి నుంచి రెండో విడత ఉచిత కుట్టు శిక్షణను ప్రారంభించనున్నట్లు తెలిపారు. స్థానిక మహిళలు, యువతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కుట్టుపనిలో నైపుణ్యం సాధించాలని కోరారు. మహిళల అభ్యున్నతి, ఆర్థిక సాధికారత కోసం భవిష్యత్తులో సొసైటీ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని చెప్పారు. సమాజంలోని అన్ని వర్గాలకు ఉపయోగపడే విధంగా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు సర్టిఫికెట్లు అందుకోవడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ, ఉచితంగా శిక్షణ అందించిన సొసైటీ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కుట్టు శిక్షణ ఇన్‌స్ట్రక్టర్ సవిత, అల్లి కల్పన, కవితతో పాటు పలువురు స్థానిక మహిళలు పాల్గొన్నారు.

## కార్పొరేట్ కళాశాలలో ఫీజులను నియంత్రించాలి



సూర్యాపేట సెప్టెంబర్ 01:(విజన్ ఆంధ్ర)సూర్యాపేట జిల్లా కలెక్టర్ స్పందించి అధిక ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ స్పోర్ట్స్ పర్సన్ అన్నపర్తి జ్ఞాన సుందర్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని నారాయణ కళాశాలలో ఫీజు విషయంలో విద్యార్థినినీ ఇబ్బంది పెడుతున్నారన్న విషయం తెలుసుకొని తల్లిదండ్రులతో కలిసి కళాశాల యాజమాన్యంను ప్రశ్నించి అనంతరం విలేకరులతో మాట్లాడారు. కళాశాల యాజమాన్యం విద్యార్థులను చేర్చుకునేటప్పుడు ఒక రకమైన ఫీజు చేరిన తర్వాత మరొక రకమైన ఫీజును నిర్ణయిస్తు తల్లిదండ్రులను ఇబ్బందుల పాలు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కళాశాలలు తమ విధానాలు మార్చుకోవాలని మొదట మాట్లాడుకున్న ఫీజులు మాత్రమే అమలు చేయాలని కాదని విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తే న్యాయపరంగా పోరాడుతామని హెచ్చరించారు. ఆయన వెంట విద్యార్థిని తండ్రి ఖమ్మంపాటి మురళి, సల్వాది మల్లయ్య, ప్రకాష్, కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

# లివిద్యార్థుల భద్రత, ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలి

## స్థానిక సంస్థల అదన కలెక్టర్ మధుసూదన్ నాయక్




మహబూబ్ నగర్, ఆగస్ట్ 1(విజన్ ఆంధ్ర)జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో (ఖ+డీఎ) విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, పరిశుభ్రత, విద్యా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో హాస్టల్ సంక్షేమ అధికారులు, గురుకుల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఖ+డీఎ ప్రత్యేక అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వసతి గృహాలు, పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, పారిశుధ్యం, ఆరోగ్యం, విద్యాబోధన, భద్రతా చర్యలపై సమీక్షించారు.వసతి గృహాలు, పాఠశాలల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. చెత్త, పిచ్చిమొక్కలు, పొదలు తొలగించి పాములు, విషపురుగులు సంచరించకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అన్నారు. విద్యార్థుల ఆరోగ్యానికి సంబంధించిన ఏ సమస్య తలెత్తినా వెంటనే స్పందించి అవసరమైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.విద్యార్థుల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని స్పష్టం చేశారు. జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలు, గురుకులాలు, ఖ+డీఎల్లో సుమారు 25 వేల మంది విద్యార్థులు ఉన్నారని, వారి భవిష్యత్తును తీర్చిదిద్దడంలో అధికారులు, ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు.విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, కమ్యూనికేషన్ నైపుణ్యాలు పెంపొందించేలా వారానికి ఒకసారి మోటివేషన్ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. స్లిప్ టెస్టులు, గ్రూప్ డిస్కషన్లు నిర్వహించి విద్యార్థుల ప్రతిభను మెరుగుపరచాలని తెలిపారు. ఆంగ్ల భాషపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రతిరోజూ ఆంగ్ల పాఠాలు ప్రారంభించే ముందు 10 నుంచి 15 నిమిషాల పాటు ప్రాథమిక వ్యాకరణ అంశాలను బోధించాలని సూచించారు. విద్యార్థులకు ఆంగ్లంలో మాట్లాడే అవకాశాలు కల్పించాలని అన్నారు.విద్యార్థుల ఆరోగ్య పరిక్షలకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించాలని, నెలకు ఒకసారి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బాలికల వసతి గృహాల్లో పరిశుభ్రత, వ్యక్తిగత ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.అధికారులు 15 రోజులకు కనీసం ఒకసారి తమ పరిధిలోని వసతి గృహాలు, పాఠశాలలను సందర్శించి విద్యార్థులతో బసచేసి పరిస్థితులను పరిశీలించాలని అదనపు కలెక్టర్ కోరారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తును అధికారులపై నమ్మకంతో అప్పగిస్తున్నారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.ఈ సమావేశంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి సంస్థ అధికారి సునీత, బి.సి సంక్షేమ అభివృద్ధి సంస్థ అధికారి విష్ణు నందన్, జి.సి.డి.ఓ ఆత్ర ఖాద్రి, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు, కె. జి. బి. వి ప్రత్యేక అధికారులు, గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ పట్టివేత



మాగనూరు, సెప్టెంబర్ 1 (విజన్ ఆంధ్ర) మాగనూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని అమ్మపల్లి గ్రామ శివారులో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను మాగనూరు పోలీసులు పట్టుకున్నారు.విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు నిర్వహించగా, అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. టిప్పర్ డ్రైవర్‌ను విచారించగా దండు నరసింహ, గుడెబల్లూర గ్రామంకు చెందిన వ్యక్తిగా గుర్తించారు.ఇసుక తరలింపునకు ఎలాంటి అనుమతులు, పర్మిషన్ లేకపోవడంతో నిబంధనల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మాగనూరు ఎస్సై అశోక్ బాబు తెలిపారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే వారిపై కఠిన చర్యలతో పాటు వాహనాలను సీజ్ చేస్తామని ఆయన పేర్కొన్నారు ప్రభుత్వనిబంధనలతో కూడిన ఇసుక వాహనాలను మాత్రమే అనుమతిస్తామని అక్రమంగా వాహనాలు ఇసుకను తరలిస్తే వారిపై చర్యలు తప్పవని ఎస్ఐ పేర్కొన్నారు

## విద్యార్థిని విద్యార్థులకు ఏకరీతి దుస్తుల పంపిణీ



వరంగల్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 1(విజన్ ఆంధ్ర);-వరంగల్ జిల్లాలోని పర్వతగిరి మండల కేంద్రంలోని స్థానిక ఉన్నత పాఠశాల కొంకపాక యందు ప్రధానోపాధ్యాయులు మరియు మండల విద్యాశాఖ అధికారి అల్లందాసు బిక్షపతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు ఏకరీతి దుస్తుల పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ప్రాజెక్టు అధికారి దాసు విద్యార్థిని విద్యార్థులకు దుస్తులు అందజేసి ప్రభుత్వం కలుగచేసే సౌకర్యాలను వినియోగించుకుంటూ తల్లిదండ్రులు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు మరియు గ్రామ పెద్దలు గర్వ పడేలా చదువులలో రాణించాలని మంచి భవిష్యత్తును ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాయబారపు రమాదేవి మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు ప్రతీ రోజు పాఠశాలకు ఏక రూప దుస్తులలో హాజరు అయ్యి క్రమశిక్షణను అలవర్చుకోవాలని సూచించారు.ఏ.పి.ఎం. రాజీర్, జజూ కొమురయ్య, సుధాకర్, దేవేంద్ర, పంచాయతీ కార్యదర్శి సదానందం,వివో లీడర్స్ ఫరీదా భేగం ,జ్యోతి, సంతోష మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు

### - నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్



నారాయణపేట, సెప్టెంబర్ 1 (విజన్ ఆంధ్ర) శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా నారాయణపేట జిల్లా వ్యాప్తంగా ఈ నెల రోజుల పాటు 30 పోలీస్ ఆక్ట్ అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ30 పోలీస్ ఆక్ట్ సెప్టెంబర్ 30వ తేది వరకు అమల్లో ఉన్నందున జిల్లాలో పోలీసు అధికారు ల అనుమతులు లేకుండా ఎలాంటి ర్యాలీలు, సమావే శాలు, ఊరేగింపులు, ధర్నాలు వంటి కార్యక్రమా లు, బహిరంగ సభలు, ప్రజలు గుమ్మిగుడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహా లు చేయరాదని తెలిపారు. అనుమతులు లేకుండా పై కార్యక్రమాలు నిర్వహించిన నిర్వాహకులపై చట్టపరమై న చర్యలు తప్పవని తెలి పారు. ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగించేందుకు దారి తీసే సమావేశాలు, జన సమూహం చేయడం పూర్తిగా నిషేధమని తెలి పారు. సోషల్ మీడియా నందు అనవసరమైన విషయాలను, మతాల మధ్య చిచ్చు పెట్టే అంశా లను వ్యాప్తి చేసిన వారిపై కేసులను నమోదు చేయబ డతాయని తెలిపారు. చట్టపరంగా జారీ చేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘించినట్లయితే 30 పోలీస్ ఆక్ట్ ప్రకారం శిక్ష అర్హులవుతారని తెలిపారు. నిషేధం లో ఉన్న నిబంధ నలు తప్పనిసరిగా అంద రూ పాటించాలని ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించా లన్న ముందస్తు దరఖాస్తు చేసుకునీ అనుమతులు తీసుకోవాలని ఎస్పి కోరారు.

## విజన్ ఆంధ్ర పత్రిక తెలంగాణ స్టేట్ బ్యూరోగా ఆనంద్ గౌడ్ నియామకం

### ఐడీ కార్డు అందజేసిన ఎడిటర్ నరేందర్, డెస్క్ ఇంచార్జ్ మహేష్



హైద్రాబాద్ డెస్క్,ఆగస్ట్ 01, విజన్ ఆంధ్ర:విజన్ ఆంధ్ర దినపత్రికలో కీలక నియామకం జరిగింది. పత్రికలో ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరోగా విధులు నిర్వహిస్తున్న ఆనంద్ గౌడ్ ను తెలంగాణ స్టేట్ బ్యూరోగా నియమిస్తూ యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసిందిఈ మేరకు కల్వకుర్తిలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో విజన్ ఆంధ్ర పత్రిక ఎడిటర్ నరేందర్, డెస్క్ ఇంచార్జ్ మహేష్ ఆనంద్ గౌడ్ కు అధికారికంగా ఐడీ కార్డును మంగళవారం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఆనంద్ గౌడ్ గతంలో ప్రముఖ క్యూ న్యూస్ లో పనిచేశారు. అనంతరం విజన్ ఆంధ్ర పత్రికలో ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరోగా బాధ్యతలు చేపట్టి పత్రిక అభివృద్ధికి కృషి చేశారు. ఆయన పనితీరును, కృషిని గుర్తించిన యాజమాన్యం ఇప్పుడు రాష్ట్ర స్థాయి బాధ్యతలను అప్పగించిందిస్టేట్ బ్యూరోగా నియమితులైన అనంతరం ఆనంద్ గౌడ్ మాట్లాడుతూ, తన పనితీరును గుర్తించి తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర స్థాయి బాధ్యతలు అప్పగించిన ఎడిటర్ నరేందర్, డెస్క్ ఇంచార్జ్ మహేష్, విజన్ ఆంధ్ర యాజమాన్యానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని ఆయన తెలిపారు.

## ఆశ డే కార్యక్రమంపై జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా. ఏ. శ్రీనివాసులు సమీక్ష

### చిన్న పిల్లలకు వ్యాధినిరోధక టీకాలపై ప్రత్యేక దృష్టి; సీజనల్ వ్యాధుల నివారణ, సాధారణ ప్రసవాల పెంపుకు ఆదేశాలు




మహబూబ్‌నగర్ ఆగస్ట్ 1(విజన్ ఆంధ్ర)ప్రతి నెలా మొదటి మంగళవారం ఆశ వర్కర్ల దినోత్సవం (ఆశ డే) సందర్భంగా జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా. ఏ. శ్రీనివాసులు నవాబ్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి కార్యక్రమాలను సమీక్షించారు. ఈ నెల అవగాహన అంశంగా "చిన్న పిల్లలకు వ్యాధినిరోధక టీకాలు"ను ఎంపిక చేశారు.ఈ సందర్భంగా డా. శ్రీనివాసులు మాట్లాడుతూ, పుట్టినప్పటి నుంచి 16 సంవత్సరాల వయసు వరకు పిల్లలకు నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం వంద శాతం టీకాలు ఇప్పించాలని ఆదేశించారు. టీకాల ద్వారా ప్రాణాంతక వ్యాధులను నివారించి, శిశు మరణాలను తగ్గించి ఆరోగ్యకరమైన బాల్యాన్ని అందించవచ్చని అన్నారు.30 సంవత్సరాలు పైబడిన వారిలో అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం, పొగాకు, డ్రగ్స్ వ్యసనాల వల్ల అధిక రక్తపోటు, మధుమేహం, ఓరల్ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్ వంటి వ్యాధులు పెరుగుతున్నాయని, కాబట్టి ముందస్తు పరీక్షలు, చికిత్సలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. సీజనల్ వ్యాధుల నివారణ కోసం పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.అనంతరం ఆయన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ల్యాబ్, ఫార్మసీ, వ్యాక్సిన్ నిల్వలు, రికార్డులను పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాలను పెంచాలని వైద్యాధికారులు, సిబ్బందికి దిశానిర్దేశాలు చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి డా. శ్రవణ్ కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు హన్మంతు, నర్సింహ, డీపీవో సీతారాం గౌడ్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలి

**విద్యార్థులు ప్రణాళికతో చదివితే మంచి ఫలితాలు వస్తాయి**

**విధులకు హాజరుకాని వైద్య సిబ్బందికి షోకాజు నోటీసులు**

**ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతం కావాలి**


**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



వడ్డేపల్లి సెప్టెంబర్ 1 (విజన్ ఆంధ్ర బ్యూరో)ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.మంగళవారం జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలంలో జిల్లా కలెక్టర్ పర్యటించారు. వడ్డేపల్లి మండల కేజీబీవీ సందర్శించి అక్కడి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు ప్రణాళికతో చదివితే మంచి ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. వివిధ సబ్జెక్టుల్లో విద్యార్థుల ప్రగతిని తెలుసుకొని, ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో వచ్చిన మార్కుల గురించి అడిగారు. విద్యార్థులకు ఏక రూప దుస్తులతో పాటు రాత, పాఠ్య పుస్తకాల పంపిణీ గురించి మాట్లాడారు. అలాగే సిబ్బంది హాజరు రిజిస్టర్ తో పాటు పలు రికార్డులను తనిఖీ చేశారు. వంటశాలను సందర్శించి అక్కడ వండుతున్న పదార్థాలను పరిశీలించారు. స్టోర్ గదిలో సరకుల నిలువలపై ఆరా తీశారు. వాష్ రూమ్స్ ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పర్యావరణహితంగా క్రాఫ్ట్ వస్తువులతో విద్యార్థినిలు తయారుచేసిన రాఖీని కలెక్టర్ కు కట్టారు.ఈ సందర్భంగా శాంతినగర్ లోని పదవ వార్డు పోలింగ్ స్టేషన్ 174లో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడారు. మ్యాపింగ్ కానీ, అనామిలిస్ జాబితాలో ఉన్న ఓటర్ల అందరికీ నోటీసులు అందజేసి, నిర్దేశిత తేదీల్లో హియరింగ్ కు హాజరయ్యేలా చూడాలన్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను విజయవంతం చేయడంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు కూడా సహకరించాలని కోరారు. అనంతరం వడ్డేపల్లి లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్ ను తనిఖీ చేసి చాలామంది గైర్హాజరు కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇద్దరు సిబ్బందికి షోకాజు నోటీసులు ఇవ్వాలని డిఎంహెచ్వో సంధ్య కిరణ్మయితో చరవాణిలో మాట్లాడి ఆదేశించారు. ఆసుపత్రి శుభ్రంగా ఉంచాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సూచించారు.ఈ పర్యటనలో వడ్డేపల్లి తహసిల్దార్ శివకుమార్, ఉపతహసిల్దార్ వేణుగోపాల్ రెడ్డి, కస్తూర్బా ప్రత్యేక అధికారిని పద్మావతి, ఇతర అధికారులు, తదితరులు ఉన్నారు.

## హియరింగ్ ప్రక్రియలో రాజకీయ పార్టీలు సహకరించాలి

### జిల్లా కలెక్టర్ కె.హరిత



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 1,( విజన్ ఆంధ్ర)ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో మ్యాపింగ్ కాని, అనమలిస్ జాబితాలో గల ఓటర్లకు నోటీసులు జారీ చేసి నిర్వహించే హియరింగ్ ప్రక్రియకు రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ వంతు సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశం మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావులతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణలో నోటీసుల జారీ, హియరింగ్ ప్రక్రియకు సంబంధిత ఓటర్లు హాజరై అవసరమైన ద్రవపత్రాలు సమర్పించేలా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని, బూత్ స్థాయి ఏజెంట్లు ప్రక్రియలో భాగస్వాములు అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అవసరమైన ధృవపత్రాలతో పాటు నివాస ధ్రువపత్రాలు తహసీల్దార్ కార్యాలయాలనుండి త్వరగా జారీ అయ్యేనా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నోటీసులో పేర్కొనబడిన తేదీ, సమయానికి సంబంధిత ఓటరు హాజరై ఋజువు పత్రాలు సమర్పించి ఎస్ ఐ ఆర్ ప్రక్రియకు సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ సమస్యల సత్వర పరిష్కారానికి కృషి: జిల్లా కలెక్టర్ రాజర్షిషా



ఆదిలాబాద్, సెప్టెంబర్ 01 (విజన్ ఆంధ్ర):ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద నమోదైన కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి జిల్లా స్థాయి పర్యవేక్షణ, సమీక్ష కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో నమోదైన వివిధ కేసులు, వాటి ప్రస్తుత స్థితిగతులపై సమీక్ష నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలపై జరుగుతున్న అన్యాయాలను అరికట్టడానికి, హక్కులను పరిరక్షించడానికి చట్టపరంగా తగిన రక్షణ కల్పిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యంగా అత్యాచార కేసుల బాధితులకు అందాల్సిన నష్టపరిహారాన్ని వెంటనే అందజేయాలని, దర్యాప్తు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా బాధితులకు పునరావాసం కల్పించడంతో పాటు వారిలో ధైర్యం నింపేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ.. చట్టపరంగా ఎలాంటి లోపాలు లేకుండా కట్టుదిట్టమైన దర్యాప్తు చేపట్టి, నేరస్తులకు కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఆర్.ఎస్.చిత్రా, ఎస్.రాజేశ్వర్, డిప్యూటీ కలెక్టర్ వంశీ కృష్ణ, ఎస్సీ సంక్షేమ అధికారి సునీతకుమారి, ఈడి మనోహర్, ఇతర శాఖల అధికారులు మరియు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై ఊట్కూర్ పోలీసులు, టాస్క్‌ఫోర్స్ సంయుక్త దాడి - 8 మంది అరెస్ట్.



ఊట్కూర్, సెప్టెంబర్ 1 ( విజన్ ఆంధ్ర) ఊట్కూర్ మండల కేంద్రంలోని శివాలయం సమీపంలో పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు ఊట్కూర్ పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారంసంయుక్తంగా దాడి నిర్వహించి 8 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్ తెలిపారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న 8 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారిపై కేసు నమోదు చేశారు. పేకాట ఆడుతూ పట్టుబడినగజలప్ప,రాజు,ఆనంద్,మొండి శంకర్,కనకల్ల రాజు, చాకలి కనకప్ప, అలియాస్ కార్తీక్,తెలుగు భద్రప్ప ల వద్ద నుంచి రూ.9,080 నగదు, 3 సెల్‌ఫోన్లు, 52 పేక ముక్కలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా ఊట్కూర్ ఎస్సై రమేష్ మాట్లాడుతూ.. మండల పరిధిలో ఎవరైనా పేకాట లేదా ఇతర చట్టవిరుద్ధ జూద కార్యకలాపాలకు పాల్పడితే, సమాచారం అందిన వెంటనే దాడులు నిర్వహించి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామనిహెచ్చరించారు.

## ఉద్యాన శాఖ పథకాల పురోగతిపై జిల్లా కలెక్టర్ సమీక్ష

**ఆయిల్ పామ్ సాగు తో పాటు సంరక్షణ కుడా ఉండాలి**

**డ్రిప్ మెటీరియల్ సకాలంలో సరఫరా కావాలి**

**వ్యవసాయ సాగు లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పైన రైతులకు అవగాహన కల్పించాలి**

**జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**



హన్మకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 1 (విజన్ ఆంధ్ర) ఉద్యాన శాఖ ద్వారా జిల్లాలో అమలవుతున్న వివిధ పథకాలపై హార్టికల్చర్ అధికారులతో మంగళవారం కలెక్టరెట్ లోని మినీ కాన్ఫరెన్స్ హల్ లో కలెక్టర్ రివ్యూ నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లాలో ఉద్యాన శాఖ ద్వారా అమలవుతున్న వివిధ పథకాల భౌతిక లక్ష్యాలు, ఇప్పటివరకు సాధించిన పురోగతి, రైతులకు అందుతున్న రాయితీలు, పథకాల అమలు తీరును జిల్లా కలెక్టర్ క్షుణ్ణం గా సమీక్షించారుఈ సందర్భంగా లికలెక్టర్లి మాట్లాడుతూ..నిర్దేశించిన లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.రైతులు ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో, ఆయిల్‌పామ్ తోటల ఏర్పాటును నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. రైతులకు అవసరమైన అన్ని రకాల అనుమతులను సకాలంలో పొందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గత నాలుగు సంవత్సరాల క్రితం నుంచి ఆయిల్ ఫామ్ సాగుచేసిన రైతుల తోటలను ఆయిల్‌పామ్ కంపెనీల ప్రతినిధులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో సందర్శించి, తోటల పురోగతిని పర్యవేక్షించాలని సూచించారు.ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నిర్దేశించిన భౌతిక లక్ష్యాలను టీజీ ఆయిల్‌ఫెడ్, రామ్‌చరణ్ ఆయిల్‌పామ్ కంపెనీలు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.అలాగే జిల్లాలో అమలవుతున్న సూక్ష్మ సేద్య పథకం (మైక్రో ఇరిగేషన్ ) అమలులో డ్రిప్ కంపెనీలు ఎటువంటి నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. అనుమతులు పొందిన రైతులందరికీ డ్రిప్ మెటీరియల్‌ను సకాలంలో సరఫరా చేయాలని, రైతులు ఇబ్బందులు ఎదుర్కోకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.జిల్లాలో కొత్తగా పండ్ల తోటలు, కూరగాయల సాగు చేపట్టిన రైతులకు అందిస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలు తదితర వివరాలను జిల్లా కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు నూతన సాగు, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు రైతులకు చేరవేయాలని ఉద్యాన శాఖ అధికారులను ఆదేశించారు.శాశ్వత పందిర్ల పై కూరగాయల సాగు చేపడుతున్న రైతులను గుర్తించి, వారికి అందుబాటులో ఉన్న పథకాల ద్వారా రాయితీలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ఈ సమీక్ష సమావేశంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి పి. కమలాకర్ రెడ్డి, ఉద్యాన శాఖ అధికారులు సునీల్ కుమార్, సుష్మిత సేన్, టీజీ ఆయిల్‌ఫెడ్ మేనేజర్ శంకర్, రామ్‌చరణ్ కంపెనీ ప్రతినిధి ప్రవీణ్, ఉద్యాన విస్తరణ అధికారులు దేవేందర్, దేవరాజ్, డ్రిప్ కంపెనీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగూడెం విమానాశ్రయ కలకు రెక్కలు!

- సెప్టెంబరు 7న జిల్లాలో కేంద్ర సాంకేతిక బృందం పర్యటన
- నాలుగైదు ప్రత్యామ్నాయ ప్రాంతాలపై క్షేత్రస్థాయి పరిశీలన
- అనుకూల నివేదిక వస్తే తదుపరి చర్యలు వేగవంతం
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడితో మంత్రి తుమ్మల కీలక భేటీ



కొత్తగూడెం బ్యూరో సెప్టెంబర్ 2 (విజన్ ఆంధ్ర)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజల దశాబ్దాల కల సాకారం దిశగా మరో కీలక ముందడుగు పడింది. జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనకు కేంద్రం నుంచి సానుకూల స్పందన లభించింది. విమానాశ్రయ నిర్మాణానికి అనువైన ప్రాంతాన్ని గుర్తించేందుకు కేంద్ర సాంకేతిక బృందం సెప్టెంబరు 7న తెలంగాణలో పర్యటించనుంది. జిల్లాలో గుర్తించిన నాలుగు నుంచి ఐదు ప్రత్యామ్నాయ ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, విమానాశ్రయ నిర్మాణానికి వాటి అనుకూలతను అంచనా వేయనుంది.



ఈ మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును కలిసి కొత్తగూడెం విమానాశ్రయం ఏర్పాటుపై సుదీర్ఘంగా చర్చించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజల చిరకాల ఆకాంక్షను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో పాటు.. విమానాశ్రయం ఏర్పాటుతో జిల్లాకు కలిగే రవాణా, పారిశ్రామిక, వాణిజ్య, పర్యాటక, ఆధ్యాత్మిక ప్రయోజనాలను వివరించారు.

**గత అడ్డంకులకు తెర.. కొత్త ప్రాంతాలపై దృష్టి**

గతంలో విమానాశ్రయం కోసం గుర్తించిన రెండు ప్రాంతాలు సాంకేతిక కారణాలతో అనుకూలంగా లేవని తేలిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ ప్రాంతాల అన్వేషణను ముమ్మరం చేసింది. అధికారులతో సమన్వయం చేసుకుంటూ తాజాగా నాలుగైదు ప్రాంతాలను గుర్తించినట్లు మంత్రి తుమ్మల కేంద్ర మంత్రికి వివరించారు. ఈ ప్రాంతాల్లో రన్‌వే నిర్మాణానికి భూభాగం అనుకూలత, భౌగోళిక పరిస్థితులు, వాతావరణం, భూసేకరణ సాధ్యాసాధ్యాలు, విమానాల రాకపోకలకు అవసరమైన సాంకేతిక ప్రమాణాలు తదితర అంశాలను కేంద్ర సాంకేతిక నిపుణుల బృందం పరిశీలించనుంది.

**సెప్టెంబరు 7న కీలక పరిశీలన**

కేంద్ర సాంకేతిక బృందం సెప్టెంబరు 7న తెలంగాణలో పర్యటించనుండటం కొత్తగూడెం విమానాశ్రయ ప్రతిపాదనకు అత్యంత కీలక పరిణామంగా భావిస్తున్నారు. ప్రతిపాదిత ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం సాంకేతిక అంశాలపై సమగ్ర నివేదికను కేంద్రానికి సమర్పించనుంది. ఆ నివేదికలో విమానాశ్రయ నిర్మాణానికి అనుకూలత ఉన్నట్లు తేలితే.. తదుపరి ప్రక్రియను వేగవంతం చేసేందుకు కేంద్రం చర్యలు చేపట్టే అవకాశం ఉంది.

**తుమ్మల విజ్ఞప్తికి కేంద్రం సానుకూల స్పందన**

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో జరిగిన భేటీలో జిల్లా ప్రజల దీర్ఘకాలిక ఆకాంక్షను మంత్రి తుమ్మల ప్రత్యేకంగా ప్రస్తావించారు. భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం ఉన్న భద్రాద్రి ప్రాంతానికి ఉన్న ఆధ్యాత్మిక ప్రాధాన్యం, సింగరేణి సంస్థతో పాటు జిల్లాలోని పారిశ్రామిక రంగం, పర్యాటక అభివృద్ధి, ప్రజల రవాణా అవసరాలను వివరించారు. విమానాశ్రయం అందుబాటులోకి వస్తే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు పారిశ్రామిక పెట్టుబడులు, పర్యాటక రంగం, వాణిజ్య కార్యకలాపాలకు మరింత ఊతం లభించే అవకాశం ఉందని మంత్రి వివరించారు. మంత్రి తుమ్మల విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. కేంద్ర సాంకేతిక బృందం నివేదిక అనుకూలంగా వచ్చిన వెంటనే విమానాశ్రయం ఏర్పాటుకు అవసరమైన తదుపరి చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు మంత్రి తుమ్మల వెల్లడించారు.

**మైత్రి పునాదిగా.. విజ్ఞప్తికి బలం**

కేంద్ర మంత్రితో తనకున్న చిరకాల అనుబంధాన్ని కూడా మంత్రి తుమ్మల ఈ సందర్భంగా గుర్తుచేశారు. రామ్మోహన్ నాయుడు తండ్రి, దివంగత నేత ఎర్రన్నాయుడుతో తనకున్న సాన్నిహిత్యాన్ని ప్రస్తావించారు. భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం కారణంగా భద్రాద్రి ప్రాంతానికి ఉన్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాధాన్యాన్ని కేంద్ర మంత్రికి వివరించడంతో పాటు.. జిల్లా ప్రజల రవాణా అవసరాలకు విమానాశ్రయం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. "భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజల దీర్ఘకాల ఆకాంక్షను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లాను. నా విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించి, వెంటనే కేంద్ర సాంకేతిక బృందాన్ని పంపేందుకు చర్యలు చేపట్టిన కేంద్ర మంత్రి శ్రీ రామ్మోహన్ నాయుడికి, కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు" అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

**మరో రెండు విమానాశ్రయ ప్రతిపాదనలపైనా కదలిక**

తెలంగాణలో విమానయాన మౌలిక వసతుల విస్తరణకు సంబంధించి ఇతర ప్రతిపాదనలపైనా కేంద్రంతో చర్చలు కొనసాగుతున్నాయని మంత్రి తుమ్మల తెలిపారు. మామునూరు (వరంగల్), ఆదిలాబాద్ విమానాశ్రయాల అంశంపై సెప్టెంబరు 2న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వంతో చర్చించనున్నట్లు వెల్లడించారు.

**గగనతలంలోకి కొత్తగూడెం!**

దశాబ్దాలుగా జిల్లా ప్రజలు ఎదురుచూస్తున్న విమానాశ్రయ కలకు తాజా పరిణామాలు కొత్త ఆశలు రేకెత్తిస్తున్నాయి. ఇప్పటివరకు ప్రతిపాదనలు, స్థలాల పరిశీలనలకే పరిమితమైన ప్రక్రియ.. తాజాగా కేంద్ర సాంకేతిక బృందం క్షేత్రస్థాయి పరిశీలనకు రావడంతో కీలక దశకు చేరుకుంది. సెప్టెంబరు 7న జరగనున్న స్థల పరిశీలన.. కేంద్ర సాంకేతిక బృందం నివేదిక.. ఆ నివేదిక ఆధారంగా తీసుకునే తదుపరి నిర్ణయాలపై ఇప్పుడు జిల్లా ప్రజల ఆశలు నిలిచాయి.

**నివేదిక అనుకూలిస్తే..**

కొత్తగూడెం గగనతలంలో విమానం రెక్కలు విప్పే రోజు మరింత చేరువైనట్టే!

# గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి.

- గణపతి మండపాల వద్ద సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలి.
- అధిక శబ్దం వచ్చే డీజే లకు అనుమతులు లేవు.
- యువత నవరాత్రులలో గణపతి దీక్షలో పాల్గొనాలని సూచన.
- సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దు.
- గణపతి మండప నిర్వాహక సభ్యులు, హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు జిల్లా పోలీసులతో సమన్వయ సమావేశం ఏర్పాటు.
- ఆదిలాబాద్ జిల్లాలిదస్నాపూర్ తానిషా గార్డెన్ నందు పాల్గొన్న 1000 మంది గణపతి మండప ప్రతినిధులు, నాయకులు ఉత్సవ కమిటీ సభ్యులు.
- గణపతి మండప నిర్వహణ కమిటీ సభ్యులు చేయవలసిన సూచనలతో కూడిన కరపత్ర ఆవిష్కరణ.
- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



ఆదిలాబాద్ జిల్లా: (విజన్ ఆంధ్ర బ్యూరో)తెలంగాణలో ఆదిలాబాద్ జిల్లా గణపతి నవరాత్రి ఉత్సవాలకు ప్రత్యేక స్థానం ఉన్నందున, రానున్న గణపతి నవరాత్రి ఉత్సవాలను జిల్లా వ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి ముందస్తు చర్యల్లో భాగంగా గణపతి మండప నిర్వహ కమిటీ సభ్యులు మరియు హిందూ ఉత్సవ సమితి సభ్యులతో, స్థానిక కౌన్సిలర్లు, నాయకులచే సమన్వయ సమావేశాన్ని జిల్లా పోలీసు యంత్రాంగం ఈరోజు ఉదయం స్థానిక పట్టణంలోని తానిషా గార్డెన్ నందు ఏర్పాటు చేయడం జరిగింది. మొదటగా వేద పండితుల ఆధ్వర్యంలో గణపతి స్తోత్రాన్ని పటిస్తూ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ సమన్వయ సమావేశంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ ముఖ్యఅతిథిగా పాల్గొని మండప నిర్వహణ కమిటీలు సభ్యులకు పలు సూచనలు చేయడం జరిగింది. సంస్కృతిని, సాంప్రదాయాన్ని కాపాడుతూ, దానిని భావితరాలకు స్ఫూర్తిదాయకంగా ఉండేలా గణపతి నవరాత్రి ఉత్సవాలను నిర్వహించాలని జిల్లా ఎస్పీ తెలియజేశారు. ఈ గణపతి విగ్రహాల ఏర్పాటు అనే పండుగ, ప్రశాంత వాతావరణంలో ప్రజలందరూ కలిసిమెలిసి నిర్వహించుకోవాలని జిల్లా పోలీసు యంత్రాంగం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. పోలీసు యంత్రాంగం పూర్తి సంసిద్ధంగా ఉందని మండప నిర్వహణ కమిటీ సభ్యులను ఉద్దేశించి పలు సూచనలు చేయడం జరిగింది. త్వరలో ఆన్లైన్లో వచ్చే లింకు ద్వారా ప్రతి ఒక్క గణపతి మండపం రిజిస్ట్రేషన్ ఏర్పాటు చేసుకోవాలని, దీని ద్వారా గణపతి నవరాత్రి ఉత్సవాలలో చేయవలసిన బందోబస్తు కేటాయించవలసిన పోలీసు సిబ్బంది నిమర్జనం ఏర్పాట్లకు మరియు ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు పాటిస్తూ ఏర్పాట్లను పూర్తి చేస్తున్నట్టు తెలిపారు. గ్రామాలలో సాధ్యమైనంతవరకు ఒకే గణపతి మండపం ఏర్పాటు చేసే విధంగా ప్రజలందరూ కలిసికట్టుగా ఉన్న భావాన్ని తెలియజేయాలన్నారు. గతంలో ఏర్పాటు చేసిన గణపతి మండపాలకు మాత్రమే అనుమతులు ఉన్నాయని, నూతనంగా ఏర్పాటు చేసే వారికి అనుమతులు లేవని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ పట్టణంలో మరియు జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలలో ఏర్పాటు చేయనున్న గణపతి మండప నిర్వాహక కమిటీ సభ్యులు దాదాపు 1000 మంది పాల్గొనడం జరిగింది. అదేవిధంగా ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఎఎస్పి రుత్విక్ సాయి కొట్టే ఐపీఎస్, ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష, స్థానిక కౌన్సిలర్లు, ఏఆర్ డీఎస్పీ కమతం ఇంద్ర వర్ధన్, పట్టణ సిఐలు బి సునీల్ కుమార్, కె నాగరాజు, బీడీ ప్రేమ్ కుమార్, సర్కిల్ ఇన్స్పెక్టర్లు జి శ్రావణ్, సిహెచ్ రమేష్, కే నరేష్, ఎం ప్రసాద్, డి గురుస్వామి, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు డి వెంకటి, టి మురళి,ఎన్ చంద్రశేఖర్, ఎస్సైలు సిబ్బంది, హిందు ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షుడు బొంపల్లి హనుమన్లు, నూతన అధ్యక్షుడు, హిందూ ఉత్సవ సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గణేష్ మండపాలు ఏర్పాటు చేసేవారికి ఆదిలాబాద్ జిల్లా పోలీసుల సూచనలు

గణేశుని మండపాల వద్ద 24 గంటలు కనీసం ముగ్గురు వాలంటీర్లు విగ్రహంతో పాటు ఉండాలి. జంతువులు మరియు కోతులు లోనికి రాకుండా చూసుకోవాలి. గణేశుని మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చూడాలి. వినాయక మండపం ఏర్పాటులో, నిర్మాణంలో అన్ని మన్నికవున్న వస్తువులనే వాడాలి.విద్యుత్ శాఖ నుండి పవర్ సప్లయ్ మరియు రక్షణకు సంబంధించిన సూచనలు తీసుకోవాలి. విద్యుత్ కనెక్షన్లు, లైట్ల ఏర్పాటుకు నాణ్యమైన వైర్లను, పరికరాలను వినియోగించాలి మరియు ప్రమాదము జరగకుండా చూసుకోవాలి. ప్రజలకు ఇబ్బంది కలిగే విధముగా దారిలో మండపాలు ఏర్పాటు చేయరాదు. ప్రైవేట్ ల్యాండ్ అయినచో మండపాలు ఏర్పాటు చేసే స్థలానికి యజమాని పర్మిషన్ తీసుకోవాలి.రాత్రి 10 గంటల తరువాత మైక్, సౌండ్ సిస్టమ్ ఉపయోగించి ప్రజలకు, ఇతరులకు ఇబ్బందులు చేయకూడదు.మండపాల పేరుతో ఎలాంటి లక్కీ డ్రాలు నిర్వహించకూడదు. అలాగే జూదాన్ని నిర్వహించరాదు. బలవంతపు చందాలు తీసుకోరాదు. పెద్ద పెద్ద శబ్దాలతో డిజెలు ఏర్పాటు చేయకూడదు. అత్యవసరం అయితే డైల్ 100/112 కు కాల్ చేయాలి. వినాయకుని ఉత్సవాలను అందరూ భక్తిశ్రద్ధలతో మరియు సమైక్యంగా ప్రశాంతంగా జరుపుకోవాలని సూచన. ప్రతి గణపతి మండపం వద్ద అగ్ని ఆర్పడానికి కావలసిన నీరు, ఇసుక లాంటివి ఏర్పాటు చేయాలి. రంగురంగుల పేపర్లను చల్లె పరికరాలకు,వాటికి అనుమతులు లేవని తెలిపారు. గణపతి ఏర్పాటు పేరుతో జరిగే చట్ట వ్య ఎతిరేక కార్యకలాపాలు జరగకుండా ఉండాలి. సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దు, ఇలాంటి సమాచారం కైనా జిల్లా పోలీసు యంత్రాంగాన్ని సంప్రదించాలి.

# లక్ష్య సాధన దిశగా సమిష్టి కృషి చేయాలి

- భూపాలపల్లి ఏరియాలో బొగ్గు ఉత్పత్తిని మరింత పెంచాలి
- భద్రత విషయంలో రాజీ లేదు.. ఏరియా జీఎం ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి



భూపాలపల్లి జిల్లా, సెప్టెంబర్ 1 (విజన్ ఆంధ్ర): భూపాలపల్లి ఏరియాలో సంస్థ నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు అధికారులు, ఉద్యోగులు, కార్మికులు సమన్వయంతో పనిచేయాలని ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింత పెంచాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

***ఆగస్టులో 43 శాతం బొగ్గు ఉత్పత్తి***

ఆగస్టు 2026లో భూపాలపల్లి ఏరియా బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 3.77 లక్షల టన్నులు కాగా, 1.60 లక్షల టన్నుల ఉత్పత్తి, రవాణా సాధించినట్లు జీఎం తెలిపారు. ఇది 43 శాతం సాధనగా నమోదైంది. రోజువారీ సగటు ఉత్పత్తి 515 టన్నులుగా ఉంది. అదే సమయంలో ఓవర్‌బర్డెన్ (ఓబీ) తొలగింపులో కేటీకే ఓసీ–2 గని 10.03 లక్షల క్యూబిక్ మీటర్ల లక్ష్యానికి గాను 8.66 లక్షల క్యూబిక్ మీటర్లు (86 శాతం) సాధించింది. కేటీకే ఓసీ–3 గని 10.40 లక్షల క్యూబిక్ మీటర్ల లక్ష్యానికి గాను 13.02 లక్షల క్యూబిక్ మీటర్లు (125 శాతం) సాధించింది. రెండు గనులు కలిపి 20.43 లక్షల క్యూబిక్ మీటర్ల లక్ష్యానికి గాను 21.68 లక్షల క్యూబిక్ మీటర్లు, అంటే 106 శాతం ఓబీ తొలగింపు సాధించినట్లు వివరించారు.

***సెప్టెంబర్‌లో 3.84 లక్షల టన్నుల లక్ష్యం***

సెప్టెంబర్ 2026లో భూపాలపల్లి ఏరియాకు 3.84 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా లక్ష్యాన్ని నిర్దేశించినట్లు జీఎం తెలిపారు. ఏఓపీ (అన్యువల్ ఆపరేషన్ ప్లాన్) ప్రకారం కేటీకే ఓసీ–2, కేటీకే ఓసీ–3 గనుల్లో కలిపి 20.18 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ తొలగింపు లక్ష్యంగా ఉందన్నారు. ఉత్పత్తి లక్ష్యాల సాధనకు అన్ని విభాగాల అధికారులు, ఉద్యోగులు సమిష్టిగా కృషి చేయాలని ఆయన సూచించారు. ముఖ్యంగా ఎస్‌డీఎల్ యంత్రాల పనిగంటలను పెంచేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని, అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించి సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు.

***హాజరు శాతం పెంచితే ఉత్పత్తి పెరుగుతుంది***

కార్మికుల గైర్హాజరు శాతాన్ని తగ్గించడం ద్వారా ఉత్పత్తి స్థాయిని గణనీయంగా పెంచవచ్చని జీఎం పేర్కొన్నారు. కార్మికులకు నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. క్రమశిక్షణతో కూడిన హాజరు, సమయపాలన, బాధ్యతాయుతమైన పనితీరు సంస్థ అభివృద్ధికి కీలకమని స్పష్టం చేశారు.

***భద్రతకు అత్యంత ప్రాధాన్యత***

ప్రతి ఉద్యోగి, కార్మికుడు వర్కింగ్ పర్మిషన్‌తో పాటు అన్ని భద్రతా నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి సూచించారు. భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని స్పష్టం చేస్తూ "రక్షణ విషయంలో రాజీ లేదు" అని పేర్కొన్నారు. భద్రతతో కూడిన ఉత్పత్తి ద్వారానే సంస్థకు స్థిరమైన అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు.

***వర్షాకాలంలో ముందస్తు చర్యలు***

ఎల్‌నినో ప్రభావంతో బొగ్గుకు డిమాండ్ పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో ఉత్పత్తి, రవాణా కార్యకలాపాలకు ఎలాంటి అంతరాయం కలగకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని జీఎం సూచించారు. ఓపెన్‌కాస్ట్ గనులు, బొగ్గు నిల్వ ప్రాంగణాలు, బొగ్గు రవాణాకు ఉపయోగించే రహదారులను ముందుగానే పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. వర్షాకాలంలో గనుల్లో పనిచేసే కార్మికులు భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఉత్పత్తి, రవాణా వ్యవస్థలు సజావుగా కొనసాగేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని కోరారు.

***సమిష్టి కృషితోనే లక్ష్య సాధన***

అధికారులు, ఉద్యోగులు, కార్మికులు సమిష్టిగా పనిచేస్తే నిర్దేశిత లక్ష్యాలను సాధించడంతో పాటు మెరుగైన ఫలితాలు సాధించవచ్చని జీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని కోరారు. "సమిష్టి కృషి క్రమశిక్షణ భద్రతతో కూడిన ఉత్పత్తి" అనే మార్గదర్శకంతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.

# ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు నిర్వహించాలి

- నిమజ్జనానికి పకడ్బందీ ప్రణాళిక.. మండపాల రిజిస్ట్రేషన్ తప్పనిసరి
- విద్యుత్, మైక్ అనుమతులు తప్పనిసరి.. నిమజ్జన ప్రాంతాల్లో గజ ఈతగాళ్లు, క్రేన్లు సిద్ధం
- మతాలు, వర్గాల మనోభావాలను గౌరవించాలి
- జిల్లా కలెక్టర్ అంకిత్



కొత్తగూడెం బ్యూరో, సెప్టెంబర్ 02(విజన్ ఆంధ్ర) : వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను జిల్లాలో ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. గణేష్ ఉత్సవాల నిర్వహణ, నిమజ్జన ఏర్పాట్లపై మంగళవారం ఐ.డీ.ఓ.సీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, అగ్నిమాపక, ఐటీసీ, సింగరేణి, ఎక్సైజ్, విద్యుత్, ఇరిగేషన్, మున్సిపల్ తదితర శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రతి గణేష్ మండపాన్ని తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు ముందుగానే మండపానికి సంబంధించిన పూర్తి వివరాలను అధికారులకు అందించాలని తెలిపారు. వివిధ శాఖల మధ్య సమన్వయం ఉంటే ఉత్సవాల నిర్వహణ మరింత సజావుగా సాగుతుందని పేర్కొన్నారు.

***మండపాల వద్ద భద్రతపై ప్రత్యేక దృష్టి***

జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, మండలాల స్థాయిలో పోలీస్, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో ముందస్తు సమావేశాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమైన రోజు నుంచి నిమజ్జనం పూర్తయ్యే వరకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. గణేష్ మండపాలకు విద్యుత్ సరఫరా కోసం తప్పనిసరిగా విద్యుత్ శాఖ అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. మండపాల్లో విద్యుత్ భద్రతా ప్రమాణాలను పరిశీలించేందుకు విద్యుత్ అధికారులు ప్రత్యేక ఆడిట్ నిర్వహించాలని ఆదేశించారు. విద్యుత్ తీగలకు తగిలే అవకాశం లేకుండా విగ్రహాల ఎత్తు, మండపాల నిర్మాణంపై నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మండపాల్లో మైక్ ఏర్పాటు చేసుకునేందుకు పోలీస్ శాఖ నుంచి ముందస్తు అనుమతి పొందాలని తెలిపారు.

***నిమజ్జనానికి రూట్ మ్యాప్ సిద్ధం చేయాలి***

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాతో పాటు ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి కూడా నిమజ్జనానికి భారీ సంఖ్యలో విగ్రహాలు వచ్చే అవకాశం ఉన్నందున అధికారులు ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకోవాలని కలెక్టర్ సూచించారు. యంత్రాంగం సూచించిన ప్రాంతాల్లోనే నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నిమజ్జనానికి సంబంధించిన రూట్ మ్యాప్‌ను ముందుగానే సిద్ధం చేయాలని, నిమజ్జన మార్గాల్లో రోడ్ల మరమ్మతులు అవసరమైతే వెంటనే చేపట్టి పూర్తి చేయాలని ఆదేశించారు. నిమజ్జనానికి వినియోగించే వాహనాలకు రవాణా శాఖ నుంచి ముందస్తుగా ధ్రువీకరణ తీసుకోవాలని సూచించారు. ప్రతి గణేష్ మండపం వద్ద అవసరమైన మేరకు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

***భక్తిపాటలకే ప్రాధాన్యం***

గణేష్ ఉత్సవాల సందర్భంగా భక్తిపాటలు మాత్రమే వినిపించాలని కలెక్టర్ అంకిత్ సూచించారు. అన్ని మతాలు, వర్గాల మనోభావాలను గౌరవిస్తూ ఉత్సవాలను నిర్వహించాలని తెలిపారు. ఉత్సవ కమిటీ సభ్యులు, అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, ఎలాంటి రెచ్చగొట్టే అంశాలకు తావివ్వకుండా శాంతిభద్రతల పరిరక్షణకు జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు.

***క్రేన్లు, గజ ఈతగాళ్లు సిద్ధంగా ఉంచాలి: ఎస్పీ***

జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ.. గణేష్ నిమజ్జన సమయంలో ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. నిమజ్జన ప్రాంతాల్లో అవసరమైన క్రేన్లను ఏర్పాటు చేయడంతో పాటు గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు సమన్వయంతో పండుగను ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. భక్తులకు అందించే ప్రసాదాల విషయంలో ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని తగ్గించాలని, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని తెలిపారు. వ్యర్థాలను వేయడానికి మండపాల వద్ద డస్ట్‌బిన్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

***మట్టి గణపతులనే పూజించాలి***

పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రజలు మట్టి గణపతులను పూజించాలని ఎస్పీ రోహిత్ రాజు సూచించారు. రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాల వల్ల పర్యావరణానికి నష్టం కలిగే అవకాశం ఉందని తెలిపారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల పరిధిలో ఉచితంగా మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని పర్యావరణహితమైన మట్టి గణపతి విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వేణుగోపాల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాళ్ శ్రేష్ఠ, డీఆర్ఓ పద్మావతి, డీటీఓ వెంకట రమణ, జిల్లా ఇన్‌చార్జ్ ఎక్సైజ్ ఈఎస్ జానయ్య, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి క్రాంతికుమార్, డీఎంహెచ్ఓ డాక్టర్ తుకారాం రాథోడ్, విద్యుత్ శాఖ ఎస్ఈ మహేంద్ర, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుజాత, ఐటీసీ, సింగరేణి సంస్థల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కొత్తగూడెం గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు యెర్రా కామేష్, సభ్యులు దారా రమేష్, లక్ష్మణ్, వందనపు శ్రీధర్, మహేష్, సుజాత, విజయలక్ష్మి, యాకయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# భూ రీ-సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

**- జిల్లా కలెక్టర్ హేమంత్**



ములుగు సెప్టెంబర్ 01, విజన్ ఆంధ్ర ప్రతినిధి : భూ రీ-సర్వేను ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ మహేందర్ జీ తో కలిసి అన్ని మండలాల తహసీల్దార్లతో భూ రీ-సర్వే, భూ భారతి, సాదా బైనామాలపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఎంపిక చేసిన 70 గ్రామాల్లో ప్రణాళికాబద్ధంగా సర్వే పనులు వేగవంతం చేయాలని, క్షేత్రస్థాయిలో కొలతలు, భూ వివరాల నమోదులో పొరపాట్లు లేకుండా చూడాలని సూచించారు. రామచంద్రపురం గ్రామంలో రీ-సర్వే పూర్తి చేసి పట్టా పాస్ పుస్తకాల పంపిణీకి ఏర్పాట్లు చేయాలన్నారు. భూ భారతి దరఖాస్తులను వేగంగా పరిష్కరించి ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్డీఓ కృష్ణవేణి, డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

## ఏటూరునాగారం పంచాయతీ సమస్యలపై కలెక్టర్ కు వినతి

**- సర్పంచ్ శ్రీలత లక్ష్మణ్ బాబు.**



ములుగు సెప్టెంబర్ 01, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ఏటూరునాగారం మేజర్ గ్రామ పంచాయతీలో నెలకొన్న పారిశుధ్య, మౌలిక వసతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ భోర్కడే హేమంత్ సహదేవరావుకు సర్పంచ్ కాకులమర్రి శ్రీలత, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు వినతిపత్రం సమర్పించారు. 3,600 నివాస గృహాలు, 22 కిలోమీటర్ల విస్తీర్ణం ఉన్న ఏటూరునాగారంలో ప్రస్తుతం 16 మంది పారిశుధ్య సిబ్బంది మాత్రమే ఉన్నారని, అదనంగా 30 మంది మల్టీ పర్పస్ వర్కర్లను మంజూరు చేయాలని కోరారు. 66 నీటి ట్యాంకుల నిర్వహణకు ఇద్దరు, 1,420 వీధి దీపాలకు ఇద్దరు సిబ్బంది మాత్రమే ఉండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. చెత్త సేకరణకు ఉన్న 2 ట్రాక్టర్లు సరిపోవడం లేదని, మరో 2 టాటా ఏస్ హైడ్రాలిక్ వాహనాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పోరిక గోవింద నాయక్, తుమ్మ మల్లారెడ్డి, తాటి కృష్ణ, భూక్యా జంపన్న, మాజీ ఎంపీపీ వినయ్ కుమార్ తదితర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన వైఫల్యాలపై బీఆర్ఎస్ నిరసన



ములుగు సెప్టెంబర్ 01, విజన్ ఆంధ్ర ప్రతినిధి : కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గంలో నిరసనకు దిగింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు సోమవారం ములుగులోని బీఆర్ఎస్ కార్యాలయంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ జడ్పీ చైర్మన్ బడే నాగజ్యోతి, జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు మాట్లాడుతూ....... కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు, 420 హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చాక హామీల అమలును పూర్తిగా విస్మరించిందని, ప్రజలకు ఎదురైన ఇబ్బందులను వివరిస్తూ భారీ ఫ్లెక్సీలతో వినూత్న నిరసన చేపడుతున్నామన్నారు. ప్రతి హామీ అమలు అయ్యేవరకు ప్రభుత్వాన్ని నిలదీస్తామని స్పష్టం చేశారు. మంగళవారం నుండి నియోజకవర్గ వ్యాప్తంగా భారీ నిరసన కార్యక్రమం నిర్వహిస్తామని, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో గ్రంథాలయ మాజీ చైర్మన్ పోరిక గోవింద నాయక్, మున్సిపల్ కౌన్సిలర్లు, మండల మాజీ అధ్యక్షులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## బీజేపీ కార్యాలయంపై దాడి - గుండాలను అరెస్టు చేయాలి

**- ములుగు బీజేపీ**



ములుగు సెప్టెంబర్ 01, విజన్ ఆంధ్ర ప్రతినిధి : బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడిని నిరసిస్తూ ములుగు జిల్లా కేంద్రంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. దాడులతో బీజేపీని భయపెట్టలేరని, ప్రజా సమస్యలపై పోరాటం ఆగదని బలరాం అన్నారు. ఆరు గ్యారెంటీలు అమలు చేయలేక కాంగ్రెస్ దాడులకు దిగుతోందని విమర్శించారు. దాడి చేసిన గుండాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కృష్ణవేణి, జవహర్ లాల్, జిల్లా నాయకులు కృష్ణాకర్ రావు, రమేష్, సుమలత తదితరులు పాల్గొన్నారు.

## దేశభక్తి కవిత్వంతో ఆకట్టుకున్న ములుగు కవి

**- కోన్డే శ్రీనివాస్ కు ఘన సన్మానం**




ములుగు ఆగస్ట్ 31, విజన్ ఆంధ్ర ప్రతినిధి : జాతీయ భావాలను, జెండా గొప్పదనాన్ని తన అక్షరాల్లో అద్భుతంగా ఆవిష్కరించిన ములుగు బిడ్డ, ప్రముఖ కవి లికోన్డే శ్రీనివాస్లి కు కరీంనగర్ లో ఘన సన్మానం లభించింది. సోమవారం భగవతి స్కూల్స్ లో జరిగిన లి'జెండా పై కవిరాజు'లి పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో వేదికపై కవి శ్రీనివాస్ ప్రతిభకు ప్రముఖుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తాయి. తన కలంతో దేశభక్తిని రగిలిస్తూ, యువతలో జాతీయ స్ఫూర్తిని నింపుతున్న శ్రీనివాస్ రచనలు అభినందనీయమని ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి కొనియాడారు. ములుగు గడ్డ నుంచి వచ్చి జాతీయ స్థాయిలో సాహిత్య పరిషత్ వేదికపై గుర్తింపు తెచ్చుకోవడం గర్వకారణమని మేయర్, డిప్యూటీ మేయర్ ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, కరీంనగర్ మేయర్, డిప్యూటీ మేయర్, జాతీయ సాహిత్య పరిషత్ ప్రముఖులు శాలువాతో సత్కరించి పుస్తకాన్ని అందజేశారు. కవి శ్రీనివాస్ మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

# అప్పుల ఊబిలో తెలంగాణ.. దిశ మార్చుకోవాల్సిన సమయం వచ్చింది!

**- పార్టీలకు అతీతంగా ఆర్థిక భవిష్యత్తుపై చర్చ జరగాలి**

**- అప్పులు ఎక్కడ ఖర్చయ్యాయి..?**

**ప్రజలకు వచ్చిన శాశ్వత ప్రయోజనాలేమిటి..?**



కాప్రా, సెప్టెంబర్ 1 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు పూర్తవుతున్న నేపథ్యంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై తెలంగాణ బుద్ధిజీవులు, ఉద్యమకారులు, ప్రజా సంఘాలు, పౌర సంఘాలు ఒక్కసారి ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైందని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఫౌండర్ చైర్మన్ డా. చీమ శ్రీనివాస్ అన్నారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సమయంలో హైదరాబాద్ వంటి అన్ని హంగులు, మౌలిక వసతులు కలిగిన రాజధాని రాష్ట్రానికి ఉందని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై మిగులు బడ్జెట్ గురించి కూడా అప్పట్లో చర్చ జరిగిందని ఆయన గుర్తుచేశారు. అయితే ప్రస్తుతం తెలంగాణ ఆర్థిక పరిస్థితిపై ఆందోళన వ్యక్తమయ్యే పరిస్థితి ఎందుకు ఏర్పడిందనే అంశంపై సమగ్రంగా చర్చించాల్సిన అవసరం ఉందన్నారు.

**అప్పుల భారం ఎలా పెరిగింది?**

రాష్ట్రం ఏర్పడిన నాటి ఆర్థిక పరిస్థితి నుంచి నేటి భారీ అప్పుల భారం వరకు పరిస్థితి ఎలా మారిందో ప్రజలకు స్పష్టంగా తెలియాల్సిన అవసరం ఉందని డా. చీమ శ్రీనివాస్ పేర్కొన్నారు. గత పదేళ్లలో తీసుకున్న లక్షల కోట్ల రూపాయల అప్పులు ఏ రంగాలకు వినియోగించారు..? వాటి ద్వారా తెలంగాణ ప్రజలకు ఎంత మేర శాశ్వత ఆస్తులు, ఉపాధి అవకాశాలు, ఆదాయ వనరులు సమకూరాయి..? అనే ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉందన్నారు. ప్రతి సంవత్సరం వేల కోట్ల రూపాయలు అప్పులపై వడ్డీలు, అసలు చెల్లింపులకే వెచ్చించాల్సి వస్తే భవిష్యత్ తరాలపై దాని ప్రభావం ఎలా ఉంటుందనే అంశాన్ని కూడా ప్రజా చర్చలోకి తీసుకురావాలని సూచించారు.

**ఇది ఏ ఒక్క పార్టీ సమస్య కాదు**

ఒక రాజకీయ పార్టీని విమర్శించడం తమ ఉద్దేశం కాదని, తెలంగాణ రాష్ట్ర ఆర్థిక భవిష్యత్తుపై నిజాయితీగా, పార్టీలకు అతీతంగా చర్చ జరగాలని డా. చీమ శ్రీనివాస్ అన్నారు. అప్పులు ఎందుకు పెరిగాయి..? ఎక్కడ ఖర్చు చేశారు..? ఆ అప్పుల ద్వారా తెలంగాణకు వచ్చిన శాశ్వత ప్రయోజనాలు ఏమిటి..? భవిష్యత్తులో అప్పుల భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వాల వద్ద ఉన్న ప్రణాళిక ఏమిటి..? వంటి అంశాలపై ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

**బలమైన తెలంగాణ నిర్మాణమే లక్ష్యం**

తెలంగాణను ఆర్థిక సంక్షోభం వైపు వెళ్లకుండా కాపాడే బాధ్యత ఏ ఒక్క రాజకీయ పార్టీదీ కాదని, ఇది తెలంగాణ ప్రజల భవిష్యత్తుకు సంబంధించిన అంశమని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ వంటి రాజకీయ పార్టీలకు అతీతంగా తెలంగాణ బుద్ధిజీవులు, ఉద్యమకారులు, ప్రజా సంఘాలు, పౌర సంఘాలు రాష్ట్ర భవిష్యత్తుపై ఆలోచించాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో ఉచిత, అందుబాటు విద్య, అందరికీ నాణ్యమైన వైద్యం, యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు, పెట్టుబడులుపరిశ్రమల ద్వారా ఉద్యోగాల కల్పన, రైతులకు స్థిరమైన ఆదాయం, సామాజిక న్యాయం, ఆర్థిక క్రమశిక్షణ వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

**ఆర్థిక పునర్‌నిర్మాణంపై శ్వేతపత్రం తరహా చర్చ**

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, అప్పుల భారం, వాటి వినియోగం, భవిష్యత్ ప్రణాళికలపై రాజకీయ పార్టీలన్నీ కలిసి పారదర్శకమైన చర్చ చేపట్టాలని డా. చీమ శ్రీనివాస్ కోరారు. తెలంగాణ ఆర్థిక పునర్‌నిర్మాణానికి సమగ్ర కార్యాచరణ రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ కోసం పోరాడిన ఉద్యమకారుల కల కేవలం ప్రత్యేక రాష్ట్ర సాధనతో ముగియలేదని, ప్రతి తెలంగాణ పౌరుడికి ఆత్మగౌరవం, విద్య, వైద్యం, ఉపాధి, సంక్షేమం, భద్రమైన భవిష్యత్తు కల్పించే రాష్ట్రాన్ని నిర్మించడమే అసలైన లక్ష్యమని పేర్కొన్నారు. అప్పుల భారాన్ని తగ్గించి ఆర్థికంగా బలమైన తెలంగాణను నిర్మించేందుకు పార్టీలకు అతీతంగా అందరూ కలిసి ఆలోచించాలని డా. చీమ శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

# కిషోర్ కుమార్ సేవలు మరువలేనివి జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

**బదిలీలు, పదవీ విరమణలు ఉద్యోగ జీవితంలో సహజమే,**



నిర్మల్ జిల్లా,సెప్టెంబర్ 01,(విజన్ ఆంధ్ర); జిల్లాకు రెవెన్యూ అదనపు కలెక్టర్‌గా కిషోర్ కుమార్ అందించిన సేవలు మరువలేనివని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. ప్రతి ఉద్యోగి జీవితంలో బదిలీలు, పదవీ విరమణలు సహజమని పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ వరంగల్ జిల్లాకు బదిలీపై వెళ్తున్న సందర్భంగా వీడ్కోలు కార్యక్రమం, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి బాలిగ్ అహ్మద్, ఏడి ల్యాండ్ సర్వే రికార్డ్స్ నరసింహమూర్తి పదవీ విరమణ సందర్భంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కిషోర్ కుమార్ రెవెన్యూ అదనపు కలెక్టర్‌గా భూ సమస్యల పరిష్కారం, ధాన్యం కొనుగోళ్లు, ఎన్నికల నిర్వహణ తదితర అంశాల్లో సమర్థవంతంగా విధులు నిర్వర్తించారని ప్రశంసించారు. ముఖ్యంగా ధాన్యం కొనుగోళ్లను సకాలంలో, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పూర్తి చేయడంలో ఆయన కీలకంగా పనిచేశారని అభినందించారు. వరంగల్ జిల్లాలోనూ ఇదే అంకితభావంతో పనిచేసి మంచి పేరు సంపాదించాలని ఆకాంక్షించారు. అలాగే, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిగా బాలిగ్ అహ్మద్, ఏడి ల్యాండ్ సర్వే రికార్డ్స్‌గా నరసింహమూర్తి సుదీర్ఘకాలం క్రమశిక్షణతో విధులు నిర్వహించి అందరి మన్ననలు పొందారని కలెక్టర్ తెలిపారు. అనుభవజ్ఞులైన ఈ అధికారులు పదవీ విరమణ చేయడం జిల్లాకు లోటేనని పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆరోగ్యంగా, ఆనందంగా భావి జీవితాన్ని గడపాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. వీడ్కోలు సందర్భంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ మాట్లాడుతూ, నిర్మల్ జిల్లాలో విధులు నిర్వహించడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. తన విధుల నిర్వహణలో సహకరించిన అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. భూ సమస్యల పరిష్కారం, ప్రజావాణి నిర్వహణ, ఎన్నికల విధులు, వరదల సమయంలో సహాయక చర్యల్లో పాల్గొనడం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని పేర్కొన్నారు. ప్రతి అధికారి ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. పదవీ విరమణ పొందిన జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి బాలిగ్ అహ్మద్, ఏడి ల్యాండ్ సర్వే రికార్డ్స్ నరసింహమూర్తి మాట్లాడుతూ, తమ ఉద్యోగ జీవితంలో సహకరించిన అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. పదవీ విరమణ సందర్భంగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన జిల్లా కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు. తమ సుదీర్ఘ ఉద్యోగ జీవితంలో ఎదురైన అనుభవాలను ఈ సందర్భంగా పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, డీఆర్ఓ రాథోడ్ రమేష్, ఆర్డీఓ దేవీదాస్, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల సంక్షేమనికి కృషి చేయాలి

**- దొమ్మాటి కిరణ్ కుమార్ రావు**



కాప్రా/సెప్టెంబర్-01(విజన్ ఆంధ్ర ప్రతినిధి) : ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమకారులకు గుర్తించి వారి సంక్షేమానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం శుభపరిణామం అని జె.ఏ.సి. మాజీ కన్వీనర్ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మీడియా కన్వీనర్ దొమ్మాటి కిరణ్ కుమార్ రావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ ప్రతినిధులతో నిర్వహించిన భేటీలో సంబంధిత విషయంలో సానుకూలంగా స్పందించిన నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. ఉద్యమకారులను గుర్తించి వారి సేవలకు తగిన గుర్తింపు వారి సేవలను తగిన గౌరవం కల్పించడమే కాకుండా సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడించడం సంతోషకరమని పేర్కొన్నారు. ఉద్యమకారుల రుణం తీర్చుకునే దిశగా 250 గజాల నివాస స్థలం, చేయుత పింఛన్, ఆరోగ్య కార్డులు, ఆర్టీసీ ఉచిత ప్రయాణ సౌకర్యం తదితర వసతులను కల్పించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలతను వ్యక్తం చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర సాధన కోసం ఉద్యమకారులు ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొని, తమ జీవితాలను సైతం ఫణంగా పెట్టారని గుర్తు చేశారు. వారి త్యాగాల ఫలితంగానే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందన్నారు. ఉద్యమకారుల సంక్షేమం గౌరవం, సముచిత స్థానం, కల్పించే దిశగా నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారిధ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తెలంగాణ ఉద్యమకారులను నూతన విశ్వాసాన్ని నింపిందని అన్నారు.

# కాంగ్రెస్ కార్యాలయం ముట్టడి బీజేపీ శ్రేణుల అరెస్టు






వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 1 (విజన్ ఆంధ్ర) : హైదరాబాద్‌లోని తెలంగాణ బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణులు దాడి చేయడాన్ని నిరసిస్తూ వనపర్తి జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని బీజేపీ నాయకులు, కార్యకర్తలు ముట్టడించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ వైఖరికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. ప్రజాస్వామ్యానికి విరుద్ధం రాజకీయ విభేదాలను వాదోపవాదాల ద్వారా పరిష్కరించుకోవాలే తప్ప దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని బీజేపీ నాయకులు విమర్శించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడి జరుగుతున్నప్పుడు పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారని, రాష్ట్రంలో ప్రతిపక్ష కార్యాలయాలకే రక్షణ లేకపోతే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. అరెస్టులపై మండిపాటు శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమను అరెస్టు చేసి టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించడాన్ని నాయకులు తీవ్రంగా ఖండించారు. పోలీసులు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే భావన కలుగుతోందని, నిష్పక్షపాతంగా విధి నిర్వహణ చేపట్టాలని డిమాండ్ చేశారు. దాడులకు పాల్పడిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని, బీజేపీ నాయకులకు భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ ఛైర్మన్ లోకనాథ్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు, నాయకులు కల్పన, అలివేల, నక్క మహేష్, కొమ్ము శ్రీనివాసులు, అరవిందు, గంధం ప్రవీణ్, రాజశేఖర్ గౌడ్, గోపీనాథ్, కంచరవి, తిరుపతయ్య, రవి, మోహన్ సాగర్, చిన్న రాయుడు, నవీన్, శివ, చందు, వెంకటేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## వనపర్తి జిల్లాలో '30 పోలీస్ యాక్ట్' అమలు

**- సెప్టెంబర్ 30 వరకు అమల్లో ఆంక్షలు**

**- అనుమతి లేని సభలు, ర్యాలీలపై కఠిన చర్యలు**

**- జిల్లా ఎస్పీ సునిత రెడ్డి హెచ్చరిక**




వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 1 (విజన్ ఆంధ్ర) జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణ నిమిత్తం సెప్టెంబరు 1 నుంచి 30 వరకు '30 పోలీస్ యాక్ట్-1861' అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసు ఉన్నతాధికారుల ముందస్తు అనుమతి లేకుండా బహిరంగ సభలు, ర్యాలీలు, ధర్నాలు, ఊరేగింపులు, భారీ సమావేశాలు నిర్వహిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల సాధారణ జీవనానికి ఎలాంటి అంతరాయం కలగకుండా చూడడం, అవాంఛనీయ సంఘటనలను ముందస్తుగా నివారించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. ఏ సంస్థ, సంఘం లేదా వ్యక్తులైనా బహిరంగ కార్యక్రమాలు నిర్వహించాలనుకుంటే ముందుగానే పోలీసు అధికారులను సంప్రదించి అనుమతి పొందాలని సూచించారు. చట్టాలను గౌరవిస్తూ, జిల్లాలో ప్రశాంత వాతావరణాన్ని కాపాడేందుకు ప్రజలందరూ పోలీసు శాఖకు సహకరించాలని ఎస్పీ కోరారు.

# ఆశ్రమాల్లో సౌకర్యాలు మెరుగ్గా ఉండాలి

**- చేయూత, బాలసదన్, వృద్ధాశ్రమాన్ని సందర్శించిన న్యాయమూర్తి దీప కాసరగడ్డ**





వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 1 (విజన్ ఆంధ్ర) వృద్ధులు, చిన్నారులకు ఆశ్రమాల్లో నిరంతరం మెరుగైన సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి దీప కాసరగడ్డ అధికారులను ఆదేశించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని చేయూత ఆశ్రమం, వృద్ధుల ఆశ్రమం, బాలసదన్‌లను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి చిన్నారులు, వృద్ధులతో ప్రత్యేకంగా మాట్లాడి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమాల్లో కల్పిస్తున్న నివాసం, ఆహారం, వైద్యం వంటి సదుపాయాల వివరాలపై ఆరా తీశారు. అనంతరం న్యాయమూర్తి మాట్లాడుతూ... ఆశ్రమవాసులకు మెరుగైన వసతులు అందించడంలో ఏవైనా సమస్యలు ఎదురైనా లేదా సౌకర్యాల పట్ల అసంతృప్తి ఉన్నా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. బాధితులకు, నిరుపేదలకు చట్టపరమైన సేవలు అందించేందుకు న్యాయ సేవాధికార సంస్థ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మండల అధ్యక్షుల ఎంపికకు అభిప్రాయ సేకరణ

- కొత్తపల్లి, కరీంనగర్ రూరల్ మండలాలపై కాంగ్రెస్ దృష్టి
- ఆశావహుల నుంచి వివరాలు సేకరించిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



దుండిగల్, సెప్టెంబరు 1: (విజన్ ఆంధ్ర); కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని కొత్తపల్లి, కరీంనగర్ రూరల్ మండలాల కాంగ్రెస్ అధ్యక్షుల నియామకానికి పార్టీ అధిష్ఠానం కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా కరీంనగర్ పార్లమెంట్ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ మంగళవారం మండల అధ్యక్ష పదవులను ఆశిస్తున్న నాయకుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో, పీసీసీ ఆదేశాల మేరకు ఈ అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్తపల్లి, కరీంనగర్ రూరల్ మండలాలకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు అధ్యక్ష పదవుల కోసం తమ ఆసక్తిని వ్యక్తం చేయగా.. వారి వివరాలను సేకరించి, ఒక్కొక్కరి అభిప్రాయాలను కూన శ్రీశైలం గౌడ్ స్వయంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ కోసం కష్టపడి పనిచేసే, కాంగ్రెస్ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించే సామర్థ్యం ఉన్న నాయకులకు ప్రాధాన్యం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. మండల స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేలా నాయకత్వ లక్షణాలు ఉన్నవారిని ఎంపిక చేయాల్సిన అవసరం ఉందన్నారు. అభిప్రాయ సేకరణలో లభించిన వివరాలను పీసీసీకి అందజేస్తామని, పార్టీ అధిష్ఠానం సూచనలు, నిర్ణయం మేరకు కొత్తపల్లి, కరీంనగర్ రూరల్ మండలాలకు నూతన అధ్యక్షులను త్వరలో ప్రకటిస్తామని కూన శ్రీశైలం గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు ఫక్రుద్దీన్‌తో పాటు కొత్తపల్లి, కరీంనగర్ రూరల్ మండలాలకు చెందిన పలువురు పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిరసన కార్యక్రమాలు జయప్రదం చేయాలి

- జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్



మందమర్రి / రామకృష్ణాపూర్,సెప్టెంబర్ 1 (విజన్ ఆంధ్ర) : వెయ్యి రోజుల కాంగ్రెస్,420 మోసాలపై బీఆర్ఎస్ తలపెట్టిన నిరసన కార్యక్రమాలను చెన్నూరు నియోజకవర్గా వ్యాప్తంగా జయప్రదం చేయాలని మాజీ చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్ పిలుపునిచ్చారు. మంగళవారం క్యాతన్ పల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఆయన నివాసంలో చెన్నూరు,మందమర్రి,క్యాతన్ పల్లి ముఖ్య నాయకులు,కార్యకర్తలుతో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో దిశానిర్దేశం చేశారు.

## జాతీయ రహదారి పరిశుభ్రత పనులు వేగవంతం చేయాలి



మహబూబ్ నగర్ సెప్టెంబరు 01 విజన్ ఆంధ్ర ప్రతినిధి: జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో జాతీయ రహదారి వెంట చేపడుతున్న పరిశుభ్రత పనులను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ మంగళవారం పరిశీలించారు. జాతీయ రహదారి వెంట కొనసాగుతున్న శుభ్రత పనులతో పాటు రహదారి మధ్య మీడియన్ లో మొక్కల పెంపకం, బారికేడింగ్, గడ్డి, పిచ్చిమొక్కల తొలగింపు, పరిసరాల పరిశుభ్రతకు సంబంధించిన పనులను ఆయన పరిశీలించారు. అనంతరం పనుల పురోగతిని సంబంధిత అధికారులతో సమీక్షించారు. జాతీయ రహదారి పరిసరాలు పరిశుభ్రంగా, సుందరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రస్తుతం కొనసాగుతున్న పనులను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. జాతీయ రహదారి వెంట గుర్తించిన శుభ్రత పనులు, మొక్కలు నాటడం, బారికేడింగ్, గడ్డి తొలగింపు తదితర అన్ని పనులను రెండు రోజుల్లోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశించారు.

## పాత పెన్షన్ కోసం నల్ల బ్యాడ్జీలతో నిరసన

ములుగు, సెప్టెంబర్ 01, విజన్ ఆంధ్ర ప్రతినిధి : కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేయాలని కోరుతూ ములుగు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు సోమవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. టీజీఈ జేఏసీ, తపస్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఈ నిరసన జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు నెలల్లో ఓపీఎస్ అమలు చేస్తామన్న హామీని నిలబెట్టుకోవాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. సీపీఎస్ వల్ల భవిష్యత్ భద్రత లేదని, వెంటనే రద్దు చేయాలన్నారు. హామీ అమలు కాకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీపీయూఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోనె రవీందర్ తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ములుగు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన కె. చండీశ్వరి దేవి.



ములుగు సెప్టెంబర్ 01, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ములుగు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిగా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన కె. చండీశ్వరి దేవిని లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జిగా సేవలందించిన ఆమె పదోన్నతిపై ములుగుకు వచ్చారు. ఈ సందర్భంగా చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మేకల మహేందర్, డిప్యూటీ చీఫ్ బానోత్ స్వామిదాస్ పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

# మైనారిటీ మహిళలకు ఆర్థిక చేయూత

- ఇందిరమ్మ యోజనతో స్వయం ఉపాధికి ప్రోత్సాహం
- 225 మంది లబ్ధిదారులకు రూ.50 వేల చొప్పున చెక్కులు
- 57 మంది వృత్తిదారులకు జనరేటర్లు, టూల్‌కిట్ల పంపిణీ




బాచుపల్లి, సెప్టెంబరు 1 (విజన్ ఆంధ్ర): మైనారిటీ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం కావడానికి ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన ఎంతగానో దోహదపడుతుందని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, పరిశ్రమలు, వాణిజ్యం, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మంగళవారం మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ తదితరులతో కలిసి మంత్రి పాల్గొన్నారు.

**మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రాధాన్యం**

మహిళలను ఆర్థికంగా స్వతంత్రులుగా తీర్చిదిద్దాలనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనలో భాగంగానే ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజనను అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. స్వయం ఉపాధి, చిన్న వ్యాపార కార్యకలాపాలను ప్రోత్సహించడం ద్వారా మైనారిటీ మహిళలు సొంతంగా ఆదాయం సమకూర్చుకునేలా ప్రభుత్వం చేయూతనిస్తోందన్నారు. మహిళలకు అందించే ప్రతి రూపాయి కుటుంబ సంక్షేమానికే ఉపయోగపడుతుందని, అందుకే ప్రజా ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు.

**225 మంది మహిళలకు రూ.50 వేల చొప్పున**

ఈ పథకం కింద జిల్లాలో 225 మంది మైనారిటీ మహిళా లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున చెక్కులను పంపిణీ చేశారు. సహాయ మొత్తాన్ని నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం ద్వారా పథకంలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు మంత్రి తెలిపారు.

**వృత్తిదారులకు జనరేటర్లు, టూల్‌కిట్లు**

తుర్క కాశీ ముస్లిం వర్గానికి చెందిన కులవృత్తిదారులకు జీవనోపాధికి ఉపయోగపడేలా 57 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.60 వేల విలువైన జనరేటర్లు, టూల్‌కిట్లను అందజేశారు. మైనారిటీల జీవనోపాధికి అవసరమైన మోపెడ్లు, మహిళలకు స్వయం ఉపాధి కింద కుట్టుమిషన్లు కూడా అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే మైనారిటీ విద్యార్థులకు ముఖ్యమంత్రి ఓవర్సీస్ స్కాలర్‌షిప్ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నామని చెప్పారు. మైనారిటీల మత, సామాజిక, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ఆర్థిక సహకారం అందిస్తోందన్నారు.

**ఆరు గ్యారంటీల అమలుపై వివరణ**

ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా మహిళలకు ఆర్థిక చేయూత అందించడం గర్వంగా ఉందని శ్రీధర్‌బాబు అన్నారు. ఆరు గ్యారంటీలను చిత్తశుద్ధితో అమలు చేస్తున్నామని తెలిపారు. గృహజ్యోతి కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని వివరించారు. పేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి వసతులతో నాణ్యమైన విద్య అందించేందుకు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ నూతన స్మార్ట్ రేషన్ కార్డులు జారీ చేసి సన్నబియ్యం అందిస్తున్నామని చెప్పారు. రైతులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రైతు భరోసా, రైతు బీమా, వ్యవసాయ పనిముట్ల పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

**లబ్ధిదారులకు పథకాల పంపిణీ**

అనంతరం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ తదితరులు లబ్ధిదారులకు చెక్కులు, జనరేటర్లు, టూల్‌కిట్లను అందజేశారు. కార్యక్రమంలో హజ్ కమిటీ సభ్యుడు మహమ్మద్ ముజుబుద్దీన్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, జిల్లా కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, గ్రంథాలయ సంస్థ చైర్మన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, కమ్మ కార్పొరేషన్ చైర్మన్, ఆర్టీఏ సభ్యుడు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, టీజీఎల్‌డీఏ చైర్మన్, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కాంతమ్మ, ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు

# ఆలయ భూముల సర్వేకు సర్వం సిద్ధం!

- జగద్గిరిగుట్ట ఆలయానికి చెందిన 14.10 ఎకరాల భూమిపై సరిహద్దుల నిర్ధారణ
- హైకోర్టు ఆదేశాలతో కదిలిన రెవెన్యూ, సర్వే, దేవాదాయ శాఖలు




జగద్గిరిగుట్ట, సెప్టెంబర్ 1 (విజన్ ఆంధ్ర): జగద్గిరిగుట్ట శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి చెందిన భూముల పరిరక్షణకు అధికార యంత్రాంగం చర్యలు ప్రారంభించింది. కుత్బుల్లాపూర్ గ్రామంలోని సర్వే నంబరు 348/1లో ఉన్న 14 ఎకరాల 10 గుంటల ఆలయ భూమిని గుర్తించి, సరిహద్దులను నిర్ధారించేందుకు సర్వే ప్రక్రియకు రంగం సిద్ధమైంది. ఆలయ భూములను గుర్తించి హద్దులు ఏర్పాటు చేసి పరిరక్షించాలని కొంతకాలంగా కొనసాగుతున్న వినతులు, నిరసనలు, రిలే నిరాహార దీక్షల నేపథ్యంలో ఈ చర్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. తెలంగాణ హైకోర్టు డబ్ల్యూ.పీ. నంబరు 40409/2025లో 10-04-2026న ఇచ్చిన ఆదేశాల నేపథ్యంలో రెవెన్యూ, సర్వే, దేవాదాయ శాఖల అధికారులు సమన్వయంతో ప్రక్రియను ముందుకు తీసుకెళ్తున్నారు. ఇప్పటికే సంబంధిత శాఖల మధ్య అధికారిక ఉత్తరప్రత్యుత్తరాలు జరిగినట్లు అధికారులు తెలిపారు.

**అధికారులతో క్షేత్రస్థాయి సమీక్ష**

జగద్గిరిగుట్ట శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, ఉద్యమకారులతో సమావేశం నిర్వహించారు. రెవెన్యూ సర్వే డీఐ బలరాం, దేవాదాయ శాఖ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్‌కుమార్, సర్వేయర్ జ్యోతి, కుత్బుల్లాపూర్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గులాం ఖలీం, ఆలయ ఈవో రాంబాబు, మాజీ ఈవో కృష్ణమాచార్యులు, దరఖాస్తుదారు వై. మాధవులు, ఆకుల సతీష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఆలయ భూములకు సంబంధించిన అందుబాటులో ఉన్న రికార్డులను పరిశీలించి, సంబంధిత శాఖల సమన్వయంతో తదుపరి చర్యలు చేపడతామని తెలిపారు. అవసరమైతే సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేసి, నిబంధనల ప్రకారం పూర్తి ప్రక్రియను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

**14.10 ఎకరాలపై హద్దుల నిర్ధారణ**

సర్వే నంబరు 348/1లోని ఆలయ భూమి విస్తీర్ణం, హద్దులను అధికారికంగా నిర్ధారించేందుకు అవసరమైన రికార్డులను సేకరించి సమగ్ర సర్వే నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. సర్వే అనంతరం భూమికి పకడ్బందీగా హద్దులు ఏర్పాటు చేసి, ఆలయ ఆస్తిని పరిరక్షించేందుకు అవసరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందన్నారు. హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా అన్ని విధాలా నిబంధనలు, విధివిధానాలను పాటిస్తూ సంబంధిత శాఖల అధికారుల సహకారంతో సర్వే పూర్తి చేస్తామని అధికారులు పేర్కొన్నారు. ఆలయానికి చెందిన 14 ఎకరాల 10 గుంటల భూమిని గుర్తించి, దాని పరిరక్షణకు చర్యలు తీసుకోవడమే లక్ష్యమని తెలిపారు.

**ఉద్యమానికి ఫలితం దక్కుతుందా?**

ఆలయ భూములను గుర్తించి కాపాడాలని కోరుతూ గత కొంతకాలంగా స్థానికులు, వివిధ వర్గాల ప్రతినిధులు అధికారులకు వినతిపత్రాలు సమర్పించడంతో పాటు నిరసనలు, రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. తాజాగా అధికార యంత్రాంగం సర్వే ప్రక్రియపై దృష్టి సారించడంతో వారి డిమాండ్లకు పరిష్కారం లభిస్తుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది. ఈ ప్రక్రియలో భాగంగా సంబంధిత శాఖల రికార్డుల పరిశీలన, క్షేత్రస్థాయి సర్వే, హద్దుల నిర్ధారణ, అవసరమైన తదుపరి చర్యలను దశలవారీగా చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో జగద్గిరిగుట్ట ఆలయ భూముల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఈ సమావేశంలో టీజేఎస్ రాష్ట్ర నాయకులు ఎర్రవీరన్న, వేణుగౌడ్, నరేందర్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, గణేష్, హైమావతి, రాజు యాదవ్, సతీష్, చంద్రకళ, రవీందర్, సంజీవరెడ్డి, అనిత తదితర స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆచరణాత్మక విద్యతోనే సృజనాత్మకత

- విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు వంద శాతం ఉండాలి
- పది పరీక్షలకు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలి
- పీఏసీఎల్ భూ బాధితుల వివరాలు సమగ్రంగా సేకరించాలి
- జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా



నిర్మల్ జిల్లా,సెప్టెంబర్ 01,(విజన్ ఆంధ్ర); పుస్తక పరిజ్ఞానంతో పాటు ఆచరణాత్మక విద్యను అందించడం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. మంగళవారం తానూరు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు, వసతిగృహం, పరిసరాలను పరిశీలించిన కలెక్టర్, పాఠశాల ఆవరణలో పారిశుద్ధ్య నిర్వహణపై ఆరా తీశారు. పిచ్చిమొక్కలను ఎప్పటికప్పుడు తొలగించి పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు వంద శాతం ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఇప్పటివరకు పూర్తయిన సిలబస్, మిగిలిన పాఠ్యాంశాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిర్దేశిత గడువులోగా సిలబస్ పూర్తి చేసి, పదో తరగతి వార్షిక పరీక్షలకు విద్యార్థులను ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా సిద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన అల్పాహారం, భోజనం అందించాలని ఆదేశించారు. పాఠశాలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే గుర్తించి పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. పదో తరగతి విద్యార్థినులతో కలెక్టర్ ముఖాముఖిగా మాట్లాడారు. పాఠశాలలో అందుతున్న వసతులు, భోజనం నాణ్యత, చదువులో ఎదురవుతున్న ఇబ్బందులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం బోర్డు మీద గణిత లెక్కలు రాయించి విద్యార్థినుల సామర్థ్యాన్ని పరిశీలించారు. సరైన సమాధానాలు చెప్పిన విద్యార్థినులను అభినందించి పెన్నులను బహుమతిగా అందించారు. పరీక్షల గురించి ఆందోళన చెందకుండా రోజువారీ చదువుకు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. పాఠ్యాంశాల్లో సందేహాలు ఉంటే ఉపాధ్యాయులను అడిగి వెంటనే నివృత్తి చేసుకోవాలని, అర్థం చేసుకుని చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని విద్యార్థినులకు సూచించారు. అంతకుముందు తానూరు మండలం మొగిలి గ్రామంలోని విఠలేశ్వర ఆలయ ప్రాంగణంలో పీఏసీఎల్ (పెరల్స్ ఆగ్రోటెక్ కార్పొరేషన్ లిమిటెడ్) భూ బాధిత రైతులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రైతులు తమ భూ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. బాధిత రైతుల నుంచి పూర్తి వివరాలను సేకరించి, గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, జీపీవోల ద్వారా సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే సంబంధిత భూములకు సమగ్ర సర్వే నిర్వహించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమస్యలు ఉన్న గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి బాధితుల నుంచి వివరాలు తెలుసుకుని, సాధ్యమైనంత త్వరగా పరిష్కార మార్గాలను అన్వేషిస్తామని కలెక్టర్ చెప్పారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. మొగిలి గ్రామంలో రోడ్ల మరమ్మతులకు సంబంధించి గ్రామస్థులు అందించిన వినతిని కలెక్టర్ స్వీకరించారు. సమస్యను పరిశీలించి త్వరలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం విఠలేశ్వర ఆలయంలో కలెక్టర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, తహసీల్దార్ మహేందర్‌నాథ్, ఎంపీడీవో శ్రీధర్, ఏఎంసీ ఛైర్మన్ షిండే ఆనంద్‌రావు పటేల్, మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, సర్పంచ్ ఉష, ఉపసర్పంచ్ నితిన్, సంబంధిత అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# దొంగతనాల ముఠా అరెస్ట్

- నాలుగు తులాల బంగారం, రెండు బైకులు స్వాధీనం




ములుగు సెప్టెంబర్ 01, విజన్ ఆంధ్ర ప్రతినిధి : వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను ములుగు పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 4.280 తులాల బంగారం, రెండు బైకులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం ఉదయం 9 గంటలకు జీవన్‌రావుపల్లి వై జంక్షన్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులను చూసి కారును వెనక్కి తిప్పి పారిపోయేందుకు యత్నించిన ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా విషయం వెలుగులోకి వచ్చింది.

స్వాధీనం చేసుకున్న వస్తువులు:

- 4.280 తులాల బంగారం - 2 పుస్తెలు, 3 గుండ్లు, 1 పుస్తెల తాడు
- అబ్బాపూర్ గ్రామంలో దొంగిలించిన ఎరుపు రంగు హోండా షైన్ బైక్
- నిందితుడి హోండా షైన్ బైక్ నెం. టీఎస్ 22 ఎ 2802
- నేరానికి ఉపయోగించిన తెల్ల ఎర్టిగా కారు నెం. టీఎస్ 22 డీ 8601

నిందితులు సిరిగిరి పరశురామ్, పండుగ రమేష్, గుంజ గంగాధర్ గా గుర్తించారు. వీరు గతంలో పోతకపల్లి, కమలాపూర్, రేగొండ, కేశవపట్నం, సిరిసిల్ల, ఆర్మూర్, నిజామాబాద్, దుండిగల్, బోధన్ ప్రాంతాల్లో మోటార్ దొంగతనాలు, ఇళ్ల దొంగతనాలు, ఆలయ హుండీ దొంగతనాల కేసుల్లో జైలుకు వెళ్లినట్లు విచారణలో తేలింది. కరీంనగర్ జైలులో ఉండగా వీరికి పరిచయం ఏర్పడినట్లు తెలిపారు. కేసును ఛేదించిన సీఐ డి. సురేష్ ఆధ్వర్యంలో ఎస్సై ఎస్. వెంకటేష్, పీసీలు రఘు, అరుణ్, వినోద్, మధుకర్, కృష్ణప్రసాద్, రాజ్ కుమార్ మరియు సీడీఆర్ వింగ్ రాజేంద్రప్రసాద్ లను డీఎస్పీ అభినందించారు.

# అర్హులైన ప్రతి ఒక్కరు ఓటు హక్కు కలిగి ఉండేలా చూడాలి.

-100% ఓట్ల నమోదు లక్ష్యంగా పనిచేయాలి

-బిఎల్ఓ లను అభినందించిన మంత్రి





సంగారెడ్డి డెస్క్ విజన్ ఆంధ్ర సెప్టెంబర్ : రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆందోల్ నియోజకవర్గం లోని ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సార్ పై సంగారెడ్డి లోని తన నివాసంలో బిఎల్ఏ లతో జరిగిన అవగాహన కార్యక్రమం లో పాల్గొన్నారు. ఆందోల్ నియోజకవర్గం లోని మునిపల్లి, రాయికోడ్, ఆందోల్, పుల్కల్ , చౌటకూర్, రేగోడ్, రాయికోడ్ , వట్పల్లి, అల్లదుర్గ్, మండలాల బిఎల్ఏ లు , వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు.సార్ ప్రక్రియ రెండవ దశ పై బిఎల్ఏ లకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన ను మంత్రి దామోదర్ రాజనర్సింహ గారు కల్పించారు.బిఎల్ఏ లకు సార్ విజయవంతం చేయడంపై ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. డిజిటైలైజ్ కానీ ఓటర్ల కు వచ్చిన నోటీసులు లకు అవసరమైన ధృవ పత్రాలను బిఎల్ఓ లకు అందించేందుకు ఓటర్ల కు బిఎల్ఏ లు పూర్తి సహకారాన్ని అందించాలని మంత్రి సూచించారు.ఈ సమావేశంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సార్ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో బిఎల్ఏ లు ఎంతో కష్టపడి విజయవంతం చేస్తున్నారన్నారు మంత్రి దామోదర్ రాజనర్సింహ. కాంగ్రెస్ పార్టీ బూతు లెవెల్ ఏజెంట్స్ బూతుల వారిగా డిజిటలైజ్ కాని, నోటీసులు అందుకున్న ఓటర్లు వివరాలు వెంటనే సేకరించి ఓటర్ నమోదుకు అవసరమైన ధ్రువపత్రాలను బిఎల్ఎ లకు అందించటం లో ఓటర్ లకు పూర్తి సహకారంఅందించాలని మంత్రి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండేలా బిఎల్ఏ లు సహకారం అందించాలన్నారు. అందుకు,బిఎల్ఏ లు కృషి చేయాలన్నారు. నోటీస్ వచ్చిన ఓటర్ల తో సమన్వయ చేసుకొని గడువులోగా అవసరమైన ధ్రువపత్రాలను బిఎల్ఓ లకు అందించి డిజిటలైజ్ కు కృషి చేయాలని పిలుపునిచ్చారు.సార్ ప్రక్రియను ఆందోల్ నియోజకవర్గం లో 100 శాతం డిజిటలైజ్ చేయడం పై బూత్ లెవెల్ ఏజెంట్లు కృషి చేయాలన్నారు. ఓటర్ల ఎన్యూమరేషన్ ఫార్మ్స్ ను బూతు లెవెల్ అధికారుల బిఎల్ఓ లకు సకాలంలో అందించాలన్నారు. సార్ ప్రక్రియ విజయవంతం చేసేందుకు క్షేత్రస్థాయిలో కృషి చేస్తున్న బిఎల్ఎ లను మంత్రి దామోదర్ రాజనర్సింహ గారు అభినందించారు. ఈ కార్యక్రమంలో పిసిసి డాక్టర్స్ సెల్ చైర్మన్ డా. రాజీవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, సంగమేశ్వర్, జోగిపేట మున్సిపాలిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు జగన్ మోహన్ రెడ్డి, సురేందర్ గౌడ్, ఏఎంసి చైర్మన్ లు జగన్ మోహన్ రెడ్డి, సుధాకర్ రెడ్డి లు ఆందోల్ నియోజకవర్గం లోని అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిల్లోడి సతీష్ కుమార్, దుర్గారెడ్డి, దిగంబర్ రావు, నిమ్మ రమేష్, విశ్వాస్, డాకూర్ వెంకటేష్, కౌన్సిలర్స్, మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు మర్రి అరుణ, ఇతర ప్రజా ప్రతినిధులు, సర్పంచ్ లు, ముఖ్య నాయకులు, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

## శివంపేట బీర్ ఫ్యాక్టరీ వ్యర్థ జలాల విడుదలపై అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన








చౌటకూర్, సెప్టెంబర్ 1 (విజన్ ఆంధ్ర): చౌటకూర్ మండలం శివంపేట గ్రామ శివారులోని బీర్ ఫ్యాక్టరీ నుంచి రసాయన వ్యర్థ జలాలు బయటకు వస్తున్నాయంటూ గ్రామస్తులు ఇటీవల అధికారులకు, స్థానిక మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ ఫిర్యాదులపై స్పందించిన ఉన్నతాధికారులు మంగళవారం పరిశ్రమ పరిసర ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. అడిషనల్ కలెక్టర్ పాండు, కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అధికారులు సంయుక్తంగా పరిశ్రమను సందర్శించారు. వ్యర్థ జలాలు ఏయే మార్గాల ద్వారా బయటకు వస్తున్నాయి, అవి ఎటు ప్రవహిస్తున్నాయి, పరిసర ప్రాంతాలపై వాటి ప్రభావం ఎంతమేర ఉందనే అంశాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ పరిశ్రమ నుంచి వెలువడుతున్న వ్యర్థ జలాలు మంజీరా నది పరివాహక ప్రాంతాల్లో కలుస్తుండటంతో భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.దీనివల్ల పంట పొలాలు దెబ్బతినడంతో పాటు పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లుతోందని తెలిపారు.తక్షణమే సమగ్ర విచారణ జరిపి, కాలుష్య నియంత్రణ నిబంధనలు ఉల్లంఘించిన పరిశ్రమ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ సమస్యపై స్పందించి అధికారులు పరిశీలనకు రావడం పట్ల గ్రామస్తులు సంతృప్తి వ్యక్తం చేస్తూనే, మంజీరా పరివాహక ప్రాంత పరిరక్షణకు శాశ్వత పరిష్కారం చూపి వ్యర్థ జలాల విడుదలను పూర్తిగా అరికట్టాలని కోరారు.

# తెలంగాణ రాజకీయ కురుక్షేత్రం!!

- వేయి రోజులు.. మూడు దారులు
- కాంగ్రెస్ 'ప్రజా పాలన' ఉత్సవాలు
- గ్యారెంటీ, హామీల మోసాలపై బీఆర్ఎస్ సమరభేరి
- 420 హామీలపై బీజేపీ ప్రశ్నల వర్షం


*వేయి రోజుల వేళ.. మూడు దారుల పోరుబాట. కాంగ్రెస్ విజయోత్సవం.. బీఆర్ఎస్ సమరభేరి.. బీజేపీ చార్జ్‌షీట్. హామీలు, అభివృద్ధి, వైఫల్యాలపై ముదిరిన త్రిముఖ రాజకీయ సమరం. పల్లె నుంచి పట్నం వరకు వేడెక్కుతున్న తెలంగాణ రాజకీయ యవనికపై "విజన్ ఆంధ్ర" ఎలైట్ పొలిటికల్ స్టోరీ*




హైదరాబాద్, సెప్టెంబర్ 1: తెలంగాణ రాజకీయ యవనికపై ఎన్నికల వేడి మళ్లీ రాజుకుంది. అధికారం చేపట్టి వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న వేళ కాంగ్రెస్ విజయఢంకా మోగిస్తుంటే, అదే వేయి రోజులను వైఫల్యాల చిట్టాగా మారుస్తూ విపక్షాలు అయిన బీజేపీ, బీఆర్ఎస్ కదనరంగంలోకి దూకాయి. సంబరాలు ఒకవైపు, సమర శంఖారావం మరోవైపు, నిరంతర నిలదీతలు ఇంకోవైపు... వెరసి రాష్ట్రంలో రాజకీయ వాతావరణం పారదశక స్థాయికి చేరింది.

**హస్తం మార్క్ 'ప్రజా పాలన' ఉత్సవాల జోరు**

గాంధీ భవన్ నుంచి సచివాలయం వరకు, ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ నుంచి ప్రధాన కూడళ్ళ వరకూ కాంగ్రెస్ శ్రేణులు పండుగ వాతావరణంలో మునిగిపోయాయి.




**రైతు సంక్షేమం అలాగే సంక్షేమ పథకాలు**

రుణమాఫీ అమలు, ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి పథకం వంటివి నేరుగా సామాన్యుడి ముంగిటకు చేర్చామన్నది ప్రభుత్వ ప్రధాన వాదన.

**ఆత్మవిశ్వాసంతో ముందడుగు**

గత పదేళ్ల పాలనతో పోలిస్తే స్వేచ్ఛాయుత 'ప్రజా పాలన'ను రాష్ట్రంలో నిలబెట్టామని, ఇచ్చిన హామీల అమలులో వెనుకడుగు వేసే ప్రసక్తే లేదని పాలకపక్షం ఘనంగా చాటుతోంది.

**గులాబీ దళం సమరభేరి ప్రజా క్షేత్రంలో ఎదురుదాడి**

కాంగ్రెస్ పండుగ చేసుకుంటుంటే, బీఆర్ఎస్ మాత్రం క్షేత్రస్థాయి పోరాటాలకు పదును పెట్టింది.

**వైఫల్యాల ఎండగట్టడం**


వేయి రోజుల పాలనలో తెలంగాణ అభివృద్ధి తిరోగమనంలో పడిందని, రైతు భరోసా, నిరుద్యోగ భృతి, సాగునీటి నిర్వహణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని గులాబీ శ్రేణులు ఆరోపిస్తున్నాయి.

**జనంలోకి ఉద్యమ స్వరం**

నిరసన దీక్షలు, పాదయాత్రలు, ప్రజాక్షేత్ర పోరాటాల ద్వారా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ క్యాడర్‌లో సరికొత్త ఉత్సాహం నింపేలా సమరభేరి మోగిస్తోంది.

**కమల దళం 'చార్జ్‌షీట్'**

6 గ్యారంటీలు.. 420 హామీల నిలదీత




మరోవైపు భారతీయ జనతా పార్టీ ప్రజల పక్షాన నిలబడి తీవ్రస్థాయి దాడికి దిగింది.

**హామీల పత్రంపై పదునైన ప్రశ్నలు**

ఎన్నికల వేళ కాంగ్రెస్ ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలు ఏమయ్యాయని బీజేపీ నిలదీస్తోంది. మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చి ప్రజలను వంచించారని విమర్శిస్తోంది.

క్షేత్రస్థాయి కార్యాచరణ గ్రామగ్రామానా ప్రజలతో కలిసి నిరసన కార్యక్రమాలు, రచ్చబండలు నిర్వహిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతోంది.

ఒకవైపు చేసిన పనుల లెక్కలతో పాలకపక్షం, మరోవైపు చేయని పనుల చిట్టాతో విపక్షాలు తలపడుతుండటంతో తెలంగాణ పల్లె నుంచి పట్నం వరకు రాజకీయాలు రసవత్తరంగా మారాయి. వేయి రోజుల మైలురాయి వద్ద మొదలైన ఈ త్రిముఖ సమరం రాబోయే రోజుల్లో ఇంకెన్ని మలుపులు తిరుగుతుందో చూడాలి.

**- గడ్డం సంతోష్ రాజ్**

**స్పెషల్ కరస్పాండెంట్ విజన్ ఆంధ్ర**

# సిబ్బంది సంక్షేమమే పోలీస్ అధికారుల సంఘం ప్రధాన లక్ష్యం

- వనపర్తి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి
- పోలీస్ అధికారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక





వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 1 (విజన్ ఆంధ్ర): పోలీస్ సిబ్బంది సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా నూతన కార్యవర్గం పనిచేయాలని వనపర్తి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పోలీస్ అధికారుల సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. ఈ సందర్భంగా ఎన్నికైన 13 మందితో కూడిన నూతన కార్యవర్గానికి ఎస్పీ అభినందనలు తెలిపారు. నూతన అధ్యక్షులు గోవిందు (హెడ్ కానిస్టేబుల్, ఐటీ సెల్) ఉపాధ్యక్షులు అప్పలనాయుడు (వెల్ఫేర్ ఆర్ఐ), జయన్న (ఎస్సై, ఆత్మకూరు) కార్యదర్శి నాగరాజు (ఏఆర్ఎస్సై, డిఏఆర్) జాయింట్ సెక్రటరీ సురేందర్ (కానిస్టేబుల్, వీపనగండ్ల) ఆర్గనైజింగ్ సెక్రటరీ మధు (కానిస్టేబుల్, శ్రీరంగాపూర్) కోశాధికారి రాజశేఖర్ (కానిస్టేబుల్, వనపర్తి టౌన్) కార్యవర్గ సభ్యులు రమేష్ బాబు, ఆంజనేయులు, అశోక్ నాయుడు, బాలయ్య, నాగలక్ష్మి, సుజాత. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సిబ్బంది ఎదుర్కొంటున్న సాధకబాధకాలు, సంక్షేమానికి సంబంధించిన అంశాలను సంఘం ప్రతినిధులు నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని చెప్పారు. నూతన కార్యవర్గం పరస్పర సమన్వయంతో పనిచేస్తూ సిబ్బంది హక్కులు, అవసరాల కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతీ ఒక్కరూ విధి నిర్వహణలో క్రమశిక్షణ, బాధ్యత, నిబద్ధతతో వ్యవహరిస్తూ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలన్నారు. చట్ట విరుద్ధంగా లేదా శాఖ ప్రతిష్టకు భంగం కలిగించేలా వ్యవహరిస్తే నిబంధనల ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ బాలాజీ నాయక్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు అప్పలనాయుడు, శ్రీనివాస్, పోలీస్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# 1000 రోజుల పాలన పేదల అభివృద్ధి కోసమే

- డాక్టర్ పిడమర్తి రవి




ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 1000 రోజుల విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా హిమాయత్ నగర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రామన్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి లిముఖ్య అతిథిగా ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ పిడమర్తి రవి హాజరయ్యారులి . ఈ సందర్భంగా పిడమర్తి రవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ప్రజాపాలనలో వెయ్యి రోజులు పేదల కోసమే ప్రజా పాలన జరిగిందని పేదలకు ఇందిరమ్మ ఇల్లు రేషన్ కార్డులు మహిళ ఉచిత బస్సు సౌకర్యం మరియు అనేకమంది పేదల భూములను కార్పొరేట్ శక్తులు కబ్జాకు చేస్తున్న సందర్భంలో హైదరాబాద్ పేదల భూములను రక్షించిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి చెందుతుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై గ్రామస్థాయిలో ప్రతి ఒక్కరు సంతోషంగా ఉన్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిపై ప్రగాఢ నమ్మకం పెరిగిందని రానున్న రోజుల్లో ముఖ్యమంత్రి మరియు మంత్రి మండలి ఆధ్వర్యంలో చేపట్టే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి ప్రజా పాలన ప్రతి పేదవారు నేరుగా ప్రభుత్వ ని కలిసి తమ విజ్ఞప్తులను సమర్పించుకునే సమయం ఇస్తున్నందుకు రేవంత్ రెడ్డి గారికి కృతజ్ఞతలు అని అన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ నాయకులు బట్టు శ్రీహరి నాయక్, శ్రీధర్ గౌడ్, సతీష్ కుమార్, చంద్రశేఖర్ రెడ్డి, డాక్టర్ బొమ్మెర స్టాలిన్, బోరెల్లి సురేష్, దేవరకొండ నరేష్ చందర్ నాయక్ నక్క మహేష్ బాలు తదితరులు పాల్గొన్నారు.

# పుర కార్మికుడిపై ఛైర్‌పర్సన్ భర్త బెదిరింపులు..!

- దళిత మున్సిపల్ కార్మికుడిపై దురుసు వైఖరి.. వైరల్‌గా ఆడియో
- బీఆర్ఎస్ కౌన్సిలర్ ఎవరు..? అంటూ కార్మికుడిపై ఆగ్రహం
- మీరు కాంగ్రెస్ అభ్యర్థి వారు చెబితేనే వినాలి ..
- "యూజ్‌లెస్ ఫెలో" అంటూ కార్మికుడికి తిట్లు..
- పుర సిబ్బందిపై రాజకీయ పెత్తనమా..?
- గిరిజన కౌన్సిలర్,దళిత కార్మికులపై అవమానకర వ్యాఖ్యలంటూ ఆరోపణలు
- వీధిలైట్ల విషయంలో రగడ.. సోషల్ మీడియాలో వైరల్ ఆడియో
- అధికారుల ఆదేశాలా..? ఛైర్‌పర్సన్ భర్త హుకుం నడుస్తోందా..?
- మున్సిపాలిటీలో ప్రజాస్వామ్యానికి చోటేదీ..?



సూర్యాపేట సెప్టెంబర్ 01:(విజన్ ఆంధ్ర) : సూర్యాపేట మున్సిపాలిటీలో పాలకవర్గానికి చెందిన వ్యక్తుల జోక్యంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణంలోని 4వ వార్డులో వీధిలైట్లు ఏర్పాటు చేసే విషయంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త, మున్సిపల్ ఎలక్ట్రిషియన్ కార్మికుడితో ఫోన్‌లో మాట్లాడినట్లు చెబుతున్న ఆడియో సోషల్ మీడియాలో వైరల్ కావడం చర్చనీయాంశంగా మారింది.వీధిలైట్లు ఏర్పాటు చేసే విషయంలో బీఆర్ఎస్ కౌన్సిలర్ వార్డు ప్రజా ప్రతినిధి చెప్పిన మాట విని లైట్లు ఎలా వేస్తావంటూ మున్సిపల్ కార్మికుడిని ప్రశ్నిస్తూ బెదిరించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. "బీఆర్ఎస్ కౌన్సిలర్ ఎవరు..? ఓడిన కాంగ్రెస్ అభ్యర్థి వారు చెబితేనే చేయాలి ..?" అంటూ ప్రశ్నించినట్లు ఆడియోలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

**అధికారి ఎవరు.. నేను ఇస్తున్నా అంటూ హుకుం..**

మున్సిపల్ అధికారులు, సిబ్బంది నిబంధనల ప్రకారం విధులు నిర్వహించాల్సి ఉండగా,అధికారి ఎవరు.. నేను ఇస్తున్నా' అంటూ హుకుం...మున్సిపల్ అధికారులు, సిబ్బంది విధులు నిబంధనల ప్రకారం నిర్వహించాల్సి ఉండగా,అధికారి ఎవరు.. వాడి ఇంటి నుంచి ఇస్తున్నాడా.. నేను ఇస్తున్నా అంటూ ఆదేశాలు జారీ చేసినట్లు ఆడియోలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అంతేకాకుండా పుర కార్మికుడిని "యూజ్‌లెస్ ఫెలో"అంటూ దూషించినట్లు ఆరోపణలు ఉన్నాయి.ఒక దళిత కార్మికుడిని అవమానించడం సరికాదంటూ విమర్శలు ప్రజలకు సేవలందించే మున్సిపల్ కార్మికులపై రాజకీయ ఒత్తిళ్లు, బెదిరింపులు ఉండకూడదని పలువురు అభిప్రాయపడుతున్నారు.ముఖ్యంగా గిరిజన కౌన్సిలర్, దళిత పుర కార్మికులను అవమానించేలా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలపై అధికారులు స్పందించాల్సిన అవసరం ఉందని కోరుతున్నారు.

**వైరల్ ఆడియోపై అధికారుల స్పందన ఏంటి..?**

మున్సిపల్ సిబ్బంది ఎవరి రాజకీయ ఆదేశాలకు కాకుండా నిబంధనల ప్రకారం విధులు నిర్వహించేలా చూడాల్సిన బాధ్యత పాలకవర్గంతో పాటు అధికారులపై ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. వైరల్ అవుతున్న ఆడియోపై మున్సిపల్ అధికారులు విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని, పుర కార్మికులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

# సిపిఎస్ రద్దు చేసి.. పాత పింఛన్ పునరుద్ధరించాలి

- తహసీల్దార్‌కు టీజీఈజేఏసీ వినతిపత్రం అందజేత



వనపర్తి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 1 (విజన్ ఆంధ్ర) : పెన్షన్ విద్రోహ దినోత్సవం సందర్భంగా టీజీఈజేఏసీ పిలుపులో భాగంగా పెబ్బేరు మండల ఎంఆర్ఓ (తహసీల్దార్)కు మంగళవారం ఉద్యోగ, ఉపాధ్యాయ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు నష్టం చేకూరుస్తున్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ను వెంటనే రద్దు చేసి, పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియుటిఎస్ జిల్లా అధ్యక్షుడు కె. నరసింహ నాయుడు, జిల్లా నాయకుడు శ్రీను, మండల అధ్యక్షుడు రామచంద్రుడు, ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.